

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుమలేశుని బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న ఏడుకొండలు 3లో

బ్రిక్స్ సదస్సుకోసం రష్యాకు అజిత్ దోవల్ 5లో


తాడేపల్లిగూడెం : fb.com/vaartha

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

9-9-2024 సోమవారం సంపుటి: 30 సంచిక: 222 పేజీలు: 10+4 వెల: 6.50


# వరద నష్టం రూ.6882 కోట్లు

- ప్రాథమిక నివేదిక సిద్ధం
- విజయవాడలోకి ఇక వరద నీరు రాకుండా చర్యలు
- బుడమేరు మూడుగండ్లు పూడ్చివేత
- నేటి నుంచి ఇంటింటికి వెళ్లి పూర్తినష్టం అంచనా



**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో భారీ వర్షాలు,వరదల కారణంగా రూ.6,882 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం ప్రాథమిక నివేదికను సిద్ధం చేసింది. ఈ మేరకు ప్రాథమిక నివేదికను రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి పంపిస్తున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు.వినాయక చవితిరోజు రాష్ట్రంలో చారిత్రాత్మక దినమన్నారు.బుడమేరు మూడు గండ్లు పూడ్చివేసామన్నారు.మన ఇంజినీరింగ్ విభాగం పనితీరును ఆర్మీ ప్రశంసిందన్నారు. బుడమేరు గండ్లు పూడ్చేందుకు జరిగిన చర్యలను వానను లెక్క చేయకుండా మంత్రులు నిమ్మల రామానాయుడు, నారా లోకేష్ పర్యవేక్షించారు,వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ లోకి నీళ్ల రావని, భవిష్యత్తులో కూడ వరదలు వచ్చినా నీళ్ల రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఆర్ అండ్ బీకి రూ.2,164.5 కోట్లు,నీటి వనరుల శాఖకు రూ.1568.5 కోట్లు,పురపాలక శాఖకు రూ.1,160 కోట్లు,రెవిన్యూ శాఖకు రూ.750 కోట్లు,విద్యుత్ శాఖకు రూ.481 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.201 కోట్లు,పంచాయితీ రోడ్లకు రూ.167.5 కోట్లు,మత్స్య శాఖకు రూ.157.86 కోట్లు,గ్రామీణ నీటి సరఫరాకు రూ.75.5 కోట్లు,ఉద్యానశాఖకు 39.9 కోట్లు,పశుసంవర్ధక శాఖకు రూ.11.5 కోట్లు,అగ్నిమాపక శాఖకు రూ.2 కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

ఇప్పటికే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రంలో పర్యటించి వరదను అంచనా వేశారు.ఆదివారం సైతం వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సిఎం చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. వరద భాధితుల కష్టాలను దృష్టిలో ఉంచుకునే పండుగ పూట కూడా అవిశ్రాంతంగా పనిచేస్తున్నామన్నారు. నిత్యావసరాల పంపిణీ,పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బాధిత ప్రజలకు త్వరితగతిన రిలీఫ్ ఇచ్చేందుకు పండుగ నాడు కూడ పని చేయాలని కోరారు. రేపు సాయంత్రానికి పూర్తిగా వీధుల్లో వరద నీరు తగ్గిపోతుందన్నారు. బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ కూడ శరవేగంగా జరుగుతోందన్నారు. పంపిణీ త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. వరద ప్రభావం వల్ల 6వ డివిజన్‌లో నిత్యావసర సరుకులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కోరుతున్నారని,వారికి కూడ సరుకుల కిట్‌లను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లల్లోజరిగిన నష్టంపై >>2



ఆదివారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# గవర్నర్ నజీర్‌తో సిఎం చంద్రబాబు భేటీ

## వరద పరిస్థితి, సహాయ చర్యలపై గవర్నర్‌కు వివరించిన ముఖ్యమంత్రి

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు ఆదివారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. బుడమేరు వరద ముంపుతో విజయవాడ పట్టణానికి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాలకు జరిగిన భారీ నష్టాన్ని గురించి సిఎం చంద్రబాబు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వివరించారు. ప్రధానంగా బుడమేరు ముంపుతో విజయవాడ విలయవాడగా మారిందని, వరదలు తెరపిచ్చి,వారం దాటుతున్నా అనేక ప్రాంతాలు ఇంకా ముంపులో ఉన్నాయని వివరించారు. తాజాగా మళ్లీ బంగాళాఖాతంలో >>2



ఆదివారం బోర్నగూడెం వద్ద లోయలో పడిన బస్సు

# లోయలోపడిన ఆర్టీసీ బస్సు

## బోర్నగూడెం వద్ద దుర్ఘటన, 16 మందికి గాయాలు

**రాజవొమ్మంగి , సెప్టెంబరు 8, ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం గ్రామ సమీపంలో ఆదివారం మద్యాహ్నం ఓ బస్సు ఆర్అండ్‌బి రహదారిపై ఉన్న ఇనుప వంతెనను ఢీకొట్టి ప్రక్కనే ఉన్న లోయలోకి దూసుకుని వెళ్లింది. ఈప్రమాద సమయంలో 25 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారు.ఆసమయంలో రాజవొమ్మంగి నుండి అడ్డతీగల మండలం తిమ్మాపురంలో జరిగే ఓ కార్యక్రమానికి వెళ్తున్న అరకు పార్లమెంట్ టిడిపి ఉపాద్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు, మండల టిడిపి అద్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి దన్నుదొర,శివ,మరిచర్ల శ్రీనివాస్, లోవరాజు, నూకరాజులు బస్సులో నుండి ప్రయాణికులను బయటకు తీసారు. కొంతమంది అద్దాలను బద్దలు కొట్టుకుని బయటకు వచ్చారు. గాయాలు అయిన అందరినీ ఆటోలో తరలించడానికి టిడిపి నాయకులు సహకరించినట్లు బాధితులు తెలిపారు. జెడ్డంగి పిహెచ్‌సికి చేరిన 16 మందికి వైద్యాధికారి డా.నాగార్జున వైద్య పరీక్షలను చేసి వారిలో ఆరుగురిని మెరుగైన వైద్యానికి రాజమండ్రి, ఏలేశ్వరం, నర్సీపట్నం రిఫర్ చేసారు. ప్రయాణికులు ఇచ్చిన పిర్యాదుపై రాజవొమ్మంగి సిఐ సన్యాసి నాయుడు >>2

# మున్నేరుకు మరింత వరద



## మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

## డేంజర్ జోన్‌లో మున్నేరు పరీవాహక ప్రాంతం

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** మున్నేరు వరద ప్రమాదం పొంచి ఉండటంతో ఉభయ తెలుగురాష్ట్రాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ఖమ్మంలోని మున్నేరుకు వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం ప్రవాహం 16 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. 24 అడుగులకు చేరితో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. అధికారులు వరద ప్రభావిత కాలనీల్లోని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతం డేంజర్ జోన్‌లో ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రికి మళ్లీ వరద వచ్చే అవకాశం ఉంది. ఈ వరద ప్రభావం ఆంధ్ర ప్రాంతంపై స్పష్టంగా కనపడే అవకాశం ఉంది.దిగువ నీరు తన్నుకుని రావడంతో ఇటీవల ఎన్టీఆర్ జిల్లా పరిధిలో క్యాజ్‌వే కొట్టుపోయిన లింగాల వత్సవాయి,ఖమ్మం ప్రాంతాల్లో మున్నేరు ఉద్రృతంగా ఉంది.పెనుగంచి ప్రోలు దగ్గర వరద పొంగి ప్రవహిస్తుంది.నందిగామ,కీసర వంతెనల దిగువన మున్నేరు వరద ఉధృతి అధికంగా ఉంది.దీంతో ఎపి అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.వారిని సిఎం చంద్రబాబు ఎలెర్ట్ చేసారు.

ఇదే సందర్భంలో ఖమ్మం ప్రాంతంలో వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేయనున్నారు. అక్కడి ప్రభుత్వం చేపట్టిన పునరావాస కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. శనివారం రాత్రి మున్నేరు ముందు ప్రాంతాల్లో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క పర్యటించారు. ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.

ఆదివారం మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు,పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం రానున్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని వారు అధికారులను ఆదేశించారు. వరద తీవ్రత పెరిగినా ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆదివారం రాత్రి కలెక్టర్,సిపీ ముందు కాలనీల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

మరోవైపు ఎగువన ఉన్న మహబూబాబాద్, గార్ల,బయ్యారం మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది.

### బుడమేరు వరద నీటిలో చిక్కుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నానికి చెందినసాఫ్ట్‌వేర్ ఉద్యోగి కలిదిండి ఫణికుమార్ బుడమేరు వరద నీటిలో చిక్కుకున్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న ఆయన వినాయకచవితి సందర్భంగా స్వగ్రామానికి వెళ్లారు. శనివారం గన్నవరంలోని బంధువుల ఇంటికి వెళ్లి సాయంత్రం తిరిగి మచిలీపట్నం బయల్దేరాడు. విజయవాడ మీదుగా వెళ్లాలని స్థానికులు చెప్పినా వినిపించుకోలేదు. కేసరపల్లి-ఉప్పులూరు-కంకిపాడు మీదుగా వెళ్తానంటూ దూసుకొచ్చి బుడమేరు వాగు వరద నీటిలో చిక్కుకున్నాడు. అతడిని బయటకు తీసేందుకు స్థానికుల సహాయంతో పోలీసులు యత్నిస్తున్నారు.



# వర్షాలపై అధికారులు అప్రమత్తం కావాలి

## హెచ్చరించిన డి.సిఎం పవన్

## నేడు కాకినాడ జిల్లా పర్యటన

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** వరదలు,భారీ వర్షాల హెచ్చరికలను అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు.ఇక్కడి తన వ్యక్తిగత మజిలీ కార్యాలయం నుంచి ఆయన అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా వరదలు,సహాయక చర్యలపై ఏలేరు రిజర్వాయర్‌పై చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేరు రిజర్వాయర్‌కి జల ప్రవాహం పెరుగుతుండటం,వర్షాల కారణంగా వరద ముప్పు పొంచి ఉండటంతో ముందస్తు జాగ్రత్తలు.ముంపు ప్రభావిత గ్రామాల పరిస్థితిపై పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగం చేపట్టాలన్నారు.

24 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఏలేరు రిజర్వాయర్‌కి ఇప్పటికి 21 టీఎంసీలకు చేరడం వలన అందరం జాగ్రత్త పడాలన్నారు. >>6



పెద్దావెం ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

# బోటులోనే డెలివరీ!

## అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలింపు

## వరద ప్రాంతం నుంచి గర్భిణిని కాపాడిన అధికారులు

**విజయవాడ కార్పొరేషన్,సెప్టెంబరు 8,ప్రభాత వార్త:** వాంబే కాలనీలో నొప్పులతో భాధపడుతున్న గర్భిణీ స్త్రీని సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వరకు తరలించే దారిలో,నగరపాలక సంస్థ బోటులోనే సదరు మహిళ ప్రసవించింది. నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్‌వారి బృందం అజిత్‌సింగ్‌నగర్ ఫ్లైఓవర్ వద్దకు బోటును తీసుకొచ్చాక అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి,బిడ్డ క్షేమమని డాక్టర్ తెలిపారు. సిఎం ఆదేశాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నుండి వచ్చిన అత్యవసర ఫిర్యాదును,విజయవాడ నగరపాలక సంస్థ బృందం,తక్షణమే చర్యలు తీసుకున్నారు.

# వరద ముంపు ప్రాంతాల్లో నేటినుంచి ఆరోగ్య సర్వేలు

## విజయవాడలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న మెడికల్ క్యాంపులు

## లక్ష పైగా మెడికల్ కిట్ల పంపిణి, వ్యాధులు సంక్రమించకుండా గట్టి చర్యలు : మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** వరద ముంపు ప్రాంతాలో ఈ నెల 9వ తేది నుండి 3 రోజులపాటు ఆరోగ్యన సర్వేలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. విజయవాడ చరిత్రలో కనీవిని ఎరగని రీతిలో విపత్తు సంభవించింది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్‌లో సిఎం చంద్రబాబు వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షను నిర్వహించారు.ఈ వివరాలను సత్యకుమార్ యాదవ్ మీడియాకు వివరించారు, ఇప్పటికే విజయవాడ నగర 32 వార్డుల్లో 184 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసాం.లక్షకు పైగా మెడికల్ కిట్లు పంపిణీ చేశాం. రానున్న రోజుల్లో ఇతర ప్రాంతాల్లో కూడ పంపిణీ.సర్వే ద్వారా ఇతర ఆరోగ్య సమస్యలున్న వారికి కూడ చికిత్సను అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

దార్శనికత,ప్రజల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి కల్గిన నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో ఇప్పుడు విజయవాడలో చూస్తున్నామన్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బుడమేరుకు గండ్లు ఏర్పడ్డాయని, భారీ వర్షాలు వరద ధాటికి 32 వార్డు సచివాలయాలు నీట మునిగాయన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో సిఎం చంద్రబాబు కలెక్టరేట్‌నే క్యాంపు ఆఫీస్‌గా మార్చుకొని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఆరోగ్యశాఖ కూడ మరింత అప్రమత్తమైందని, 32 వార్డు సచివాలయాల్లో 184 మెడికల్ >>2

### డక్కిలి వెలుగు కార్యాలయంలో ఏడుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

**డక్కిలి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా డక్కిలి మండల వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందిపై సస్పెన్స్ వేటు పడింది. ఈ కార్యాలయంలో పనిచేస్తూ పేదలు, నిరక్ష్యరాసులు అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను మళ్లించి వారు స్వాహ చేసిన వ్యవహారంలోఉమ్మడి నెల్లూరు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఆ జిల్లా డిఆర్‌డీఏ పీడీ సాంబ శివారెడ్డి ఈనెల 6వతేదిన ఆదేశాలు ఇచ్చారు. ఈవ్యవహారానికి సంబంధించి పూర్వపరాలు >>6




ఆదివారం ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్ల పనులు పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

# 'ప్రకాశం' గేట్లు పనులు పరిశీలించిన సిఎం

## బ్యారేజి పటిష్టతకు నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశం

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకాశం బ్యారేజి గేట్లను సిఎం చంద్రబాబు నాయుడు పరిశీలించారు. గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కౌంటర్ వెయిట్ల వద్ద జరుగుతున్న పనులపై ఆరా తీశారు. గేట్ల వద్ద అడ్డుపడిన బోట్లను ఆయన పరిశీలించారు. కృష్ణానదీ ప్రవాహం గురించి ఇంజనీర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎగువ నుండి భారీగా ప్రవాహం వస్తోందని ఇంజనీర్లు సిఎంకు వివరించారు. కౌంటర్ వెయిట్ల నిర్మాణంలో కృషి చేసిన వారిని ఈ సందర్భంగా ఆయన అభిందించారు. ప్రకాశం బ్యారేజీ పటిష్టతకు నివేదిక ఇవ్వాలని సిఎం కోరారని కన్నయ్య నాయుడు తెలిపారు. డ్యామ్‌కు, గేట్లకు ప్రమాదం జరుగకుండా.. ప్రవాహానికి అడ్డుగా ఉన్న నాలుగు బోట్లు తీయాల్సిన అవసరం ఉందన్నారు. కృష్ణానదికి వరద ఉధృతి మళ్లీ పెరుగుతుంది.

దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.ఈ సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక చేసే అవకాశం ఉంది.ఎగువ నుంచి వస్తున్న నీటి వలన ప్రకాశం బ్యారేజీకి వరద నీరు చేరింది.శ్రీశైలం డ్యాం వద్ద ఇన్‌ఫ్లో 2.86,ఔట్ ఫ్లో 3.09 లక్షల క్యూసెక్కులు వస్తుంది.నాగార్జున సాగర్ వద్ద ఇన్‌ఫ్లో,ఔట్ ఫ్లో 2.99 లక్షల క్యూసె >>2



ఆదివారం సిఎం చంద్రబాబుకు రూ.కోటి విరాళం చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

# రూ. 6882 కోట్లు

>> ఎన్యూమరేషన్ కూడ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. వరద ప్రాంతాల్లో పారిశుద్ధ్యపనులను అధికారులు సిఎం చంద్రబాబుకు వివరించారు. ఫైరింజన్లతో రోడ్లు, కాలనీలు, ఇళ్ల శుభ్రతను మరింత వేగవంతం చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. బుడమేరు పడిన గండ్ల పూడ్చివేత పనులను సిఎం చంద్రబాబు కాన్ఫరెన్స్‌లో అధికారులు వివరించారు. బుడమేరు గండ్ల పూడ్చివేతలో భారత ఆర్మీకి చెందిన టాస్క్‌ఫోర్స్ విభాగం పనిచేస్తోంది.యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టి,ఇప్పటికే మూడు గండ్లను పూడ్చివేసారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు నిత్యావసర కిట్లను నేటి నుంచి పంపిణీ చేయనున్నారు.పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వీటిని పంపిణీ చేస్తారు.మొదటి రోజు 50వేల కుటుంబాలకు కిట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసారు.ఒక్కో కిట్‌లో 25 కేజీల బియ్యం,కిలో కందిపప్పు, కిలో పంచదార,రెండు కిలోల చొప్పున ఉల్లిపాయలు, బంగాళ దుంపలు లీటరు నూనె ఉంటాయి,మొత్తం రెండు లక్షల కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేందుకు వీటిని ఏర్పాట్లు చేసారు.ఈపోస్ మిషన్ ద్వారా వీటిని పంపిణీ చేయనున్నారు.రేషన్‌కార్డు లేని వారికి ఆధార్,బయోమెట్రిక్ ద్వారా కిట్లను అందించనున్నారు., ప్రతి కుటుంబానికి సాయం అందించాలన్నారు. వరదల్లో చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించాలని చెప్పారు. ఎవరూ రాకపోతే ప్రభుత్వం తరపున గౌరవంగా అంత్యక్రియలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి సచివాలయంలో ఒక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి నిత్య వసరాలు అందజేయాలి. 25 కిలోల బియ్యం, లీటర్ పామాయిల్, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళదుంపలు, కిలో చక్కెర ఇవ్వాలి. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం తరపున అందించాలి. జ్వరాల నుంచి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఎవరికి ఏ మెడిసిన్ కావాలన్నా అందుబాటులో ఉండాలి.ఇంటింటికీ వెళ్ళి మందుల కిట్లు ఇవ్వాలన్నారు. పంటనష్టంపై అంచనాలు నమోదు చేయాలి అని చంద్రబాబు తెలిపారు. వరదలకు ముంపుకు గురయ్యే ప్రాంతాలకు భారీగా నిధులు కేటాయించి,భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్లల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక స్టవ్వో, ఏసీనో, ఫ్రిజ్ ఇలా వివిధ వస్తువులు పోయాయి. బట్టలు, ఫర్నీచర్ వంటివి పాడయ్యాయి. ఇలాంటి దానికి ఏం చేయాలో ఆలోచిస్తున్నాం. మొదటగా బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించాం. రుణాల రీషెడ్యూల్ లేదా రుణ భారం తగ్గించడం ఇలా ఏం చేయాలనుకుంటామో సీరియస్‌గా ఎవసర్‌సైజ్ చేస్తున్నాం,వరద బాధితులకు రేషన్ చేరుస్తున్నాం. నిన్నటికి 4,17,080 మందికి బ్రేక్‌ఫాస్ట్‌ను పంపామన్నారు. 66,454మందికి రేషన్ చేర్చామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం నుండి నష్ట గణన ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇందుకోసం బయటి నుండి ఎన్యూమరేటర్స్‌ను పిలిపించాం. వారందరికీ ఆదివారం శిక్షణ ఇస్తాం. ఇళ్లు,దుకాణాలు,ఇలా అన్నింటినీ ఎన్యూమరేట్ చేసి చెస్తాం.ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఈ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడానికి కార్యక్రమాలు చేపడుతోంది. చాలా మంది బురదలో ఉండిఉండి మానసికంగా ఆందోళన చెందే పరిస్థితి వచ్చింది. వీరు బయటకు వెళ్లడం వల్ల ఆందోళన కొంత తగ్గుతుందని భావించి ఉచితంగా బస్సు సర్వీసులు కూడ నడుపుతున్నామన్నారు.

## సిఎం సహాయనిధికి రూ.కోటి విరాళం

### అందజేసిన డి.సిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ కలెక్టరేట్ ప్రాంగణంలో ముఖ్య మంత్రి చంద్రబాబుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. వరద బాధితులకు సహాయార్ధం ప్రకటించిన రూ.కోటి చెక్కును చంద్రబాబు నాయుడుకు పవన్‌కల్యాణ్ అంద జేశారు. పవన్‌కల్యాణ్ ఆరోగ్యంపై ముఖ్యమంత్రి ఆరా తీసారు. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన వినాయకునికి ఉపముఖ్య మంత్రి పూజాదికాలు నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా రూ.ఆరుకోట్లు విరాళం ప్రకటించారు.ఆయన ఇందులో ఏపి సిఎం వరదసహాయనిధికి రూ.కోటిని ప్రకటించి, ఆ చెక్కును వ్యక్తిగతంగా అందించారు.పవన్ తెలంగాణ వరద బాధితులకు అక్కడి ముఖ్య మంత్రి సహాయనిధికి రూ.1కోటిని ప్రకటించారు.400 గ్రామ పంచాయితీలు ఒక్కొంటికి రూ.లక్ష ప్రకటించారు.

## పరిశీలించిన సిఎం

>> క్యులు, పులిచింతల వద్ద ఇన్‌ఫ్లో 2.75 ఔట్ ఫ్లో 2.97 లక్షల క్యూసెక్కులు ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో,ఔట్‌ఫ్లో 3.88 లక్షల క్యూసెక్కులు, వాగులు,వంకలు పొంగిపొర్లుతున్నాయి. జాగ్రత్తగా ఉండాలి.తీర ప్రాంత ప్రజలు అప్రమత్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.దీంతో పాటు రాష్ట్రంలో మళ్లీ వర్షాలు బంగాళా ఖాతంలో అల్ప పీడనం కారణంగా కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి.ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఏలేరు రిజర్వా యర్‌కు ఎక్కువ వరద వస్తే అవకాశం ఉన్నందున ప్రాజెక్ట్ స్టోరేజీ కెపాసిటీని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అక్కడి అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు.

## ఆర్టీసీ బస్సు

>> తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రి నుండి నర్సీపట్నం వైపు వస్తున్న ఏపి.37 యుఏస్. 1288 నెంబరు గల ఆల్ట్రా పల్లెవెలుగు రాజమండ్రి డిపో బస్సులో 25 మంది ప్రయాణికులున్నారు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ కొవ్వూరు నుండి 11.45 ని.బయలుదేరి బోర్లగుంఠం గ్రామ సమీపంలో వాగుపై ఉన్న ఇనుప వంతెనను బస్సు ఢీకొట్టి లోయలోకి పడిపోయిందన్నారు, ప్రమాద ప్రాంతాన్ని సిఐ సన్యాసినాయుడు, జెడ్డంగి ఎస్ఐ విజయ్ కుమార్, సిబ్బంది పరిశీలించి జెడ్డంగి పిహెచ్‌సిలో వైద్యసేవలను పొందుతున్న వారిని ప్రమాద పరిస్థితిని అడిగి తెలుసుకుని వారి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఆదివారం సిఎం చంద్రబాబుకు విరాళం చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

## వరద బాధితులకు శిద్దా రూ. 50 లక్షల విరాళం

**ఒంగోలు, ప్రభాతవార్త:** విజయవాడ వరద బాధితుల సహాయార్ధం సిఎం నారా చంద్ర బాబు నాయుడు పిలుపు మేరకు రూ.50 లక్షల విరాళాన్ని మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా హనుమంతరావు, శిద్దా సూర్య ప్రకాశరావులు సిఎంకు అందజేశారు. ఆదివారం సాయంత్రం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో కలిసి రూ. 50 లక్షల రూపాయల చెక్కును సిఎంకు అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడ వరద బాధితులకు అండగా సిఎం సహాయనిధికి రూ.50లక్షల విరాళం అందజేసిన శిద్దా రాఘవరావు, శిద్దా హనుమంతరావు, శిద్దా సూర్యప్రకాశరావులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు.

## సిఎం చంద్రబాబు భేటీ

>> ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మళ్లీ నదులు పొంగుతున్నాయన్నారు.ఇటీవల వరద ముంపు తగ్గుముఖంపట్టి ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.ఎగువ ప్రాంతాల్లో వానలకు మున్నేరు పొంగుతుందని వివరించారు. ఉత్త రాంధ్ర, కోస్తాంధ్ర పంటనష్టం, ఆస్తినష్టం భారీగా ఉందని తెలిపారు.33మంది మరణించారని, పశు,పంటనష్టం భారీగా జరిగిందని తెలిపారు.ఈ క్రమంలో రాష్ట్రంలో రూ.6,882కోట్లు వరద నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేసారని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సీఎం చంద్రబాబు వివరించారు.ఈ విషయంలో రాష్ట్ర పరిస్థితిని కేంద్రానికి వివరించాలని రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను చంద్రబాబు కోరారు.వరద బాధిత ప్రాంత ప్రజలను గమనించినప్పుడు ఎంతో హృదయ విదారకంగా కన్పించిందన్నారు. రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ రాష్ట్రంలో వరద సహాయక చర్యలు విషయంలో సిఎం చంద్రబాబు తీసుకుంటున్న శ్రద్ధను కొనియాడారు.స్వయంగా బాధితుల దగ్గరకు వెళ్లి సేవలను గమనించడం. వారికి భరోసా కల్పించడం ప్రశంసాపూర్వకం అంశంగా రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అభిప్రాయపడ్డారు.

## ఆరోగ్య సర్వేలు

>> క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. ఆరు రకాల మందులతో కూడిన లక్షకు పైగా మెడికల్ కిట్లను ఇప్పటికే పంపిణీ చేశామని, రాను న్న రోజుల్లో ఈ మెడికల్ కిట్లను రాష్ట్ర వ్యాప్తంగా కూడ పంపిణీ చేస్తామన్నారు.తొమ్మిదో తేదీ నుండి మూడు రోజుల పాటు డోర్ టు డోర్ మెడికల్ సర్వే నిర్వహిస్తామన్నారు. మెడికల్ క్యాంపుల్లో 71 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటి వరకు 6 వేల ఓపి సర్వీసులు వచ్చాయని, 2900 విష జ్వరాలకు సంబంధించి 900 డయేరియా కేసులు,6వేల శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చాయన్నారు. అత్యవసరమైన వైద్య సాయం అందించేందుకు వెయ్యి మంది ఆరోగ్య సిబ్బంది పనిచేస్తున్నారన్నారు.డోర్ టు డోర్ డిసీస్ సర్వే నిర్వహిస్తారని, వ్యాధులపై అవగాహన కల్పిస్తారని, దోమలు ప్రబలే అవకాశం ఉండటంతో దోమకాటును నివారించేందుకు కేంద్రంతో మాట్లాడి ఇనె ట్రీట్ నెట్స్ అందిస్తామన్నారు. కొందరు బాధ్యతారాహిత్యంగా విమర్శలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేసిన కారణంగా నేడు ప్రజలు కష్టాలనెదుర్కొంటున్నారని, ప్రజా సంక్షేమాన్ని వాతల పూర్తిగా విస్మరించారన్నారు. ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధి ఉన్న నాయకుడు చంద్రబాబునాయుడని,మునిగిపోయిన ఇళ్లకే కాదు,మునిగిపోయిన జీవితాలను కూడ బాగు చేయాలని ఆలోచిస్తున్నారన్నారు. దెబ్బతిన్న వ్యాపారాలను నిలబెట్టాలన్న ఉద్దేశ్యంతో వారికి బ్యాంకుల ద్వారా లోన్లు మంజూరు చేసే అంశంపై ఆలోచిస్తున్నామన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 09-09-2024, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
భాద్రపదమాసం, దక్షిణాయనం,
వర్షఋతువు, శుక్లపక్షం,
షష్ఠి రా.9.53,
విశాఖ సా.6.03
వర్జ్యం రా.10.23-12.07
దు.ము.12.38-1.27, (2) మ.3.06-3.55
శుభసమయం : ఉ.9.15-10.00,
సా.4.00-5.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం** : ఇంటాబయటా ప్రోత్సాహం లభిస్తుంది. సంతానం సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**వృషభం** : ఉద్యోగాలలో పదోన్నతులు పొందుతారు. భూ వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**మిథునం** : ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ప్రయాణాలు.

**కర్కాటకం** : అనుకోని అతిథుల ద్వారా ముఖ్య విషయాలు తెలుసుకుంటారు. వస్తు సేకరణ.

**సింహం** : దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించుకుంటారు. మానసిక ప్రశాంతత పొందుతారు.

**కన్య** : ప్రముఖులతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. వృత్తి-వ్యాపారాలు విస్తరిస్తారు.

**తుల** : సంతానానకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. సోదరుల కలయిక.

**వృశ్చికం** : భాగస్వామ్య వ్యాపారాలు ప్రారంభిస్తారు. ప్రముఖులనుండి ఆహ్వానాలు అందుతాయి.

**ధనుస్సు** : బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. శ్రమకోర్చి పనులు పూర్తిచేస్తారు.

**మకరం** : కుటుంబ సభ్యులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. నూతన వస్తుకొనుగోలు.

**కుంభం** : చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. శ్రమపడ్డా ఫలితం కనిపించదు.

**మీనం** : మిత్రులతో అకారణంగా విరోధాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక సమస్యలు వచ్చి మీదపడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

THE GOVERNMENT OF BODOLAND
Results of 07/09/2024
M.R.P. ₹.2/-

FUTURE SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 777263; 2nd Prize Rs.7000/- 36410
SINGAM SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 910094; 2nd Prize Rs.7000/- 03142
KUIL SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 601683; 2nd Prize Rs.7000/- 07230
ROSA SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 446988; 2nd Prize Rs.7000/- 64265
DEAR SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 442674; 2nd Prize Rs.7000/- 78542
THANGAM SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 872516; 2nd Prize Rs.7000/- 04429

THE GOVERNMENT OF BODOLAND
Results of 07/09/2024
M.R.P. ₹.2/-

ABBLE SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 792134; 2nd Prize Rs.7000/- 51603
NALLANERAM SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 954420; 2nd Prize Rs.7000/- 46323
KUMARAN SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 838369; 2nd Prize Rs.7000/- 93549
VISHNU SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 463661; 2nd Prize Rs.7000/- 86756
SWARNALAXMI SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 546849; 2nd Prize Rs.7000/- 92278
LION SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 434114; 2nd Prize Rs.7000/- 67120

THE GOVERNMENT OF BODOLAND
Results of 08/09/2024
M.R.P. ₹.2/-

FUTURE SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 699418; 2nd Prize Rs.7000/- 96870
SINGAM SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 286356; 2nd Prize Rs.7000/- 55043
KUIL SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 947131; 2nd Prize Rs.7000/- 17518
ROSA SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 431300; 2nd Prize Rs.7000/- 66692
DEAR SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 519617; 2nd Prize Rs.7000/- 37786
THANGAM SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 786172; 2nd Prize Rs.7000/- 59842

THE GOVERNMENT OF BODOLAND
Results of 08/09/2024
M.R.P. ₹.2/-

ABBLE SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 649805; 2nd Prize Rs.7000/- 45009
NALLANERAM SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 546526; 2nd Prize Rs.7000/- 66484
KUMARAN SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 263597; 2nd Prize Rs.7000/- 42534
VISHNU SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 752839; 2nd Prize Rs.7000/- 40533
SWARNALAXMI SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 514629; 2nd Prize Rs.7000/- 14885
LION SERIES Dr No:10 — 1st Prize Rs.100000/- 357432; 2nd Prize Rs.7000/- 68887

# బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న ఏడుకొండలు

## అక్టోబర్ 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## 3న అంకురార్పణ

## 4న ధ్వజారోహణం

పి.పద్మనాభమ్/తిరుమల

శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్స వాలకు శేషాచలంలోని సప్తగిరులు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఏడుకొండలపై ఆలయం పరిసరాలు, మాఢవీధులు రంగురంగుల రంగవల్లులు, అదనపు తాగునీటికొళాయిలు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించే పనులు మొదలయ్యాయి. మాఢవీధులు పూర్తిగా గ్యాలరీలతో ఇనుపకంచెల బందీగా మారిపోయింది. ఈ ఏడాది దేవదేవునికి అక్టోబర్ 4వతేదీ నుండి 12వరకు తొమ్మిది రోజులపాటు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్స వాలు మాత్రమే జరగనున్నాయి. బ్రహ్మోత్స వాల్లో తొమ్మిదిరోజులు పాటు ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు జరగనున్నాయి. అక్టోబర్ 8వతేదీ మంగళవారం రాత్రికి గరుడ వాహనసేవమాత్రం సాయంత్రం 6.30గంటలకే మొదలవుతుంది. కలియుగవైకుంఠవాసుని బ్రహ్మోత్స వాలకు అక్టోబర్ 3వతేదీ గురువారం సాయంత్రం అంకురార్పణం, 4న శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్స వాలకు శ్రీకారమవుతాయి. తొలిరోజు అక్టోబర్ 4వతేదీన ధ్వజారోహణంరోజునే రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తిరుమలకు చేరుకుని శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఇందుకోసం టిటిడి అధికారులు కూడా తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్స వాలకు టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, టిటిడి సిఇ సత్యనారాయణ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అందరూ కొత్తవారే. దేవుని తొమ్మిదిరోజుల ఉత్స వాలు, వాహనసేవలపై మరింత అవగాహన కలిగించుకుని విజయ వంతంగా నిర్వహించడంపై దృష్టి సారించాల్సి ఉంది. అక్టోబర్ 4న మొదలయ్యే శ్రీవారి బ్రహ్మో త్స వాలకు 1వతేదీ మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఆ రోజు విఐపి బ్రేక్ దర్శనాలు, అష్టదళపాద పద్మారాధన సేవ రద్దుచేశారు.

**బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకే ప్రాధాన్యత:** నిత్య కల్యాణంపచ్చతోరణంగా విరాజిల్లే తిరుమల కొండపై ప్రతిరోజూ ఉత్స వాలు, సేవలే. ఏడాది కోసారి తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్స వాలకు దేశవిదేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. అక్టోబర్ 4నుండి 12వతేదీ వరకు తొమ్మిదిరోజులు జరిగే తిరుమలేశుని బ్రహ్మోత్స వాలకు సప్తగిరులు సర్వాంగసుందరంగా ముస్తాబవుతోంది. అక్టోబర్ 4వతేదీ శుక్రవారం సాయంత్రం జరిగే ధ్వజారోహణంతో ఉత్స వాల వేడుకలు మొదలుకానున్నాయి. శ్రీదేవిభూదేవి ఉభయదేవేరులతో కలసి శ్రీమలయప్పస్వామి మాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిం చనున్నారు. 4వతేదీ రాత్రి తొలివాహనంగా శుక్రవారం రాత్రి 9గంటలకు వైకుంఠ శ్రీమ హావిష్ణువు కలియుగప్రత్యక్షదైవంగా శ్రీనివాసుడు అవతారంలో ఏడుతలల పెద్దశేషవాహనంపై అధిరోహించి ఆలయమాఢవీధుల్లో ఊరేగుతారు. అక్టోబర్ 12వతేదీ రాత్రి అశ్వవాహనసేవవరకు వివిధ వాహనసేవలు ఉదయం, రాత్రి వేళల్లో ఆగమోక్తంగా జరుగుతాయి. బ్రహ్మోత్స వాలలో ఐదవరోజురాత్రి జరిగే గరుడసేవకు సిఎం పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని 2004 నుంచి బ్రహ్మోత్స వాల ప్రారంభంరోజే సమర్పించడం జరుగుతుంది. అనంతరం రంగనాయకుల మండపంలో 2025కు సంబంధించిన నూతన సంవత్స ర క్యాలండర్లు, డైరీలు ఆవిష్కరిస్తారు. బ్రహ్మోత్స వాల్లో ఆలయంలో రోజు జరిగే ఆర్జితసేవలు కల్యాణోత్స వం, డోలోత్స వం, ఆర్జితబ్రహ్మో త్స వం, వసంతోత్స వం, సహస్రదీపాలంకరణ సేవలు రద్దుచేశారు. బ్రహ్మోత్స వాలు జరిగే తొమ్మిదిరోజుల సమయంలో సర్వదర్శనం మాత్రమే అనుమతించనున్నారు. మిగిలిన ప్రత్యేక దర్శనాలు టిటిడి రద్దుచేసింది.

8వతేదీ రాత్రి గరుడసేవకు అత్యంత విశిష్టత ఉంది. భగవంతుని వాహనసేవలను ఆలయ మాఢవీధుల్లో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంపై, భక్తులకు ఇబ్బంది లేకుం డా వాహనసేవలవీక్షణకు సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందించారు.

బ్రహ్మోత్స వాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్స వాలను వైభవంగా జరిపించేలా టిటిడి అధికా రులు సమాయత్తమవుతున్నారు. అక్టోబర్‌లో దసరా సెలవులు కూడా కావడంతో పెద్దసం ఖ్యలో భక్తులు తిరుమలకు విచ్చేస్తారు.

**వాహనసేవల వివరాలు**

| తేదీ | ఉదయం | రాత్రి |
|---|---|---|
| అక్టోబర్ 4 శుక్రవారం | ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| అక్టోబర్ 5 శనివారం | చిన్నశేషవాహనం | హంస వాహనం |
| 6 ఆదివారం | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 7 సోమవారం | కల్పవృక్షవాహనం | సర్వభూ పాలవాహనం |
| 8 మంగళవారం | మోహనీ అవతారం | గరుడ వాహనం |
| 9 బుధవారం | హనుమంతవాహనం ,స్వర్ణరథం | (సాయంత్రం)గజవాహనం |
| 10 గురువారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభ వాహనం |
| 11 శుక్రవారం | రథోత్సవం | అశ్వవా హనం |
| 12 శనివారం | పల్లకీ ఉత్సవం, చక్రస్నానం | ధ్వజావరోహణం |



## తిరుమల సమాచారం



## 16నుండి పద్మావతిఅమ్మవారి పవిత్రోత్సవాలు

### రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల,సెప్టెంబర్ 8 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలతిరుపతిదేవస్థానంకు అనుబంధంగా ఉన్న తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆల యంలో ఈనెల 16వతేదీ నుండి 18వరకు మూడు రోజులు పవిత్రోత్స వాలు జరగనున్నాయి. ఈ ఉత్స వాలకు 10వతేదీ మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వ హించ నున్నారు. రేపు ఉదయం 7నుండి 9.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమం జనం చేపడ తారు. ఈ కారణంగా ఆలయంలో అమ్మవారికి జరిగే కల్యాణోత్స వం, ఊంజల్‌సేవలు రద్దు య్యాయి. పవిత్రోత్స వాలకు 15వతేదీ సాయంత్రం అంకురార్పణ జరగనుంది. 16వతేదీ పవిత్ర ప్రతిష్ట, 17న పవిత్ర సమర్పణ, 18న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు.



## శ్రీవారి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి

**తిరుమల,సెప్టెంబర్ 8 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి కరుణాకటాక్షాలతో తెలుగుప్రజలు సంతోషంగా వుండాలని లోకాయుక్త న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌దర్శనాల సమయంలో ఆయన కుటుంబంతో కలసి వెంకన్నను దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకలు మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

## శేషాచలం అడవిలో బంగారుబల్లి

### చక్రతీర్థంలో ఆనవాళ్లు గుర్తించిన ప్రకృతిప్రేమికులు

**తిరుమల, సెప్టెంబర్ 8 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వర స్వామి కొలువైన శేషాచలం అడవుల్లో బంగారుబల్లి కనిపించింది. తిరుమలకొండపై వెంకన్న ఆలయానికి ఆరుకిలోమీటర్లు దూరంలో ఉన్న శిలాతోరణం సమీపంలోని చక్రతీర్థంలో ఈ బంగారు బల్లి ఉన్నట్లు కనుగొన్నారు. ఈ బంగారుబల్లి ఉందని తిరుపతి ఎస్వీయూనివర్సిటీ జంతుశాస్త్రవిభాగం ఆచార్య డాక్టర్ ఎం.రాజశేఖర్ పరిశోధన చేశారు. ఈ బల్లిశాస్త్రీయ నామం కోలోడాక్టీ లోడ్స్ అరేస్‌గా పిలుస్తారు. ఈ బల్లి రాత్రివేళల్లో ఎక్కువగా సంచరిస్తుంటుంది. బంగారు వర్ణంలో ముదురు పసుపు,లేత పసుపురంగులో ఉన్నట్లు కనుగొన్నారు.



150 మిల్లీమీటర్లనుండి 180మిల్లీ మీటర్లు వరకు పొడవు ఉంటుంది. సూర్యం శ్మిపడని, వేడి తగలని ప్రదేశంలో ఈ బంగారు బల్లులు జీవిస్తూ ఉంటాయన్నారు. చిన్నపాటి సందులుగా ఉండే రాతి గృహాలు వీటికి నివాసస్థలాలు. సాధారణంగా చీకటిపడిన తరువాత బయటకు వస్తుంటాయి.



## భక్తుల భద్రతపై నింతరం అధ్యయనం

### వైకుంఠం క్యూలైన్లు, సుపథం మార్గాలు తనిఖీలు

**తిరుమల,సెప్టెంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** ఏడు కొండలపై తొమ్మిదిరోజులు పాటు అక్టోబర్‌లో జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్స వాల్లో భక్తుల భద్రతపై నిరంతరం పోలీసు అధికారులు అధ్యయనం చేస్తున్నారు. గత రెండురోజులుగా తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, 1టౌన్ సిఐ విజయ కుమార్, విజిలెన్స్ సెక్యూరిటీ విభాగం అధికారులతో కలసి ఆలయం ముందు భాగం, మాఢవీధులు, సుపథం ప్రవేశమార్గం, వైకుంఠమ్ క్యూలైన్లు, గ్యాలరీల్లోకి భక్తులు చేరుకునే విధానంపై పరిశీలించారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం లేకుండా భద్రతను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్స వాల్లో అత్యంత ముఖ్యమైన అక్టోబర్ 4వతేదీ రాత్రి పెద్దశేషవాహనసేవ, అదేరోజు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాక, 8వతేదీ గరుడ వాహనసేవ, 12వతేదీ చక్రస్నానం ఏర్పాట్లపై చర్చించారు. తొమ్మిది రోజులు పోలీసు అధికారులు, టిటిడి విజిలెన్స్ అధికారులు, సిబ్బంది పక్కాప్రణాళికతో భక్తులను గ్యాలరీల్లోకి అనుమతించడం, తిరిగి వెలుపలకు వేళ్ళేలా నిష్క్రమణ మార్గాలను సాఫీగా చూడటం చేయాలని సూచించారు. లక్షల సంఖ్యలో విచ్చేసే భక్తులు ప్రశాంతంగా, ఇబ్బందులు లేకుండా వాహనసేవలు వీక్షించేలా చూడాల న్నారు. ముఖ్యంగా గరుడసేవరోజు మరింత సమన్వయంగా పని చేయాలని సూచించారు.

## రెండురోజులు సెలవులొచ్చినా కనిపించని భక్తులు

### ఏడుగంటల్లోనే సర్వదర్శనం

**తిరుమల,సెప్టెంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:** వరుసగా రెండురోజులు సెలవులు, వారాంతం శని, ఆదివారాలు వచ్చినా తిరుమలలో భక్తుల రద్దీ కనిపించలేదు. ఆదివారం ఉదయానికి 17కం పార్టుమెంట్లలో భక్తులు వేచివుండి సర్వదర్శ నానికి ఏడు గంటలు సమయం కేటాయిస్తున్నారు. సాయంత్రంభక్తులరద్దీ నామమాత్రంగానే ఉంది. సాయంత్రం వరకు 41వేలమంది భక్తులు మహాలఘులో శ్రీవారిని దర్శించుకోగా శనివారం అర్ధరాత్రివరకు 83,960మంది భక్తులకు దర్శ నం కల్పించారు. 2.96కోట్లురూపాయలు హుండీ ఆదాయం లభించింది. తెలుగురాష్ట్రాల్లో తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు, వినాయకచవితి పర్వదినం కావడంతో శనివారం పెద్దగా తిరుమలకు భక్తులు రాలేదని టిటిడి అంచనా.

## వరద సహాయక చర్యలపై జగన్ తప్పుడు ప్రచారం: మంత్రి వంగలపూడి అనిత

**విజయవాడ,సెప్టెంబర్8,ప్రభాతవార్తప్రతినిధి:** విపక్షనేత జగన్ వరద సహాయక చర్యలపై చేతగాని తనంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఏపీ హోంశాఖ, విపత్తుల నియంత్రణశాఖల మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. వరదముంపు బాధితులకు ఆహారం, మంచినీరు సరఫరా చేస్తున్నామని అన్నారు. విజయవాడలో ఇంకా పలు ప్రాంతాల్లో వరద నీరు



ఉందన్నారు, ఉదయం అల్పాహారం, మంచినీరు, పాలపాకెట్లు సరఫరా చేస్తున్నామన్నారు. విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడుతూ వైకాంగ్రెస్‌పార్టీ నేతలపై తీవ్ర విమర్శలు చేసారు. ముంపు కాలనీల్లో తమ ప్రభుత్వం చేస్తున్న సాయంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. విజయవాడ ముంపు కాలనీల్లో 170 వాటర్ ట్యాంకులతో మంచినీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఆ వాహనాలు వందల ట్రిప్పులు తిరుగుతున్నాయి. ఇప్పటి వరకు 27వేలకు పైగా ఇళ్ళలో బురదను అధికారులు తొలిగించారు. డ్రోన్లతో ఆహారం సరఫరాపాటు క్లోరినేషన్ చేపట్టామన్నారు. సీఎం చంద్రబాబు పండుగ కుడా జరుపుకోకుండా శ్రమిస్తున్నారు. కలెక్టరేట్‌లోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారన్నారు. మంత్రి నిమ్మలరామానాయుడు మూడు రోజుల పాటు బుడమేరు వద్దే కూర్చునున్నారు, నిద్రాహారాలు లేకుండా గండ్లను పూడ్చివేయించారు. వైకాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి మాత్రం పేటీఎం బ్యాచ్‌ను దింపు విషప్రచారం చేయిస్తున్నారు. జగన్ సొంత డబ్బుతో కనీసం పులిహోరా ప్యాకట్ కుడా ఇవ్వలేదన్నారు. బెంగుళూరులో కూర్చుని పులిహోర కబుర్లు వ ్రాత్రం చెబుతున్నారు. ప్రకాశం బ్యారేజ్‌లోకి కొట్టు కొచ్చిన బోట్లపై అనుమానాలు ఉన్నాయి, సోషల్ మీడియాలో జరుగుతున్నట్లు మంద పాలకు డబ్బులువసూలు చేయొద్దున్నారు. ఇప్పటికైనా విపక్ష విషప్రచారం మానుకోవాలన్నారు.

## వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్న వారికి రెయిన్‌కోట్లు



రెయిన్‌కోట్లు అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,సెప్టెంబరు8,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో వరద సహాయక చర్యల్లో మంత్రి అచ్చెన్నాయుడు ముమ్మరంగా పాల్గొం టున్నారు. నగరంలోని ప్రతి శివారు ప్రాంతానికి ఆయన పర్యటిస్తు న్నారు. వారికి అవసరమైన ఆహారపదార్థాలను అందించడమే కాకుండా ప్రతి ఒక్క బాధితకుటుంబాన్ని ఆయన పరామర్శిస్తున్నారు. వరదబాదితులకు,. సహాయక చర్యల్లో పాల్గొంటున్నవారికి ఆయన రెయిన్‌కోట్లు అందజేస్తున్నారు. వారికి తాము అండగా ఉంటామని భరోసా ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తమందరిని బాదితుల సహాయక చర్యలకు పురమాచించినట్లు ఆయన వారికి వివరి స్తున్నారు. బుడమేరు గట్టులు గండిపడిన చోట వాటిని ప్రభుత్వం రికార్డు స్థాయిలో పూర్తి చేసిందన్నారు. ఇక ఈ ప్రాంతంలో కరకట్టను నిర్మిస్తామని తెలిపారు. కొన్ని చోట్ల ఆయన వీధి, వీధికి మోటారు సైకిల్‌పై తిరిగి బాధితులకు అందుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. చిట్టినగర్‌లో గత వారం రోజులుగా స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు, సహాయక చర్యల్లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవకులకు, వివిధ సంస్థల వాలంటీర్లకు మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, 46వ డివిజన్ ప్రత్యేక అధికారి రాజబాబు 46వ డివిజన్లో రెయిన్ కోటులు , శానిటైజర్లు పంపినీ చేశారు. వర్షం వరద నీరు, మురుగు వంటి ప్రతికూల వాతావరణంలో సైతం వరద బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్న యువత వర్షంలో తడుస్తూ కూడా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి సేవలను అభినందించి వారికి రెయిన్ కోటులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. ప్రజల కోసం కష్టపడుతున్న యువతను మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

# పోలీసులపై తిరగబడ్డ జనం

### వినాయక చవితిలో చెలరేగిన వివాదాలు

### రాగిగుంట, పెరిందేశం గ్రామాల మధ్యలో ఘర్షణలు: ఉద్రిక్తత

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గంలోని కెవిబిపురం మండలం రాగిగుంట, పెరిందేశం దళిత వాడల మధ్య వినాయక చవితి సంబరాల్లో మొదలైన ఘర్షణలు చిలికి చిలికి గాలివానగా మారి ఉద్రిక్తలకు దారి తీసింది. శనివారంరాత్రి ఉట్టి కొట్టే సమయంలో ప్రారంభమైన గొడవలు గ్రామం, దళిత వాడల మధ్య భగ్గుమన్నాయి. ఈ ఘర్షణల్లో మొత్తం 20 మంది ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘర్షణలో పిచ్చాటూరుఎస్ఐ వెంకటేష్ గాయపడ్డారు. ఎఎస్‌పి రంగంలో దిగారు. అయినా పరిస్థితి కుదుట పడలేదు. గ్రామంలో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేసారు. ఇరు వర్గాల మీద క్రిమినల్ కేసులు నమోదు చేసారు. గతంలో కూడా రాగిగుంట, పెరిందేశంల మధ్య ఘర్షణలు చోటు చేసుకొని శాంతి భద్రతల విఘాతంగా మారింది. కెవిబిపురం మండలంలో అసలేం జరిగిందనే అంశంపై చర్చ మొదలైంది. వినాయక చవితి సందర్భంగా శనివారం రాగిగుంట గ్రామంలో ఉట్టికొట్టే ఉత్స వం జరుగుతుంది. ఓ వర్గం చెబుతున్న కథనం మేరకు ఉటిట్ట ఉత్స వం సందర్భంగా ఆ దారిన వెళుతున్న పెరిందేశం గ్రామానికి చెందిన యువకుడు వెళుతుండగా ఆతనిపై రంగు పడినట్లు చెబుతు న్నారు. అప్పుడే ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అయితే సర్దుకున్నారు. దాంతో పెరిందేశానికి చెందిన యువకుడు వాడలో వెళ్ళి చెప్పటంతో ఓ 20మంది గుంపుగా వచ్చి రాగి గుంట గ్రామస్థులను చితక బాదారు. ఈ సంఘ టనల్లో ఇరువర్గాల నుంచి నలుగురు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. ఆదివారం ఉదయం మళ్ళీ పెరిందేశానికి చెందిన వంద మంది రాగిగుంట గ్రామం మీదకు వచ్చి దాడులకు పాల్పడ్డారు. గ్రామంలోని దుకాణాలను ధ్వంసం చేసారు. ఇళ్ళపై దాడి చేయటం తో పాటు శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపో బస్సు మీద రాళ్ళు రువ్వటంతో తారాస్థాయికి చేరుకుంది. దాంతో రాగిగుంట గ్రామస్థులు ఆందోళనకు దిగారు. రాస్తారోకోకు పూనుకున్నారు. అయితే ఎన్నికల తరువాత మండలానికి ఎస్ఐ లేదు. ఉన్న ఒక్క ఎఎస్ఐ, ఒక కానిస్టేబుల్‌లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కానీ వందలాది మందిని కంట్రోల్ చేయలేక చేతులేత్తేసారు. దాంతో జనం పోలీసుల మీద తిరగబడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎఎస్‌పి రవిమనోహరాచారి, డివైయస్‌పి రవికుమార్, సిఐలు గోపి, ఈశ్వర్, మురళీ, భాస్కర్ నాయక్, ఎస్ఐలు వవెంకటేశ్ ధర్మారెడ్డి, రాజశేఖర్, సునీల్, మల్లి కార్జున్ రెడ్డి పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసారు.

## 78వ సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

### ప్రారంభించిన కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రులు కందుల దుర్గేష్, రాంప్రసాద్‌రెడ్డి




క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కేంద్ర, రాష్ట్రమంత్రులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 8, ప్రభాతవార్త:** దేశస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా రాజమహేంద్రవరంలో 78వ సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ క్రీడల్లో పాలొ ంటున్న క్రీడాకారులు అందరికీ అభినందనలు తెలియజేస్తున్నానని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నారాయణపురంలోని సిటీ బ్యాడ్మింటన్ కోర్ట్ (ఆర్ఎంసీ ఇండోర్ షటిల్ కోర్టు)లో జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు నిర్వహించనున్న 78వ సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ బ్యాట్మెంటన్ క్రీడాకారుల ప్రతిభ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు గానూ ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులకు రాజమహేంద్రవరం వేదిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడలను ప్రోత్స హించేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఆ దిశగా బ్యాట్మెంటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ క్రీడాకారులకు శిక్షణ కోసం టిడిపి హాయాంలో స్థలాన్ని కూడా అందించడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడలను ప్రోత్స హించేందుకు అత్యంత ప్రాధాన్యత నిస్తున్నారని ఈక్రమంలో ఖేల్ ఇండియా పథకం ద్వారా రూ.900 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఆ మేరకు ఆయా నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రీడలపట్ల ఆశక్తిని పెంపొందించే దిశగా ప్రోత్స హిం చాలన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొన్నక్రీడాకారులందరికీ అభినందనలు తెలిపారు.

## భారీగా వరద విరాళాలు అందిస్తున్న దాతలు

**విజయవాడ,సెప్టెంబరు 8,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణానదీ చరిత్రలో కనీవినీ ఎరుగని వరద కారణంగా నిరాశ్రయులైన వారికి ఆపన్న హస్తం అందించేందుకు దాతల నుండి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చినపిలుపు మేరకు విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. విరాళాలు అందచేస్తున్న దాతలకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. విరాళాలందించినవారు వల్లూరుపల్లి లక్ష్మీకిషోర్(వరుణ్ గ్రూప్ డైరెక్టర్), వల్లూరుపల్లి వరుణ్‌దేవి(ఎండీ) రూ.2 కోట్లుఆర్వీఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున డైరెక్టర్ శర్నాల గణేష్ రూ.1కోటి, డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్, సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ రూ.10 లక్షలు, ఎస్ఎన్ పూర్ణిమ -రూ.5లక్షలు(ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఇండియా, విజయవాడ ఛాప్టర్). బి.శాంతి వరలక్ష్మి రూ.లక్ష25 వేలు, టిడీపీ నేత గోనుగుండ్ల కోటేశ్వరరావు రూ.లక్ష 16 వేలు, సూరెడ్డి శ్రీధర్-1 లక్ష, పెమ్మనబోయిన సమాధానం రూ.50వేలు, అబాజ్ ఆలీ భాషా రూ.50వేలు, గోల్డెన్ ట్రీ ఎంటర్ ప్రైజెస్-రూ.10వేలు, ఏపీ సబ్‌రిజిస్ట్రార్స్ అసోసియేషన్-25లక్షలు, పోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి రూ.10 వేలు చెక్కులను ముఖ్యమంత్రికి అందచేశారు.

## సీమాంధ్ర మీదుగా తిరిగే హౌరా-పుట్టపర్తి మధ్య తిరిగే ఎక్స్‌ప్రెస్ యశ్వంత్‌పూర్ వరకు పొడిగింపు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 8 ప్రభాతవార్త:** సీమాంధ్ర మీదుగా ప్రస్తుతం హౌరా-సత్యసాయి ప్రశాంతి నిలయం (పుట్టపర్తి)-హౌరా మధ్య తిరుగుతున్న సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను యశ్వంత్‌పూర్ (బెంగుళూరు) వరకు పొడిగించినట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. హౌరా నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే నెంబర్ 22831 సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 25 నుంచి ప్రతి బుధవారం హౌరా బయల్దేరి ధర్మవరంకు గురువారం రాత్రి 8:40/45, సత్యసాయి ప్రశాంతి నిల యం (పుట్టపర్తి)కి, 9:30/32, హిందూపురం 9:58/10:00, యలహంక 11:08/10, యశ్వంత్‌పూర్‌కు అర్ధరాత్రి 12:15 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంతపూర్ నుంచి హౌరాకు బయల్దేరే నెంబర్ 22832 సూపర్ ఫాస్ట్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి ప్రతి శుక్రవారం తెల్లవారు జామున 5:00 గంటలకు యశ్వంత్‌పూర్ నుంచి బయల్దేరి, యలహంక 5:15/20, హిందూపురం 6:18/20, సత్యసాయి ప్రశాంతి నిలయం (పుట్టపర్తి) 7:53/55, ధర్మవరం 8:20/25 గంటలకు బయల్దేరి హౌరా వెళ్తుంది. హౌరా- ధర్మవరం-హౌరాల మధ్య మార్గంలో రైలు వేళల్లో ఎలాంటి ఆమర్పులు లేవని రైల్వే వర్గాలు వివరించాయి.

వార్త

మనిషి జ్ఞానం కోసం అన్వేషించాలి తప్ప
జ్ఞానం అతని కోసం అన్వేషించదు.

-జేన్ పోర్టర్

# యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వం..

రెండున్నరేళ్లుగాకొనసాగుతున్న ఉక్రెయన్‌పై రష్యా దండయాత్ర కొలిక్కి వచ్చే సూచనలు కని పిస్తున్నాయి. ప్రపంచదేశాలతోపాటు అటు రష్యా ఇటు ఉక్రెయిన్ రెండూ కూడా భారత్ జోక్యం చేసుకోవాలని శాంతిచర్చలకు తాము సిద్ధమేనని ప్రక టించిన నేపథ్యంలో ఈ వారంలో మోడీ నిర్వహించిన ఉక్రెయిన్‌పర్యటన, అంతకుముందు రష్యా పర్యటనలు ఇపుడు శాంతిచర్చలకు తొలిదశ సంప్రదింపులుగా నిలి చాయనే చెప్పాలి. భారత్ జోక్యంచేసుకుంటేనే మంచిదన్న భావన ఈరెండు దేశాలతోపాటు ప్రపంచదేశాల్లో కూడా వ్యక్తం అవుతోంది. అమెరికా సైతం భారత ప్రధాని మోడీ ఉక్రెయిన్, రష్యాల పర్యటనతోపాటు పోలెండ్ పర్యటనసపై సంతృప్తి వ్యక్తంచేయడంతోపాటు భారత్ మధ్యవర్తిగా రంగప్రవేశంచేయాలనే కోరుకుంటున్నది. రెండున్నరేళ్లుగా చిన్నదేశం స్మశానంలా మారిపోయింది. కుప్పలు కుప్పలుగా శిథిలాలు, వాటికిందమృతదేహాలు లెక్కకుమించి నిత్యం కనిపిస్తున్నాయి.వీటికితోడు పొరుగు ననే ఉన్న పోలెండ్, బెలారస్, స్లోవేకియా, హంగరీ దేశా లకు వలసలు పోతున్నారు. యుద్ధనేరాల కింద ఓపక్క అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు వారంట్ జారీచేయడం వంటి అంశాలు ఇపుడు చర్చల్లోప్రధానంగా ప్రస్తావనకు రానున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా అటు రష్యావైపు నుంచి కొంతభాగం ఆక్రమిస్తే ఇటు ఉక్రెయిన్‌సైతం అంతకు తక్కువేమీ కాదన్నట్లుగా రష్యాభూభాగంలోకి చొచ్చుకునిపోవడం వంటివి కొంత కలవరం కలిగించే అంశాలే. యుద్ధం కొనసాగుతుందని, తమ సైనిక చర్య ఆగదని చెపుతున్న పుతిన్ అటు చైనా,భారత్,జర్మనీ ఈ మూడుదేశాలకు మధ్యవర్తిత్వంచేస్తే సామర్థ్యంఉందని చెపు తూ శాంతి చర్చలకు సంకేతాలిచ్చారు. ఇపుడు వేదిక ఎక్కడ అనేది నిర్ధారణ కావాలి. అలాగే శాంతి చర్చల్లో ఇరువైపుల నుంచి వస్తున్న ప్రతిపాదనలు డిమాండ్లను ముందు అధ్యయనంచేయాల్సిన బాధ్యత భారత్‌దే. మొదటినుంచి తాము శాంతినెలకొనాలని వాదిస్తున్నామని చెపుతూ వచ్చిన భారత్ ఈ వారంలో హటాత్తుగా జాతీయభద్రతా సలహాదారు అజిత్‌దోవల్‌ను రష్యాకు పంపించడం వెనుక శాంతి చర్చల మంత్రాం గమేనని చెప్పకతప్పదు. ఉక్రెయిన్‌లో పర్యటన తర్వాత వెంటనే రష్యా అధ్యక్షు డితో ఫోన్‌లో మాట్లాడిన భారత్ ఇప్పటికీ ఎప్పటికీ చర్చలు, సంప్రదింపుల ద్వారానే సమస్యకు పరిష్కారం అని చెపుతూ వచ్చింది. ప్రధాని మోడీ సైతం అదే ఉద్ఘాటించారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలకు లోబడి శాంతిప్రతిపాదనలు తెస్తామని కూడా స్పష్టంచేసారు. ఇరుదేశాల అధినేతలతో సంప్రదింపులు జరిగిన తర్వాతనే శాంతిచర్చలకు శ్రీకారం జరుగు తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మన భద్రతా సలహా దారు అజిత్‌దోవల్ పర్యటన ఇపుడు అత్యంత ప్రాధా న్యతను సంతరించు కుంది. యుద్ధవిరమణకు దోవల్ తనతోపాటు ప్రధాని మోడీ శాంతి ప్రణాళికను తీసుకెళ్లారన్నది సమాచారం. చొరబాట్లు, మిలిటెన్సీలపై అపార అనుభవం ఉన్న జాతీయభద్రతా సలహాదారు అంతార్జ తీయ రక్షణరంగ వ్యవహారాల్లో మంచి పట్టున్న సమర్థ డైన ప్రముఖుడు. ఇరువైపులా వచ్చిన శాంతిప్రతిపాద నలను మళ్లీ భారత్‌కు తెచ్చి వాటిపై అధ్యయనం తర్వాతనే శిఖరాగ్ర సదస్సు జరుగుతుంది. అయితే శాంతిచర్చలకు సిద్ధమేనని చెపు తూనే రష్యా మెలిక పెడుతున్నది. తాము అంగీకరించిన పత్రాలకులోబడి మాత్రమే శాంతిచర్చలను కోరుతున్నా మని, ఉక్రెయిన్ డిమాండ్లను ఏకపక్షంగా అంగీకరించ లేమని తన మనసు లోమాట బయటపెట్టింది. ఇదిలా ఉంటే ప్రపంచంలో ఉక్రెయిన్, రష్యా యుద్ధాలను విరమింప చేసేందుకు కొన్నిదేశాలు ముందుకువచ్చినా రష్యాకు మాత్రం అయితే భారత్ లేదంటే చైనాలు ముందుకువస్తే పరిశీలన చేస్తా మన్న సంకేతాలు వది లింది. ఓపక్క యుద్ధం జరుగు తున్న తరుణంలో శాంతి ప్రస్తావనను చైనా మాత్రం ఇప్పటివరకూ తీసుకురాలేదు. యూరోప్ దేశాలపరంగా చూస్తే జర్మనీ ముందునుంచి కూడా సన్నద్ధంగానే ఉంది. అయితే నాటోనుంచి అందుతున్న సహకారాన్ని ముందు నిలిపివేయాలం టున్నరష్యా డిమాండ్‌పై అటు యూరోపియన్ ఇటు ఆసియా దేశాలు సమ్మతించడంలేదు. ఇప్పటికే చిన్నదేశంపై కొనసాగుతున్న దండయాత్ర ఇక శాంతి చర్చలతోనైనా ముగించాలని ప్రపంచశాంతికి సైతం ముప్పువాటిల్లచేసే ఈ ధోరణులు ఎంతమాత్రం తగదని ఐక్యరాజ్యసమితిలాంటి అంతర్జాతీయ వేదికలు తెగేసి చెప్పాయి. రెండున్నరేళ్లుగా కొనసాగుతున్న యుద్ధ విధ్వంసకాండ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. శాంతిచర్చ లపై ఇప్పటివరకూ పెదవి విప్పని పుతిన్ హటాత్తుగా సంప్రదింపులు చర్చలకు మొగ్గుచూపారంటే కొనసాగు తున్న విధ్వంసంపై ప్రపంచదేశాలు కన్నెర్ర చేయడమే. ప్రపంచంలో ఒక్క భారత్ మాత్రమే అటు చైనా, ఇటు రష్యాలతో ద్వైపాక్షిక బంధం స్నేహబంధం సమన్వ యంతో కొనసాగిస్తూ వస్తోంది. దీనికితోడు బ్రిక్స్ దేశాల పరంగా అటుచైనా, ఇటు రష్యాకూడా భాగస్వామ్య దేశాలే. ఈ ఐదుదేశాల కూటమిలో జర్మనీ లేకపోయినా యూరోపియన్ దేశాల్లో అత్యంతప్రభావంఉన్న దేశం. యూరోపియన్ దేశాలనుంచి వస్తున్న ఆంక్షలు, మరోపక్క అమెరికా ఆంక్షలు, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాలనుంచి కూడా ఎదురవుతున్న పరిమితులు, కట్టడి వంటి వాటితో రష్యా ఇపుడు కొంత మెత్తబడిందనే చెప్పాలి. సుదీర్ఘ దం డయాత్ర కొనసాగుతున్న తరుణంలో ఇప్పటికైనా రష్యా శాంతిచర్చలకు ముందుకురావడం వెనుక భారత్ కీలక కృషి ఒక్కటే ఉంది. అందువల్లనే ఇపుడు యుద్ధమో దుతున్న ప్రాంతంలో శాంతిప్రస్తావన కీలకంగా వినిపి స్తోంది. వేదికను ఖరారుచేసి ప్రాథమిక స్థాయి చర్చలను ముందుప్రారంభిస్తే సుదీర్ఘ యుద్ధంతో కకావికలమైన ఉక్రెయిన్, ఆందోళన పడుతున్న రష్యాపౌరులకు భారత్ ఊరటనిచ్చినట్లవుతుంది. ఆదిశగానే భారత్ ముందుకు అడుగులు వేయాలని ఆశిద్దాం.

లక్ష్యం ఎంత ఉన్నతంగా ఉంటుందో దాన్ని సాధించడానికి ఎంచుకునే మార్గం కూడా అంతే సమున్నతంగా ఉండాలి.




రామకృష్ణ పరమహంస

విజయాన్ని నిరంతరం నిలబెట్టుకోవడమే విజేతకు ఎదురయ్యే అసలైన సవాలు.



రవీంద్రనాథ్ ఠాగూర్

## ప్రజావాక్కు



### రాయల్టీ రాష్ట్రాల హక్కు

మైనింగ్,ఖనిజ కార్యకలాపాలపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకున్నదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పుతో పదమూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ అతి పురాతనమైన కేసు పరిష్కృతం కావడం మరో రికార్డు. రాయల్టీ అనేది పన్నువంటిది కాదని,రాయల్టీని విధించే అధికారం రాష్ట్రా లకు ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేయడం ఫెడరలిజాని కి బలంచేకూర్చే అంశం.ఖనిజాలను కలిగిఉన్న భూమిపై రాయల్టీని వసూలు చేసే రాష్ట్ర ప్రభుత్వ హక్కును ఈ తీర్పులోభాగంగా సుప్రీంకోర్టుసమర్థించింది. అక్కడి ప్రభు త్వాలు ఇప్పుడు తమ భూభాగాల్లో కార్యకలాపాలు నిర్వ హిస్తున్న మైనింగ్ కంపెనీలపై అదనపు సుంకాలు వసూ లు చేసేందుకు దీని ద్వారా అవకాశం ఏర్పడుతుంది.

- పి. నారాయణ, భూపాలపల్లి జిల్లా

### కఠిన చర్యలు తీసుకోవాలి

**పొగాకును** సమాజం నుంచి దూరం చేయగలిగితే 40 శాతం క్యాన్సర్ కేసులను నివారించవచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. కాబట్టి రైతులు పొగాకు సాగు మానుకొని, ఆహార ఉత్పత్తులవైపు దృష్టి మళ్లించాలి. పాలకులు కూడా పొగాకుని సమాజం నుంచి దూరం చేయడానికి కఠిన చర్య లు తీసుకోవాలి. పొగాకును నిషేధించే చర్యలు చేపట్టాలి. పొగాకు నిషేధ చట్టాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

-బి. రాజేశ్వర్, శ్రీకాకుళంజిల్లా

### అవినీతిని అంతమొందించలేమా?

**రాష్ట్రంలో** అనేకసంఘటనల్లో అత్యున్నత అధికార స్థాయిలో ఉన్నవారు అవినీతి అభియోగాలపై సిబిఐకి చిక్కారు. వారికి దొరక్కుండా ఇంత కన్నా అవినీతిపరులు ఉన్నారు. దీనికి మూల కారణం విపరీతమైన వస్తువులు, ఆస్తి,హోదా. తోటి స్వార్థపరులతో పోలిక చేసుకోవడం, పరిపాలనలో అన్నిస్థాయిలలో పారదర్శకత లోపించడం, రుజువైన వాటికి శిక్ష పడిన, ధనం వెచ్చించి వాటి నుండి తప్పుకునే అతితెలివి. జీవితంలో మనంఏమి చేస్తే సమా జానికి కొంతైనా మేలుకలుగుతుందో అది కొరవడి దానికి భిన్నంగా ధనార్జనే ఆశయంగా ప్రతి పని విజ్ఞత కోల్పో యి వ్యవహరించడమే ఇందుకు కారణం. ప్రతి వ్యక్తి ఆత్మపరిశీలన చేసుకోవాలి. అవినీతిని అరికట్టాలి.

-జి. అశోక్, ఏలూరు

### పనులు వేగవంతం కావాలి!

**అమరావతి** రాజధాని రైలు మార్గానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, ఆపై సంబంధిత డిపిఆర్ సిద్ధంగా ఉందని రైల్వే అధికారులు ప్రకటించడం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి మరో అడుగుపడినట్లే. అయితే పనులు వేగవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు రైల్వేశాఖతో పూర్తి సమన్వ యంతో పని చేయాలి.ఎక్కడా ఎటువంటి అవాంతరాలు రా కుండా అందరి సమిష్టి కృషితోనే అభివృద్ధి ప్రాజెక్టులు సాకారం అవుతాయి.ఇదే సందర్భంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాజధానికి కొత్త రైలు మార్గంతో అన్ని వైపుల నుంచి ఇప్పటికే ఉన్న రైలు మార్గాలకు అనుసంధానం చేయాలి. ఈ దిశగా వెంటనే సమగ్ర సర్వే చేపట్టాలి.

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

### జలచరాలకు ముప్పు

**సముద్రవ్యర్థాలు** మత్స్యరాశులకు ముప్పుగా పరిణమిస్తున్నా యి. చేపల వేటకు సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులు, బోటు ఆపరేటర్లు తమ వెంట తీసుకెళ్లే ప్లాస్టిక్ వ్యర్థాలు, తెగిన వల లను సముద్రజలాల్లోనే పడేస్తున్నారు. నీటిపై తేలియాడే పాలి థిన్ సంచులు,ప్లాస్టిక్ సీసాలు, వలలు ముక్కలు సముద్ర జీవు లకు శాపంగా మారుతున్నాయి.తెగిన వలలో చిక్కుకొని తా బేళ్లు,పీతలు, చేపలు వంటి జీవరాశులు మృత్యువాతపడుతు న్నాయి. సముద్ర వ్యర్థాల కారణంగా మత్స్య సంపద ఐదు శాతం మేర తగ్గే అవకాశం ఉంది. సముద్ర తీర ప్రాంతానికి కొట్టుకు వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలతో అపరిశుభ్రంగా కనిపిస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాల్లో పడేయకుండా మత్స్యకా రులకు అవగాహన కల్పించాలి. పర్యాటకులు సముద్ర కాలుష్య నివారణకు బాధ్యతగా వ్యవహరించాలి.

-ఎన్. కనకయ్య, హైదరాబాద్

### టీచర్లను ఆరోగ్య పథకంలో చేర్చాలి

ఎపి మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్లను ఎన్టీఆర్ ఉద్యోగి ఆరోగ్య పథకం, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకంలో చేర్చా లి. హెల్త్‌కార్డులు అందించడం ద్వారా అవసరమైన వైద్యసేవ లు పొందేందుకు ప్రభుత్వం ఇచ్చిన 010 పద్దు ప్రక్రియను పూర్తి చేసి అమలు చేయాలి. ఎపిజిఎల్‌ఐ గ్రూపు ఇన్సూరెన్స్ ను ప్రభుత్వం వర్తింపచేసే చర్యలు పూర్తిచేయాలి. అన్ని వర్గాల వారికి వర్తించే అన్నిరకాల పథకాలను టీచర్లకు కూడా వర్తిం చేలా చర్యలు చేపట్టి అమలయ్యేలా చూడాలి.

-ఎన్. నరేష్, విజయవాడ

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com

# ప్రభుత్వానికి పెన్షన్ భారమా! బాధ్యతా?

***భారతదేశంలో బిలినియర్ల సంఖ్య 2020లో 102నుండి తాజాగా విడుదల చేస్తున్న హురూన్ నివేదిక ప్రకారం 300 చేరింది. సంపద కొద్ది మంది దగ్గర కేంద్రీకృతం అవుతుంది. సంపద సృష్టించే వారు వృద్ధాప్యంలో కనీస పెన్షన్ కూడా నోచుకోలేకపోతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సంస్కరణలో కూడా 99,77,165 మంది ఉద్యోగుల నుండి వసూలు చేసిన 10,53,850 కోట్ల రూపాయల పెన్షన్ నిధులను కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లనున్నాయి. ఈ పాలకుల కార్పొరేట్ అనుకూల వైఖరికి వ్యతిరేకంగా వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవనం కొరకు సంఘటిత రంగంలో పనిచేసే ఉద్యోగులతోపాటు అసంఘటిత రంగంలో ఉన్న శ్రామికులందరికీ కాంట్రిబ్యూషన్ లేని పెన్షన్ ఒక హక్కుగా అందించాలని దేశంలోని కోటాను కోట్ల ప్రజలు పోరాడుతున్నారు.***

జి. వెంకటేశ్వరరావు

డిఎస్ నకార వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 1983లో సుప్రీంకోర్టు పెన్షన్ ఉద్యోగి ప్రాథ మిక హక్కు, జీతంలో ఒక భాగం అని తీర్పునిచ్చింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 51 పౌరులకు పెన్షన్ అం దించాలని సూచిస్తుంది. ఆగస్టు 24న కేంద్ర మంత్రివర్గం రెండు దశాబ్దాల జాతీయ పెన్షన్ పథకాన్ని సవరణ చేస్తూ యూనిఫైడ్ పెన్షన్ పథకాన్ని ఆమోదించింది. సుమారు 23 లక్షల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల ను కూడా కలుపుకుంటే సుమారు 90 లక్షల మంది ఈ పథకం పరిధిలోకి వస్తారు. ఇప్పటివరకు ఎన్పీఎస్ కింద ఉన్న ఉద్యోగులకు కూడా యుపిఎస్‌లోకి మారే అవకాశం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యూపిఎస్‌ను అమలు చేసేందుకు అనుమతినిచ్చింది. యుపిఎస్ కొరకు ఉద్యోగి తన మూలవేతనం, కరవు భత్యం మొత్తం నుండి 10 శాతం, ప్రభుత్వం 18.5 శాతం సొమ్మును పెన్షన్ ఫండ్‌కు జమ చేయాల్సి ఉంది. కనీసం 25 సంవత్సరాల సర్వీస్ కలిగిన ఉద్యోగి పదవీ విరమణ ముందు 12 నెలల సరాసరి వేతనంతో 50శాతాన్ని గ్యారెంటీ పెన్షన్‌గా ప్రక టించారు. 10సంవత్సరాల నుండి 25 సంవత్సరాలలోపు సర్వీసు వారికి దామాషా పద్ధతిలో పెన్షన్ గ్యారెంటీ చేయ బడింది. కనీసం 10 సంవత్సరాలు సర్వీస్ గలవారికి పది వేల రూపాయల కనీస పెన్షన్ నిర్ణయించారు.ఉద్యోగి పెన్షన్ లో 60 శాతం కుటుంబ పెన్షన్‌గా ఇవ్వనున్నారు. పెరుగు తున్న ధరలకు అనుగుణంగా సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులకు మాదిరిగానే కరవు భత్యం, అదే విధంగా రిటైర్ అయిన ఉద్యోగికి గ్రాట్యుటీతోపాటు మూలవేతనం కరవు భత్యంలో పదోవంతు మొత్తాన్ని పూర్తి చేసిన సర్వీసులో ప్రతి ఆరు నెలల కాలానికి చెల్లిస్తారు. ఈ పథకం ఏప్రిల్ 1, 2025 నుండి అమలులోకి వస్తుంది. ప్రస్తుతం జాతీయ పెన్షన్ పథకం కింద పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కూడా యుపిఎస్ అమలవుతుంది. ఈ కాలానికి సంబంధించిన అరియర్స్‌ను ఈపిఎఫ్ వడ్డీ రేటుతో వడ్డీని కలిపి చెల్లించ డం జరుగుతుంది. కేంద్రప్రభుత్వం పెన్షన్ ఫండ్‌కు అదనం గా 7050 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయవలసి వస్తుంది. పాత పెన్షన్ స్కీంలో ఉద్యోగి ఎటువంటి వాటా చెల్లించకుండానే చివరి నెల మూలవేతనంలో 50 శాతం పెన్షన్‌గా చెల్లిస్తారు. గ్రాట్యుటీ, 40శాతం పెన్షన్‌ని ముందు గానే అమ్ముకునే అవకాశం ఉంటుంది. ఉద్యోగి మరణం తర్వాత అర్హత గల కుటుంబ సభ్యులకు ఏడు సంవత్స రాలు లేదా 67 సంవత్సరాలు వచ్చేవరకు 50 శాతం ఫ్యామిలీ పెన్షన్ల తదనంతరం 30శాతం ఫ్యామిలీ పెన్షన్‌గా చెల్లిస్తారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరవు భత్యం, వేతన సవరణ, నిర్ణీత వయసు దాటిన తర్వాత అదనపు పెన్షన్, ఆరోగ్య బీమావంటి సదుపాయాలున్నాయి. కానీ 2003 ఎన్డీయే ప్రభుత్వకాలంలో పెన్షన్ ప్రభుత్వ ఖజానాకు భారంగా మారుతుందని ప్రపంచ బ్యాంకు సం స్కరణల్లో భాగంగా ఎన్పిఎస్‌ను అమలు చేశారు. దీనిలో ఉద్యోగి మూలవేతనం కరవు భత్యముల మొత్తం నుండి



10శాతం,అంతే మొత్తం ప్రభుత్వం పెన్షన్ ఫండ్‌కు చెల్లించి దానిని మార్కెట్ ఆధారిత షేర్లలో పెట్టుబడిగా పెట్టడం జరుగుతుంది. అనంతరం ఉద్యోగి పదవీ విరమణ అనం తరం మార్కెట్లో వచ్చే లాభనష్టాలు ఆధారంగా పెన్షన్ చెల్లించడం జరుగుతుంది. ఈపోగు చేయబడిన పెన్షన్ నిధి నుండి 60శాతం సొమ్మును ఉద్యోగికి ఏక మొత్తంగా చెల్లిం చి మిగిలిన 40శాతంతో పెన్షన్ ప్రొవైడర్ నుంచి యాన్యు టీ ప్లాన్లు కొనుగోలు చేయవలసి ఉంది.దీనిలో కనీస పెన్షన్ కు గ్యారెంటీ లేదు. మార్కెట్ లాభనష్టాలకు లోబడి పెన్షన్ చెల్లిస్తారు. దీనిలో ఉద్యోగి పెన్షన్‌కు కనీస భద్రత హామీ లేకపోవడంతో ఉద్యోగులు చేసిన ఆందోళనతో 2019లో ప్రభుత్వ వాటాను 10శాతం నుండి 14శాతం పెంచడంతో పాటు కుటుంబ పెన్షన్‌కూడా ఆమోదించడం జరిగింది. ప్రపంచ బ్యాంకు షరతులకు అనుగుణంగా నూతన ఆర్థిక సంస్కరణలు ప్రారంభించిన తర్వాత ప్రభుత్వరంగంలో రెగ్యులర్ ఉద్యోగాల కల్పన తగ్గిపోయి ఉద్యోగ నియామకా లలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాలు చోటు చేసుకున్నా యి. 30సంవత్సరాలు గడిచేటప్పటికీ ప్రభుత్వ ఉద్యోగుల్లో కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులసంఖ్య 50శాతంచేరింది. వీరికి ఎటువంటి పెన్షన్ సదుపాయంలేదు. మొత్తం పని చేసే సమూహంలో అధికశాతం మంది అసంఘటిత రం గంలోనే ఉన్నారు. వారికి వృద్ధాప్యంలో ఎటువంటి జీవన భద్రత, పెన్షన్స్ సౌకర్యాలు 78 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో పాలకులు కల్పించలేదు. 2018-19 గణాంకాల ప్రకారం దేశంలో సుమారు 60 సంవత్సరాలు పైబడిన వారు 13 కోట్ల మంది ఉన్నారు. వారికి కనీసం మూడువేల పెన్షన్ ఇవ్వడానికి అవసరమైన 39వేల కోట్ల నిధులను మొదటి ఒక శాతం మందిపై ఒక శాతం సంపద పన్ను ద్వారా సమకూర్చవచ్చు. కానీ దీనికి భిన్నంగా జీవి తమంతా ప్రభుత్వ పథకాలను, పరిపాలనను బాధ్యతగా నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చేపెన్షన్, తమ చెమట చుక్కలతో సంపదను సృష్టించే శ్రామికులకు, సామాన్య ప్రజలకు ఇచ్చే రాయితీల వలెనే దేశం దివాలా తీస్తుందని కార్పొరేట్ వాదనలను అమలు చేయబూనుకోవడం ప్రభుత్వ వర్గ దృక్పథాన్ని తెలియచేస్తుంది. నూతన ఆర్థిక సంస్కర ణల అమలులోభాగంగా ప్రజాసంక్షేమం చూడాల్సినబాధ్యత నుండి వైదొలిగి ప్రతి సేవను మార్కెట్‌శక్తులకు వదిలేయ డమే విధానంగా మారిపోయింది. కొనుగోలు చేయగలిగిన శక్తి ఉన్నవారు మాత్రమే సమాజంలో బతకాలి అనే పరిస్థి తిని సృష్టించారు.అందులో భాగంగానే విద్యావైద్యం,పెన్షన్లు శ్రమజీవుల శ్రమతో అభివృద్ధి చేసిన అనేక ప్రభుత్వరంగ సంస్థలను అన్నింటిని కార్పొరేట్ల పనులకు 30 శాతం 22 శాతానికి తగ్గించారు. కార్పొరేట్ల లక్షల కోట్ల బకాయిలను అప్పనంగా రద్దు చేశారు. భారతదేశంలో బిలినియర్ల సంఖ్య 2020లో 102నుండి తాజాగా విడుదల చేస్తున్న హురూన్ నివేదిక ప్రకారం 300 చేరింది. సంపద కొద్ది మంది దగ్గర కేంద్రీకృతం అవుతుంది. సంపద సృష్టించే వారు వృద్ధా ప్యంలో కనీస పెన్షన్ కూడా నోచుకోలేకపోతున్నారు. ఇప్పు డు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షన్ సంస్కరణలో కూడా 99,77,165 మంది ఉద్యోగుల నుండి వసూలు చేసిన 10,53,850 కోట్ల రూపాయల పెన్షన్ నిధులను కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లనున్నాయి. ఈ పాలకుల కార్పొరేట్ అనుకూల వైఖరికి వ్యతిరేకంగా వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవనం కొరకు సంఘటిత రంగంలో పనిచేసే ఉద్యోగులతోపాటు అసంఘటిత రంగంలో ఉన్న శ్రామికులందరికీ కాంట్రిబ్యూ షన్ లేని పెన్షన్ ఒక హక్కుగా అందించాలని దేశంలోని కోటాను కోట్ల ప్రజలు పోరాడుతున్నారు. •

# పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరవు

డి.జె.మోహన రావు

ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో అనకాపల్లి జిల్లా అచ్యుతా పురం సెజ్లో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి విధుల్లో ఉన్న పధ్నాలుగు మంది చనిపోయారు. అనేకమంది గాయపడ్డారు. ఇవి తక్షణ ప్రభావాలుమాత్రమే. భవిష్యత్తులో ఈ పరిశ్రమలో పనిచేస్తున్న ఇతర కార్మికుల మీద దీని ప్రభావాలు కనిపించొచ్చు. ప్రమాదాలు జరిగిన వారం పదిరోజులు ప్రజలలో మీడియాలో హంగామా ఉం టుంది. తరువాత షరామామూలే.అలాకాకుండా ప్రమాదాలు ఎదుర్కోడానికి పటిష్టమైన చర్యలు పరిశ్రమ యాజమాన్యం తీసుకోవాలి. సంబంధిత ప్రభుత్వ అధికారులు ఎప్పటిక ప్పుడు తనిఖీలు చేయాలి. మమ అన్న రీతిలో తనిఖీలు చేస్తే ఇటువంటి ప్రమాదాలే సంభవిస్తాయి. ఇదేమి దేశంలో మొదటి ప్రమాదంకాదు. ఇంతకుముందు ఎన్నో జరిగాయి. భోపాల్ గ్యాస్ ఉదంతం జరిగి చాలా రోజులైనా కూడా ఇప్పటికీ అప్పటి కార్మికుల మీద ఆ వాయు ప్రభావం చూపుతుంది. ఇక్కడ కేవలం ప్రభుత్వాలను తప్పు పట్టలేం. ఎందుకంటే ప్రభుత్వాలకు అనేక బాధ్యతలు ఉంటాయి. సంబంధిత అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలదే తప్పు. ప్రమాదాల నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి. ప్రమాదాలు కార్మికుల ఆరోగ్యంపై ప్రభావం చూపిఉత్పత్తిలో తగ్గుదల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థలపై వినాశకరమైన ప్రభావాలను కలిగి స్తాయి.అధికశబ్దం, వైబ్రేషన్లు, రేడియేషన్లు, విద్యుత్ పరిక రాలు, బాయిలర్ల వద్ద ప్రమాదాలు జరగడానికి అవకాశా లెక్కువ. అధిక శబ్దం కార్మికుల వినికిడిని దెబ్బతీస్తుంది. పనిచేసేవారి కమ్యూనికేషన్‌కు ఆటంకం కలిగించడంతోపాటు హెచ్చరికలను వినడం కష్టతరం చేస్తాయి.చేసే పనిపై ఏకా గ్రతను భంగం కలిగిస్తాయి. కార్మికుల అలసటను పెంచుతా యి. ఒత్తిడి, చిరాకు, నిద్ర రుగ్మతలకు కారణమవుతాయి. పనితీరును తగ్గిస్తాయి. వైబ్రేటింగ్ ఉన్న ఉపరితలంపై పని చేసేటప్పుడు ఈకంపనాలు చేతుల ద్వారా శరీరంలోకి ప్రవే శిస్తుంది. దీర్ఘకాలం గురైతే చేతులకు సంబంధించిన వ్యాధు లు వస్తాయి. శక్తి ఉత్పత్తి, ఔషధాల తయారీ, పరిశోధన వంటి పరిశ్రమలలో అయోనైజింగ్ రేడియేషన్ శరీర కణం లోని డిఎన్ఎలో రసాయన మార్పులను ఉత్పత్తి చేయడం ద్వారా శారీరకణాలపై దాడిచేసి కేన్సర్ రావొచ్చు. అంతర్జా తీయ కార్మిక సంస్థ తాజా అంచనాల ప్రకారం వాతావరణ మార్పు ప్రపంచంలోని అన్నిప్రాంతాల్లోని కార్మికుల భద్రత, ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని తెలిపింది. మొత్తం 340 కోట్ల ప్రపంచ శ్రామిక శక్తిలో 241కోట్ల కార్మి కులు అధిక వేడికి గురవుతున్నారు. 18,970 పని సంబం ధిత మరణాలకు, 20.9 లక్షల మంది ఆయుర్దాయం తగ్గ డానికి 2.62 కోట్ల దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధిబారిన పడడానికి అధిక వేడి కారణం. 160 కోట్ల కార్మికులు అతి నీలలోహిత కిరణాల రేడియేషన్‌కు గురై చర్మ కేన్సర్‌తో యేటా 18,960 కంటే ఎక్కువ మంది మరణిస్తున్నారు. వాయు కాలుష్యానికి గురవుతున్న కార్మికులలో యేటా 8.60లక్షల మంది చనిపోతున్నారు. పెస్టిసైడ్స్ పరిశ్రమ లలో పనిచేస్తున్న కార్మికులలో యేటా మూడు లక్షల కంటే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. మానసిక ఆరోగ్యం దెబ్బతిని నిరాశ ఆందోళన కారణంగా ప్రతి సంవత్సరం పన్నెండు వందల కోట్ల పనిదినాలు వృధా అవుతున్నాయని తెలిపింది. పరిశ్రమలలో కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు జరగడానికి అవకాశాలు ఉంటాయి. పనిచేసే వారి ఆరోగ్యానికి భద్రతకు, ప్రమాదాలు జరగకుండా నిర్దిష్ట నివారణ చర్యలు తీసుకొనే బాధ్యత వందశాతం యాజమా న్యాలదే. పరిశ్రమలు కేంద్ర, రాష్ట్ర చట్టాలకు ప్రమాణాలకు అనుగుణంగా కార్మికులను, ప్రజలను పర్యావరణాన్ని రక్షిం చడానికి అవసరమైన భద్రతాచర్యలు తీసుకోవాలి.రసాయన ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించడానికి యాజ మాన్యం తగుజాగ్రత్తలు తీసుకోవాలి.ఉత్పాదకప్రక్రియ వ్యర్థా లను శుద్ధిచేసి హానిలేని కారకాలుగా మార్చడం, పారవేయ డం లాంటి సమర్థవంతమైన ఏర్పాట్లుచేయడం ప్రతీపరిశ్రమ విధి.గాలి,వెలుతురు ధారాళంగా వచ్చేటట్లు దుమ్ము, పొగ, బయటకు పోయేటట్లు,గాలిలో అనుకూలమైన తేమ ఉండేట ట్లు చూడాలి. ప్రమాదకరమైన పొగలు, వాయువులు లీకైతే ప్రమాదం జరగకుండా రక్షణవ్యవస్థఉండాలి.అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు పనిచేసేవారు సురక్షితంగా తప్పించుకునే మార్గాలను, మంటలను ఆర్పడానికి అవసరమైన పరికరాలు ఉండాలి. అధికఉష్ణోగ్రత తట్టుకునే వస్త్రాలను, కళ్లకు రక్షణ కలిగించేపరికరాలను కార్మికులకు అందించాలి.ప్రతీ పరిశ్రమ వైద్యున్ని నియమించుకోవాలి.కార్మికులకు తగు శిక్షణివ్వాలి. నైపుణ్యంలేని వారిని,పిల్లలను పనిలో పెట్టుకోకూడదు. •

# వరద ముంపులో చిక్కిన జనావాసాలు

సుంకవల్లి సత్తిరాజు

కేరళలోని వాయనాడ్‌లో సంభవించిన ప్రకృతి విల యతాండవానికి సంబంధించిన దృశ్యాలు మన కళ్ల ముందు ఇంకా కదలాడుతూనే ఉన్నాయి. అక్కడ జరిగిన విధ్వంసానికి సంబంధించిన చేదు జ్ఞాపకాలు హృదయాన్ని కదిలిస్తూనే ఉన్నాయి. హృదయ విదారకమైన నాటి విల యానికి సంబంధించిన ఆర్ద్రత అలాగే ఉంది. ఈ లోగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సంభవించిన వరద బీభ త్సం జనహృదయాలను కలచివేస్తున్నది. గత కొద్ది రోజు లుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉభయ తెలుగు రాష్ట్రాలు అతలాకుతలమైపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసు కున్న వరద పరిస్థితులు అత్యంత భయానకంగా ఉన్నాయి. ఆర్థికంగా చిన్నాభిన్నమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయేప్రభుత్వం గత రెండు నెలలుగా తీవ్రంగా కృషిచేస్తున్న సమయంలో ఇలాంటి ప్రకృతి విపత్తు సంభవించడం అత్యంత బాధాకరం. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలాంటి చర్యలు తీసు కోవాలో, సాధారణ పరిస్థితులను తీసుకురావడానికి అధికార యంత్రాంగాన్ని ఎలా పరుగులు పెట్టించాలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియని విషయం కాదు. బుడమేరు కట్టలు తెంచుకుని ప్రవ హించడంతో విజయవాడ నగరం అల్లకల్లో లమైపోయింది. దాదాపు మూడు లక్షల మందికిపైగా ప్రజల వరద ముంపులో చిక్కుకుపోయారు.ఆహారం లేక, ఆశ్రయం లేక అలమటిస్తున్నవారు కొందరైతే కనీసం తాగునీరు కూడా లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వరద నీటిలో బిక్కు బిక్కుమని విలపిస్తున్నవారు కొందరు. కేంద్రం కూడా సకా లంలో స్పందించి, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను పంపించింది. ఎవరు ఎంతగా ప్రయత్నించినా ఇంతటి ప్రకృతి బీభత్సం నుండి లక్షలాది మంది ప్రజలను కాపాడడం, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించడం ఒక్కరోజులో సాధ్యమయ్యే పనికాదు. ప్రభుత్వ, ప్రతిపక్షాల పరస్పర రాజకీయ విమర్శ లతో విపత్తుల వలన సంభవించిన నష్టాన్ని పూడ్చలేం. అపత్సమయంలో రాజకీయాలను పక్కన పెట్టి మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ప్రజలు పడుతున్న ఇబ్బందుల ను తొలగించడానికి ప్రయత్నించాలి. పలుప్రాంతాల ప్రజలు మానవత్వంతో స్పందించి, ఆహారాన్ని పంపించడం, సినిమా నటులు, ఇతర రంగాలకు చెందిన ప్రము ఖులు భారీగా విరాళాలను అందించడం, సామాన్య ప్రజలు కూడా తమకు తోచిన విధంగా వరద ముంపు బాధితులకు కష్టకా లంలో అండగా నిలవడం మానవత్వం ఇంకా మిగిలే ఉంద నడానికి సజీవ సాక్ష్యంగా పేర్కొనవచ్చు. చిన్న చినుకులకే చిగురుటాకుల్లా వణికిపోతున్న భారతీయ నగరాలను చూస్తు న్నాం.జనసాంద్రత పెరగడం,నగరీకరణతో కాంక్రీటు కట్టడా లు ఇబ్బడి ముబ్బడిగా నిర్మించడంవలన కొద్దిపాటి వర్షానికే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, విశాఖపట్నం



వంటినగరాలు మునిగిపోతున్న సంఘటనలు మనం చూస్తు న్నాం.విజయవాడ నగరం అందుకు మినహాయిపేమీ కాదు. ఈ విషయంలో పరస్పర ఆరోపణలను కట్టిపెట్టి, నగరాల ముంపుకు గురికావడానికి గలకారణాలను విశ్లేషించిపకడ్బందీ చర్యలను చేపట్టాలి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణలో మాదిరిగా హైడ్రా వంటి యంత్రాంగాన్ని నెలకొల్పి అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించాలి. కబ్జాదారుల ఆగడాలను నిలువరించాలి. చెరువులను ఆక్రమించడం, చెరువుల వద్ద నిర్మాణాలను చేపట్టడం,ఇరుకైన రోడ్లమధ్య భారీ కట్టడాలను నిర్మించి నీటిప్రవాహాల సహజగతిని మార్చడంవలన నగరా లు, పల్లెలు అనే తేడాలేకుండా జనావాసాలు చిన్న వర్షానికే మునిగిపోతున్నాయి. ఇక భారీవర్షాలొస్తే ఆపదం ఎవరితరం కాదన్న విషయం గమనించాలి. ఆంధ్ర, తెలంగాణ ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్య తీవ్రతను గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితు లకు తావులేకుండా పటిష్ట మైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. భారీ వర్షాల వలన ఆంధ్రప్రదేశ్‌లో సుమారు నాలుగున్నర లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇంతకుముందు కురిసిన వర్షాల వలన వరిపొలాలన్నీ నీటమునిగిపోవడంతో రైతులు ఇప్పటికేతీవ్రంగా నష్టపోయారు. ఇప్పటికే రెండుసార్లు వరి నాట్లు వేసి నష్టపోయిన రైతాంగం మూడోసారి ప్రయత్నించి మళ్లీ భారీవర్షాలవలన పంటలన్నీ మునిగిపోయి దిక్కుతోచని స్థితిలోఉన్నారు. కొన్నిమెరక ప్రాంతాల్లో పైర్లుపైకి పచ్చగా ఏపుగా కనిపిస్తున్నా, రోజుల తరబడి వర్షాలు కురవడం, ఎండలు లేకపోవడంతో చీడపీడలు సోకి పంటలు దెబ్బతినే అవకాశం పుష్కలంగా ఉంది. ఈసంవత్సరం కురిసిన భారీ వర్షాల వలన తెలుగురాష్ట్రాల్లో ఆహారదిగుబడులు గణనీ యంగా తగ్గిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రప్రభు త్వం స్పందించి తెలుగురాష్ట్రాల్లో సంభవించిన వరద బీభ త్సాన్ని జాతీయ విపత్తుగా పరిగణించి, ఆర్థికసహాయం అం దించాలి. గతతరాల దార్శనికతలను మూఢత్వంగా భావించి హేళనచేసి, ఆధుని కత్వంపేరుతో ప్రకృతిని పరిహసించిన ఫలితాన్ని నేడుమనం అనుభవిస్తున్నాం. ప్రకృతి సిద్ధమైన జీవనవిధానాన్ని విస్మరించి, కాంక్రీటు కట్టడాల మధ్య మన జీవితాలను మనమే సమాధి చేసు కుంటున్నాం. అడవులు విధ్వంసమైపోతున్నాయి. పంటపొలాలు వివిధరకాల నిర్మా ణాల కారణంగా, వ్యాపార కారణంగా తరిగిపోతున్నాయి. తాగునీటికి,సాగునీటికి ప్రాంతాల మధ్యవిభేధాలు తలెత్తుతు న్నాయి. చినుకుపడితే జనారణ్యాలన్నీ సంద్రంలామారిపోతు న్నాయి.ఇటీవల కురిసిన వర్షాలవలన జరిగిన నష్టంవరదల వలన ప్రజలు పడుతున్న అగచాట్లు కేవలం ప్రకృతిప్రకోపం వలన సంభవించినవిగా మాత్రమే చెప్పడం సత్యదూరం. మానవ వైఫల్యాలే ఈ ఉత్పాతాలకు కారణంగా భావించవ చ్చు. ఇప్పటికే ప్రకృతి విపత్తులకు గల కారణాలపై పలు కమిటీలు సిఫార్సులు చేసాయి. ఇది ఈనాటి సమస్యకాదు. ఎప్పటినుంచో ఇలాంటి సంఘటనల్లో పలువురు మృత్యు వాత పడుతున్న ఉదంతాలను మరువలేం. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. పొంగిపొర్లు తున్న వాగులు ఊళ్లకుఊళ్లను కబళిస్తున్నాయి. అధిక వర్షా లకు పొంగిపొర్లుతున్న బుడమేరు వంటి వాగుల విషయం లో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి. ప్రతి సంవ త్సరం వీటిపై సమీక్షజరపాలి. నీటి ప్రవాహ ఉధృతి వలన జనావాసాలు ముంపునకు గురికాకుండా చూడాలి. •

# కర్ణాటక కాంగ్రెస్‌లో ముదురుతున్న అంతర్గత పోరు

## సీఎం కుర్చీకోసం రేసులోకి పలువురు



బెంగళూరు, సెప్టెంబరు 8: స్థలం కేటాయింపు కేసులో గవర్నర్ అనుమతిని సవాల్‌చేస్తూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరుగుతోంది. కాగా ఇదే అదునుగా భావించి కొందరు కాంగ్రెస్ నేతలు సీఎం కుర్జీపై ఆశపడుతున్నారు. సిద్ధరామయ్య తర్వాత సీఎం అయ్యే సీనియారిటీ అవకాశంఎ వరికి ఎక్కువగా ఉందనే విషయంలో ఇద్దరు సీనియర్ మంత్రులు ఎంబి పాటిల్, శివానంద్‌పాటిల్‌మధ్య మాటల యుద్ధం జరిగినట్లుగా సమాచారం. ఇటీవలే మీడియాతో మాట్లాడుతూ ఎంబిపాటిల్ ముఖ్యమంత్రి కావడంలో సీనియారిటీ ప్రధానం కాదు. పార్టీలో నాకంటే సీనియర్లు ఉన్నారు. అయినా ఇపుడు ముఖ్యమంత్రిని మార్చే ప్రశ్నేలేదు. సిద్ధరామయ్యే సీఎంగా కొనసాగుతారు. ఇపుడు ఆవిషయాల గురించి మాట్లాడటం అప్రస్తుతం. తనకు సీఎం కావాలనే కోరికలేదని శివానంద్‌పాటిల్ గతంలో అన్నారు. సీఎం అభ్యర్థిగా ఎంబి పాటిల్ ఉంటే మద్దతు ఇస్తారా అని మీడియా శివానంద్‌ను ప్రశ్నించడంతో పార్టీలో ఆయనకంటే సీనియర్లు చాలామంది ఉన్నారని, ఎంబి మరికొంతకాలం వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్‌ఫర్సన్ ఆరవిదేశ్‌పాండే సీఎం కావాలనే తన కోరికను ఇటీవలే ప్రకటించారు. ఆయన వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ ఎవరు సీఎం అవుతారో ఎమ్మెల్యేలు, హైకమాండ్ నిర్ణయిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత కలహాలను బిజెపి ఎత్తిచూపుతోంది. సీఎం స్థానం దక్కించుకోవడానికి కాంగ్రెస్‌లో అంతర్గతపోరు మొదలైందని, రాబోయే రోజుల్లో అది మరింత ముదురుతుందని వెల్లడించింది. కానీ పైకి మాత్రం సిద్ధరామయ్య వెంటే తాము ఉన్నామంటూ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని బిజెపి ఎంపి జగదీశ్‌శెట్టర్‌మండిపడ్డారు. ఉపముఖ్యమంత్రి డికెశివకుమార్ కూడా సీఎం పదవికోసం అంతర్గత ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ ముడా స్థలాలపంపిణీలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై విచారణకు హాజరుకావాలంటూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ తాఖీదులు జారీచేసిన సంగతి తెలిసిందే. సీఎం సిద్ధరామయ్య భార్య పార్వ తమ్మకు వారసత్వంగా వచ్చిన భూములను ముడా స్వాధీనం చేసుకుని మరొకచోట స్థలాలు మంజూరు చేసింది. స్వాధీనం చేసుకున్న భూములకంటే మంజూరు చేసిన స్థలాల విలువ ఎక్కువగా ఉందనేది విమర్శలు. ఈ వ్యవహారంలో సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ఒక ఆర్టీఐ కార్యకర్త జూన్ 26న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్‌కు ఫిర్యాదుచేసారు. ఆ తర్వాత ఆరాష్ట్ర సీఎంస్ ఈఫిర్యాదుకు వివరణ ఇస్తూ గవర్నర్‌కు నివేదికిచ్చారు. వాటి ఆధారంగా ఆయన సీఎంకు తాఖీదులు ఇచ్చారు. వీటిని సవాల్ చేస్తూ సిద్దరామ్య హైకోర్టును ఆశ్రయించారు.

# బ్రిక్స్ సదస్సు కోసం రష్యాకు అజిత్ దోవల్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే ప్రయత్నాల్లో భారత్ ఓ అడుగు ముందుకువేసింది. ఇందులోభాగంగానే మనర జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యాకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ పర్యటనలో ఆయన బ్రిక్స్ జాతీయభద్రతా దారుల సదస్సులో పాల్గొంటారు. అదే సమయంలో రష్యా చైనా కీలక అధికారులతో ఆయన భేటీ అవుతారు. గతనెల రష్యా అద్యక్షుడు పుతిన్‌తోప్రధానిమోడీ టెలిఫోన్ సంభాషణ సమయంలో డోవల్ పర్యటన అంశం ప్రస్తావనకు వచ్చింది. బ్రిక్స్ ఎన్ఎస్ఎల సదస్సు సమయంలో ఉక్రెయిన్ శాంతికోసం ఆలోచనలను ఆయన పంచుకుంటారని వెల్లడించినట్లు సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో మోడీ ఉక్రెయిన్‌ను సందర్శించారు. ఆదేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చల్లో మాట్లాడుతూ చర్చలు, దౌత్యమే యుద్ధానికి పరిష్కార మార్గాలని సూచించారు. తన వ్యక్తిగత హోదాలో ఒక మిత్రుడిలా ఉక్రెయిన్ శాంతికోసం రష్యాతో మధ్యవర్తిత్వం చేస్తానని ఆఫర్ ఇచ్చారు. ఈ యుద్ధంలో భారత్ ఎంతమాత్రం తటస్థంగా లేదని, కేవలం శాంతిపక్షమే వహిస్తుందని అన్నారు. మరోవైపు ఈ యుద్ధం లోచైనా భారత్ బ్రెజిల్ మాత్రమే శాంతిచర్చలకు సాయం చేయగలవని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించిన మాట ఈ సందర్భంగా గమనార్హం. తాజాగా ఇటలీ ప్రధాని జార్జియా మెలోని కూడా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో చర్చలు జరిపారు. అనంతరం మాట్లాడుతూ శాంతిలో చైనా భారత్ కీలకపాత్ర పోషించగలవని అన్నారు.

# టిఎంసిలో అవినీతి, అస్మదీయులకు అడ్డూ అదుపూ లేదు

## ఎంపి పదవికి రాజీనామా చేసిన జవహర్ సిర్కార్



కోల్‌కత్తా, సెప్టెంబరు 8: కోల్‌కత్తాలోని ఆర్జీకర్ ఆసుపత్రిలో రెసిడెంట్ డాక్టర్‌పై హత్యాచారం ఘటనతో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న తృణ మూల్‌కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ ఎంపి జవహర్ సిర్కార్ పదవికి రాజీనామా చేసారు. ఈ సందర్భంగా రాసి న లేఖలో అధినేత్రి మమతా బెనర్జీ తీరును తీవ్రంగా విమర్శించారు. ఆర్జీకర్ ఘటనకు నిరసనగా తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీ నామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మమతాకు రాసిన లేఖలో పార్టీలో అస్మదీయులు, అవినీతిపరులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అవినీతిపై ప్రభుత్వానికి ఆందోళన లేకపోవడం ఒక వర్గం నాయకులు మిగిలినవారిని అణగదొక్కడం వంటి చర్యలతో నాకున్న భ్రమలు తొలగిపోయాయి. అవినీతి అధికారులు అందలం ఎక్కడం వంటి విషయాలను నేను ఎంతమాత్రం అంగీకరించలేనని అన్నారు. నేను పార్టీలో ఉన్న ఇన్నేళ్లలో ఈ స్థాయి లో ఆందోళన, ప్రభుత్వ విశ్వాసరాహిత్యాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు. ఆర్జీకర్ ఆసుపత్రిలోని భయకంర ఘటన తర్వాత ఓపిగ్గా నెలరోజులపాటు ఎదురు చూసానని, మీరు పాతశైలిలో నేరుగా రంగంలోకి దిగి జూనియర్ డాక్టర్ల సమస్యపై స్పందిస్తారని ఆశించానన్నారు. కానీ అది జరగలేదు. ప్రభుత్వం ఇపుడు చాలా ఆలశ్యంగా అరకొర చర్యలు తీసుకుంది. పార్లమెంట్‌లో బెంగాల్ సమస్యలు ప్రస్తావించేందుకు నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఇక ఎంపికగా కొనసాగలేనని అవినీతి, మతతత్వం, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల్లో నియంతృత్వంపై పోరాడటంలో ఏమాత్రం రాజీలేదని అన్నారు. ఆర్జీకర్ వైద్యకళాశాల ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్‌ఘోష్ అవినీతి విషయంలో ప్రభుత్వంపై విపరీతమైన విమర్శలు వచ్చాయని, ఇప్పటికే ఆతడిని ఈడీ, సిబిఐ విచారిస్తున్నాయని, ఆతడి ఆస్తులపై దాడులునిర్వహించాయి. ఇందుకు సంబంధించి ఆతడికి సుప్రీంకోర్టులోకూడా ఊరట లభించలేదని, రెసిడెంట్ డాక్టర్ హత్యా చారం ఘటన జరిగినప్రదేశంలో మరమ్మతులకు ఆదేశాలు జారీచేసింది కూడా ఆతడేనని తేలింది. ఆతడికి మరో కళాశాలలో పోస్టింగ్ ఇవ్వడంతో మమత సర్కారుపై తీవ్ర విమర్శలు వచ్చాయి.

# ఓ ఆర్మీ జనరల్ చేసిన 'టీ' తప్పునకు దేశమంతా మూల్యం

## పాక్ విదేశాంగ మంత్రి ఇసాక్ దార్ వెల్లడి



ఇస్లామాబాద్, సెప్టెంబరు 8: అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ల రాజ్యం ఏర్పడగానే అక్కడికి వెళ్లి టీ తాగిన పాక్ ఆర్మీకి చెందిన ఓ జనరల్ చేసిన తప్పునకు ఇప్పుడు దేశం మొత్తం మూల్యం చెల్లింస్తోందట. ఈ విషయాన్ని పాకిస్థాన్ విదేశాంగమంత్రి ఇసాక్ దార్ శనివారం లండన్ హైకమిషన్ కార్యాలయంలో వెల్లడించారు. అమెరికా మద్దతుతో ఉన్న ఘని ప్రభుత్వాన్ని కూల్చేందుకు తాలిబన్లకు మద్దతుగా కొందరు మిలిటెంట్లను విడుదల చేశారన్నారు. వారే ఇప్పుడు బలోచిస్థాన్‌లో ఉగ్రవాదానికి మాస్టర్ మైండ్లుగా మారారని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆ కప్పు టీకి దేశం మొత్తం మూల్యం చెల్లిస్తోంది' అని డాన్ పత్రిక రాసిన వ్యాసాన్ని ఉటంకించారు. గత కొన్ని రోజుల్లో జరిగిన దాడుల్లో పాక్‌లోని వివిధ ప్రావిన్స్‌ల్లో మొత్తం 14 మంది సైనికులు సహా 50 మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో దార్ ఈ వ్యాఖ్యలు చేశారు. హమీద్ కాబూల్ పర్యటనకు నాటి ప్రధాని అనుమతి ఇచ్చారా అన్న ప్రశ్నపై స్పందిస్తూ 'ఇమ్రాన్ ఖాన్ అనుమతి లేకుండా ఆయన అక్కడకు వెళ్లారని నమ్మడం చాలా కష్టం. ప్రధాని అనుమతి లేకుండా ఇలాంటివి జరగవు. సెక్యూరిటీ విభాగాలతో కలిసి మే ఈ అంశంపై పనిచేయాలి' అని పేర్కొన్నారు.

2021లో పాక్ ఐఎస్ఐ చీఫ్ ఫయాజ్ హమీద్ కాబూల్ సందర్శించారు. ఆ సందర్భంగా తాలిబన్ల ఆతిథ్యం స్వీకరిస్తూ ఓ టీ కప్పుతో దిగిన ఫొటో సంచలనంగా మారింది. తాజాగా అతడిని విమర్శిస్తూ దార్ వ్యాఖ్యలు చేశారు. ఓ కేసులో ఇటీవలే పాక్ సైన్యం ఫయాజ్ హమీద్‌ను అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయనపై కోర్టు మార్షల్ జరుగుతోంది. బలోచిస్థాన్ వేర్పాటువాదం పాకిస్థాన్‌లో తారస్థాయికి చేరింది. గత మూడేళ్లలో తెహ్రీక్ ఈ తాలిబన్, బలోచ్ మిలిటెంట్ సంస్థలు తీవ్రస్థాయిలో దాడులు నిర్వహిస్తున్నాయి. వీటి దెబ్బకు దాదాపు 60 బిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించిన చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టు భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడింది.



# దళపతి విజయ్‌పార్టీకి ఇసి గుర్తింపు

చెన్నై, సెప్టెంబరు 8: ప్రముఖ తమిళ చలనచిత్ర కథానాయకుడు దళపతి విజయ్ స్థాపించిన పార్టీ తమిళగ వెంట్రి కళగంకు ఎన్నికల కమిషన్‌నుంచి అధికారిక గుర్తింపు లభించింది. పోల్ ప్యానెల్‌కు చేసిన అభ్యర్థనకు ఏడునెలల తర్వాత ఆమోదం లభించింది. గతనెల చెన్నై శివారు పనైయూర్‌లోని ఆపార్టీప్రధాన కార్యాలయంలో విజయ్ జెండాను ఆవిష్కరించారు. జెండాలో పైన, కిందభాగంలో ఎరుపు, మధ్యలో పసుపురంగులున్నాయి. మధ్యలో ఎరుపు రంగు వృత్తాకారం లోపల శిరీష పుష్పం, చుట్టూ 28 నక్షత్రాలు ఉన్నాయి. వాటిలో ఐదు నీలం, మిగిలినవి పచ్చరంగులో ఉన్నాయి. శిరీష పుష్పానికి రెండువైపులా ఘీంకరించే ఏనుగు రూపాలున్నాయి. విజయ్ మాట్లాడుతూ ఇప్పటివకూ మనకోసం మనం శ్రమించాం. ఇకపై తమిళనాడు, తమిళుల ఉన్నతికోసం సమిష్టిగా కృషిచేద్దాంఅని అన్నారు. 2026లో జరిగే రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో బరిలోకి దిగుతామని విజయ్ వెల్లడించారు.


# భారత్ అమెరికా సంబంధాల బలోపేతానికి కృషిచేస్తా

## డల్లాస్‌లో రాహుల్‌కు సాదర స్వాగతం



న్యూయార్క్, సెప్టెంబరు 8: భారత్‌అమెరికా సంబంధాలు మరింత బలపడేందుకు కృషిచేస్తానని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అమెరికా పర్యటన ఆదివారంఉంచి ప్రారంబించారు. తన సామాజిక వెబ్‌సైట్ ఎక్స్‌లో స్పందిస్తూ ప్రవాస భారతీయులు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులనుంచి డల్లాస్‌లో లభించిన ఆత్మీయ స్వాగతానికి సంతోషిస్తున్నాను. అర్థవంతమైన చర్చల్లో పాల్గొనడానికి ఎంతో ఆతృతగా ఉన్నానని ఇరుదేశాల సంబంధాలను బలోపేతం చేసేందుకు ఈపర్యటనలో కృషిచేస్తానని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆయన అమెరికా పర్యటన చేయడం ఇదే తొలిసారి. సెప్టెంబరు 8న డల్లాస్‌లోను, 9-10 తేదీల్లో వాషింగ్టన్ డీసిలోను ఈ పర్యటన ఉంది. ఈ సారి పర్యటనలో విద్యావేత్తలు, జర్నలిస్టులు, థింక్‌ట్యాంక్ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు వ్యాపారవేత్తలతో భేటీ కానున్నారు. ఇక యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఆయన విద్యార్థులు, విద్యావేత్తలనుద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది. ఈ పర్యటనపై గతంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నేత శ్యామ్‌పిట్రోడా మాట్లాడుతూ రాహుల్ పర్యటన అధికారికంగా కాదని, వ్యక్తిగత హోదాలో చేపట్టిందన్నారు. ఆయన క్యాపిటల్ హిల్స్‌లో పలువురు వ్యక్తులను కలుసుకునే అవకాశం ఉందన్నారు. రాహుల్ ప్రతిపక్ష నేతగా ఎన్నికైన నాటినుంచి ఆయన్ను ఆహ్వానిస్తూ పలు దేశాల దౌత్యవేత్తలు ప్రవాస భారతీయుల నుంచి విజ్ఞప్తులు వెల్లువెత్తా యని పెట్రోడా అన్నారు. తాజా పర్యటనలో రాహుల్‌గాంధీ నేషనల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే విలేకరుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

# భారత్‌లో బయటపడిన మంకీపాక్స్ తొలికేసు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: ప్రాణాంతక మంకీ పాక్స్ వ్యాప్తి పలుదేశాలను కలవరపెడుతున్నవేళ భారత్‌లోనూ ఈకేసు నమోదయింది. వ్యాధి తీవ్ర అధికంగా ఉన్న దేశంనుంచి వచ్చిన ఓ యువకుడిలో ఎంపాక్స్ లక్షణాలు గుర్తించినట్లుకేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. వెంటనే ఆతడిని ఐసొలేషన్‌లో ఉంచామని ప్రస్తుతం ఆతడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపింది. రోగినుంచి నమూనా సేకరించి ఎంపాక్స్ నిర్ధారణకోసం పంపించామని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని అదేసమయంలో వ్యాధి సంక్రమణ మూలాలను గుర్తించేందుకు కాంటాక్ట్‌ట్రేసింగ్ కొనసాగు తున్నదని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇటువంటికేసులు వెలుగు చూసిన సందర్భంలో వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు తెలిపింది. మరో ప్రాణాంతక కెంపాక్స్ వ్యాప్తి ఆఫ్రికాదేశాల్లో ఆందోళన కరరీతిలో ఉన్నట్లు నివేదికలు చెపుతున్నాయి. ఇప్పటికే 18 వేల అనుమానిత కేసులు 926 మరణాలు సంభవించాయి. కొత్తరకం కేసులు ఇప్పటివరకూ 258 నమోద య్యాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది. ఆఫ్రికాలోని బురుండి, రువాండా, కెన్యా, ఉగాండాతోపాటు స్వీడన్ థాయిలాండ్ దేశాల్లోను ఈకేసులు వెలుగు చూసాయి. భారత్‌లోనూ ఈ ఏడాది మార్చి తర్వాత ఈకేసులు నమోదు కాలేదు.

# భారత్‌లో చేరేందుకు ముందడుగేయాలి

## పాక్ ఆక్రమిత కాశ్మీర్ వాసులకు కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పిలుపు



శ్రీనగర్, సెప్టెంబరు 8: జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. రామ్‌బన్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన బిజెపి ప్రచారంలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె) విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. పిఒకె వాసులు భారత్‌లో కలిసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పాకిస్థాన్ మాదిరి తాము వారికి విదేశీయుల్లా కాకుండా సొంతమనుషుల్లా పరిగణిస్తున్నామని తెలిపారు. 'జమ్మూకాశ్మీర్‌లో బిజెపికి మద్దతు ఇస్తే.. స్థానికంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. మాకు పాకిస్థాన్‌తో కలిసి ఉండటం ఇష్టం లేదు. భారత్‌కు వెళ్తామని పిఒకెలోని ప్రజలు చెప్పేంత అభివృద్ధి చేస్తాం. పిఒకెను పాక్ ఓ విదేశీ భూభాగంగా పరిగణిస్తోంది. దాయాది దేశంలోని అదనపు సొలిసిటర్ జనరల్ కూడా ఇదే విషయాన్ని ఇటీవల ఓ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అక్కడి ప్రజలను పాకిస్థాన్ విదే శీయులుగా చూస్తోంది. కానీ, భారత్ అలా కాదు. సొంత మనుషుల్లా భావిస్తోంది. మాతో వచ్చి చేరండి' అని రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్- నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తుపై కేంద్ర మంత్రి విరుచుకుపడ్డారు. బిజెపి ఉన్నంత జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 పునరుద్ధరణ అసాధ్యమని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370ను రద్దు చేసిన తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో భద్రత పరిస్థితిలో మంచి మార్పు వచ్చిందని తెలిపారు. ఇదిలా ఉండగా.. జమ్మూ కాశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో (సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1) పోలింగ్ నిర్వహించనున్నారు. 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# హుడా కుటుంబాన్ని ఎప్పటికీ ప్రజలు క్షమించరు

## హర్యానా ప్రచారంలో బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ ధ్వజం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 8: బిజెపి నాయకుడు, మాజీ ఎంపి బ్రిజ్‌భూషణ్ హరియాణా మాజీ సీఎంపై విమర్శలతో ధ్వజమెత్తారు. మాజీ సీఎం భూపీందర్‌సింగ్ హుడా, ఆయన కుటుంబసభ్యులను పాండవులతో పోల్చారు. మహాభారత సమయంలో ద్రౌపదిని పెట్టిన జూదమాడి పాండవులు ఓడిపోయారు. దానివల్ల ఆమె పరాభవం పొందింది. అందుకు పాండవులను దేశం ఇప్పటికీ క్షమించలేదు. అలాగే మన అక్కచెల్లెళ్ల ఆడపడుచుల పరువుకు భంగం కలిగించిన హుడా కుటుంబాన్ని కూడా ప్రజలు క్షమించరు. ఈ విషయంలో వారిని ఎప్పుడూ దోషులుగానే చూస్తారని అన్నారు. రెజ్లర్లు వినేశ్‌ఫొగట్, భజరంగ్ పూనియా కాంగ్రెస్‌లో చేరిన విష యంపై ఆయన మాట్లాడుతూ రెజ్లర్లు తనపై చేసిన ఆరోపణలు, నిరసనలు అన్నీ కాంగ్రెస్ కుట్రలో భాగమేనని ఇపుడు రుజువవుతోందని అన్నారు. ఈ విషయంలో భూపీందర్‌సింగ్ కూడా కీలకపాత్ర పోషించారని విమర్శించారు. బ్రిజ్ భూషణ్‌పై రెజ్లర్లు ఆరోపణ చేయడం ఫలితంగా ఆయనపై కేసులు నమోదుకావడం, కోర్టులో కూడా బ్రిజ్ భూషణ్‌కు చుక్కెదురు కావడం వంటివి జరిగాయి. ఇదిలా ఉంటే ఆదివారంనుంచి కాంగ్రెస్ తరపున వినేశ్ ఎన్నికల్లో ప్రచారం ప్రారంభించారు. జులానా స్థానం నుంచి ఆమె పోటీలో ఉన్నారు. తాను రెజ్లింగ్‌లో ఏది గెలిచినా అది ప్రజల వల్లనేనని అలాగే ఎన్నికల్లోనూ విజయం సాధిస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మమ్మల్ని అక్కడ కూర్చునేలా బిజెపిచేసింది. నా ప్రతి అడుగులో నా సొంతప్రజలే నాతో ఉన్నారని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నానని, ఇకపై నేను చేసే ప్రతియుద్ధంలో విజయం సాధిస్తానని వినేశ్ వెల్లడించింది.

# నేను అధికారంలోకి వస్తే..వారంతా జైలుకే

## అమెరికా మాజీ ప్రెసిడెంట్ ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, సెప్టెంబరు 8: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ఎన్నికల సమయంలో అవినీతికి పాల్పడే వారిని ఉద్దేశిస్తూ ఈ పోస్టు చేశారు. తాను అధికార పీఠమెక్కాక అవినీతిపరులందరిని జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. తమ ప్రభుత్వం వారికి కఠిన శిక్ష అమలు చేస్తుందని పేర్కొన్నారు. 'దయచేసి జాగ్రత్త వహించండి. అధ్యక్ష ఎన్నికల్లో నేను గెలిస్తే.. చట్ట వ్యతిరేక కార్యకాలాపాలు, ఓటింగ్‌లో అనైతిక చర్యలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తే లేదు. న్యాయవాదులు, రాజకీయ నా యకులు, దాతలు, అక్రమ ఓటర్లు, అధికారులు అందరికీ అదే వర్తిస్తుంది. పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుంది. ఓటింగ్‌లో అవినీతికి పాల్పడినట్లు తేలితే.. మునుపెన్నడూ చూడని విధంగా చర్యలు ఉంటాయి. దీర్ఘకాల జైలు శిక్షలు ఉంటాయి. తద్వారా న్యాయ దుర్వినియోగం మళ్లీ జరగదు' అని ట్రంప్ హెచ్చరించారు. గత అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమిని చవి చూశారు. నాడు ఎన్నికల వేళ అవినీతి జరిగిందంటూ ఆయన ఆరోపించారు. కానీ, దాన్ని రుజువు చేసేందుకు సరైన ఆధారాలు లేకపోవడంతో అవి ఆరోపణలుగా మిగిలిపోయాయి. దీంతో ఓటింగ్ వేళ మరో సారి అవినీతి జరగకుండా ఉండాలనే ఆయన ఈ పోస్టు పెట్టినట్లు తెలుస్తోంది. అవినీతి జరిగితే అధికారం చేపట్టగానే వారిపై చర్యలు తీసుకుంటానని పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. కాగా త్వరలో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. రేసు నుంచి అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకోగా ఉపా ధ్యక్షురాలు కమలా హారిస్ ప్రచారంలో దూసు కెళుతున్నారు. మరోవైపు ట్రంప్ అధికారం చేజిక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అధ్యక్ష అభ్యర్థులుగా ఖరారైన వీరిద్దరూ తొలి డిబేట్‌లో పాల్గొననున్నారు. ఈ డిబేట్‌పై యావత్ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.



# రైలు కప్లింగ్ బ్రేక్‌తో రెండుగా విడిపోయిన మగధ్ ఎక్స్‌ప్రెస్

పాట్నా, సెప్టెంబరు 8: రైలు బోగీల మధ్య ఉంటే కప్లింగ్ బ్రేక్ అయ్యింది. దీంతో ఆ రైలు రెండుగా విడిపోయింది. ఈ నేపథ్యంలో ప్రయాణికులు భయాందోళన చెందారు. బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. న్యూఢిల్లీ నుంచి ఇస్లాంపూర్‌కు వెళుతున్న మగధ్ ఎక్స్‌ప్రెస్ కప్లింగ్ తెగిపోయింది. దీంతో ట్వినిగంజ్, రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య ఆ రైలు రెండుగా విడిపోయింది. ఆదివారం ఉదయం 11.08 గంటల సమయంలో ఈ సంఘటన జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు. 'రైలు ట్వినిగంజ్ స్టేషన్ దాటినప్పుడు ఈ సంఘటన జరిగింది. రైలు ఇంజన్ నుంచి 13, 14వ కంపార్ట్‌మెంట్లు అయిన ఎస్-7, ఎస్-6 కోచ్‌ల మధ్య కప్లింగ్ బ్రేక్ అయింది. ఆ రైలు రెండుగా విడిపోయింది' అని ఈస్ట్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సిపిఆర్ఒ) సరస్వతి చంద్ర వెల్లడించారు. కాగా, రెస్క్యూ టీమ్, సాంకేతిక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయని రైల్వే అధికారులు తెలిపారు. సమస్యను సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రైలు కప్లింగ్ బ్రేక్‌పై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ సంఘటన వల్ల డౌన్‌లైన్‌లో రైళ్ల రాకకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు వివరించారు.

# హసీనాను రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం

## బంగ్లాదేశ్ చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం



ఢాకా, సెప్టెంబరు 8: బంగ్లాదేశ్‌లో ఇటీవల రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనల్లో పెద్ద ఎత్తున హింస చెలరేగిన విషయం తెలిసిందే. వందలమంది మృతిచెందారు. ఈ క్రమంలోనే మాజీ ప్రధాని షేక్ హసీనా తదితరులపై హత్యకేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. సామూహిక హత్యల ఆరోపణలపై విచారించేందుకుగాను ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ కొత్త చీఫ్‌ప్రాసిక్యూటర్ ఎండి తాజుల్ ఇస్లాం తెలిపారు. సామూహిక హత్యలు ఇతర నేరాలకు సంబంధించి షేక్ హసీనా సహా పరారీలో ఉన్న నిందితులం దరిపైనా అరెస్టు వారంట్లు జారీచేసేందుకు ఐసిటికి దరఖాస్తుచేస్తామని ఢాకాలో తాజుల్ ఇస్లాం తెలిపారు. నిందితుల అప్పగింత ఒప్పందం కింద హసీనాను భారత్‌నుంచి బంగ్లాదేశ్‌కు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నిందితులకువ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆధారాలు సేకరించాల్సి ఉందని ఇది సవాలుతో కూడుకున్న పని అని చెప్పారు. తాత్కాలిక ప్రభుత్వ ఆరోగ్యసలహాదారు నూర్జహాన్ బేగం తెలిపిన వివరాలప్రకారం హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో వెయ్యిమందికి పైగా మరణించారని అన్నారు. జులై 15 నుంచి ఆగస్టు ఐదువరకూ జరిగిన మారణ హోమం ఇతరనేరాల ఆరోపణలపై హసీనా మరో తొమ్మిది మందిపైఐసిటి గతనెలలో దర్యాప్తు ప్రారంభించింది. ఐసిటిని పునర్ వ్యవస్థీకరిస్తున్నారు.

## కొల్లేరు ముంపు గ్రామాల పరిస్థితిని పరిశీలించిన ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి
### - వరద బాధితులకు అండగా ఉంటాం.






**ఏలూరు ప్రభాతవార్త :**
వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా చేయడంతో పాటు అన్ని విధాల వారికి అండగా ఉంటామని ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి చెప్పారు. జిల్లా కలెక్టర్ వారీ ఆదేశాల మేరకు వరద బాధితులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.మండవల్లి మండలంలో వరద ముంపుకు గురైన నూచుమిల్లి తదితర ప్రాంతాలను ఆదివారం ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి సందర్శించారు. ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాలకు బోటు ఏర్పాటు చేసి రోడ్డు సౌకర్యం లేని చోట వరద ప్రభావిత ప్రాంతాలకు తాగునీటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థానిక గ్రామస్తులతో వరద పరిస్థితి పై మాట్లాడారు. కొల్లేరు ప్రభావిత మండలాల్లోని తహశీల్దార్లు,ఇతర అధికారులను ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేస్తూ సహాయ పునరావాస కార్యక్రమాలు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.రేషన్ కూడా అందించేందుకు చర్యలు తీసుకున్నమన్నారు.పలు చోట్ల పశు వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పెదఎడ్లగాడివద్ద వరద పరిస్థితిని ఆర్డీవో పరిశీలించారు. వీరి వెంట స్థానిక తహసీల్దార్,తదితరులు ఉన్నారు.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

# వరద తీవ్రత తగ్గాకే నిమజ్జనాలు చేయండి
### - జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

**ఏలూరు, సెప్టెంబర్, 8 : ప్రభాతవార్త :**
జిల్లాలో వినాయక విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి ప్రాణ నష్టాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై ఆదివారం అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వరద నీరు ఎక్కువగా ప్రాంతాలలో వరదనీరు తగ్గిన తరువాత వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించేలా చూడాలన్నారు. నిమజ్జనం చేసే చెరువు, కాలువలు వంటి ప్రదేశాలలో నీటి ప్రవాహాన్ని పరిశీలించాలని, నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, నిమజ్జనం చేసే విగ్రహాలు ఎక్కువ ఉన్న ప్రాంతాలలో విగ్రహాల నిమజ్జనానికి క్రేన్ లు, జేసీబీ లు వంటివి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు ఎక్కువగా నీటి వనరులలోనికి వెళ్లకుండా చూడాలన్నారు. నిమజ్జనం కార్యక్రమం పగలు సమయంలోనే జరిగేలా చూడాలన్నారు. నిమజ్జన ఊరేగింపుల సమయంలో అధిక సంఖ్యలో ప్రజలు, వాహనాలు పాల్గొనే అవకాశం ఉన్నందున, వరదలు కారణంగా వంతెనలు బలహీనంగా ఉన్న ప్రాంతాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి అనుమతులు ఒకే రోజు జారీ చేయకుండా చూడాలన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశంలో భద్రతా సిబ్బంది, గజ ఈతగాళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అటువంటి ప్రదేశాలలో నిమజ్జనానికి అనుమతులు జారీ చేయవద్దని కలెక్టర్ చెప్పారు. గత



అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనంనకు సంబంధించి మండల స్థాయిలో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులకు సూచించారు.

## కొల్లేరు వరద ప్రభావిత లంక గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే డా. కామినేని

**ఏలూరు. ప్రభాతవార్త :**
మండవల్లి మండలం కొల్లేరు లంక గ్రామాలైన తక్కెళ్ళపాడు,కొవ్వాడ లంక, నూచుమిల్లి గ్రామాలను ఆదివారం కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజావలి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరు ప్రభావిత మండలాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి బాధితులకు సహాయ పునరావాస కార్యక్రమాలు త్వరగా అమలు చేయాలన్నారు. ఎక్కడ ఏ చిన్న ఇబ్బంది జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. నూచుమిల్లి గ్రామంలో వరద బాధితులకు రేషన్ పంపిణీ చేశారు.



## వరద బాధితులకు సహాయం...



**ప్రభాతవార్త... నర్సాపురం :**
వరద బాధితులుగా సాయం కోసం ఎదురుచూస్తున్న వారికి తనకు తోచిన సహాయాన్ని అందించడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విజయవాడలోని వరద పరిస్థితులు ప్రతి ఒక్కరిని కల్చివేశాయని, సాయం అందించడానికి ప్రతి ఒక్కరూ ముందడుగు వేస్తున్నారని అన్నారు. భీమవరం నివాసి రవీంద్ర శ్రీరామ్ కమర్షియల్ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కృష్ణంరాజు సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం ఒక లక్ష రూపాయలు చెక్కును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి శుక్రవారం అందజేశారు.

**విజయవాడ వరద బాధితులకు సిద్ధాంతం జడ్పీ స్కూల్ రూ.25 వేలు ఆర్థిక సహాయం..**
విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సహాయంగా పెనుగొండ మండలం సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రూ.25 వేల చెక్కును భీమవరం కలెక్టరేట్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి డీఈవో జి.నాగమణి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఎస్.వి.వి ప్రసాద్, తదితరులు శుక్రవారం అందజేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడిగా కొణతం విజయబాబు యాదవ్



**నూజివీడు, సెప్టెంబర్08 ప్రభాతవార్త:**
పాన్ ఇండియా ఐకానిక్ అవార్డ్స్ -2024 లో భాగంగా,దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన ఉపాధ్యాయులకు ఈ అవార్డులను ఆదివారం అందజేశారు. పాన్ ఇండియా ఐకానిక్ అవార్డ్స్. పి టి ఎల్ ఎఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం గుంటూరులోని నెక్స్ట్ జనరేషన్ కెనడి పాఠశాలలో జరిగింది. నూజివీడు పట్టణంలోని స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న విజయబాబు యాదవ్ పాన్ ఇండియా ప్రతినిధుల నుంచి అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన ఉపాధ్యాయుడిని సెయింట్ ఆన్స్ పాఠశాల హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

## జిల్లాలోనే చాట్రాయిలో అత్యధిక వర్షపాతం

**చాట్రాయి,సెప్టెంబర్ 8, ప్రభాతవార్త :**
ఏలూరు జిల్లాలోనే చాట్రాయి మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయింది. చాట్రాయి మండలంలో శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు 68.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు తహసిల్దార్ డి ప్రశాంతి చెప్పారు. అయితే మండలంలో అన్ని గ్రామాలలో చెరువులు అలుగులు పడ్డాయని చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు గ్రామ రెవెన్యూ అధికారులతో పరివేక్షణ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రస్తుతానికి చెరువులకు ఎటువంటి ముప్పు ఏర్పడే అవకాశాలు లేవని గ్రామస్థాయిలో అధికారులు అందుబాటులో ఉన్నారని ఏదైనా సమాచారం ఉంటే రైతులు వెంటనే తెలియజేయాలని ఆమె కోరారు. ఆదివారం ఉదయం నుండి కూడా వర్షం పడుతున్నందున అవసరమైతే



తప్ప ప్రజలు బయటకు రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

## జిల్లావాసుల సాయం సంతోషించ దగినది కలెక్టర్ నాగరాణి



**భీమవరం సెప్టెంబర్ 8 ప్రభతవార్త :**
జిల్లా వాసులు వరద బాధితులకు తోచిన సాయం చేస్తూ అండగా నిలవడం ఎంతో సంతోషించదగిన విషయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.శనివారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నందు భీమవరం మోహన్ సర్వీస్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ప్రొప్రైటర్ కె. బాలకృష్ణం రాజు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిసి రూ.2 లక్షల చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ పేరున అందజేశారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా వాసులు ముందు వరుసలో ఉండడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అన్నారు.

## మట్టి విగ్రహాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాధాకృష్ణ

**తణుకు రూరల్ ( ప్రభాత వార్త) :**
తణుకు మైత్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని పట్టణ వాసులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లతుతూ పర్యావరణాన్ని రక్షించే విధంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతి వాడలో ఎంతో ఘనంగా జరుపుకొనే వేడుక వినాయక చవితి అని ఇలాంటి కార్యక్రమాన్ని పర్యావరణాన్ని రక్షించుకునే విధంగా మట్టి విగ్రహాలను పంపిణి చేపట్టడం శుభాపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు,



కార్యకర్తలు, మైత్రి లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వాగులో పడి యువకుడు మృతి

**చాట్రాయి,సెప్టెంబర్ 8,ప్రభాతవార్త :**
చాట్రాయి మండలం తుమ్మ గూడెం గ్రామంలో విషాద సంఘటన చోటు చేసుకుంది.లింగపాలెం నుండి తుమ్మగూడెం ద్విచక్ర వాహనం పై వ్యక్తి వాగు వద్ద అదుపు తప్పి పడి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం లింగపాలెం మండలం చిలక రాయుడుపాలెం గ్రామానికి చెందిన పొదిలి సూర్య ప్రకాష్( 35) ధర్మాజీ గూడెం లో ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్నాడు. ఆదివారం తుమ్మ గూడెం గ్రామానికి వస్తుండగా రోడ్డుపై ఉన్న వరదలో బైకు గుంతలో పడిపోయి మృత్యువాత పడ్డాడు.బైక్ పై ఉన్న మరో యువకుడిని గ్రామస్తులు కాపాడారు. సమాచారం తెలుసుకున్న చాట్రాయి ఎస్. ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.





నరసాపురం మండలం, సరిపల్లి గ్రామం, హనుమాన్ సెంటర్ లో వినాయక చవితి సందర్భంగా , స్వామి వారిని దర్శించుకుని , అనంతరం అఖండ అన్న సమారాధన లో పాల్గొన్న నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు. ప్రభాతవార్త.. నర్సాపురం

## ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి- మంత్రి పార్థసారథి

**ఏలూరు, సెప్టెంబర్, 8 : ప్రభాతవార్త :**
జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లాలోని ఇరిగేషన్, రెవిన్యూ అధికారులతో జిల్లాలో వరద పరిస్థితిపై మంత్రి పార్థసారథి టెలిఫోన్ ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకూ కాజ్ వే లు, కల్వర్టుల వద్ద వాహనాలు, ప్రజల రాకపోకలను నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలనీ, సిబ్బందిని కూడా నియమించాలన్నారు. లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను పునవారస కేంద్రాలకు తరలించి, భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. పునవారస కేంద్రాల పరిసరాలు, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాల్లోని వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి తగ్గుముఖం పట్టిందని, అయినప్పటికీ వరద ప్రమాదం పూర్తిగా తొలిగిపోయే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ్మిలేరు, కొల్లేరు లలో వరద ఉధృతి ఎక్కువగా ఉందని, ఆయా గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వరద ప్రమాద ముంపు తొలగే వరకు అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, వరదల కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు కలగకుండా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి పార్థసారథి చెప్పారు.



## అస్లీల నృత్యాల పై కేసు నమోదు : డిఎస్పీ మూర్తి


**అత్తిలి - సెప్టెంబర్ 8 ( ప్రభాత వార్త )**
:వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే సంబంధిత ఉత్సవ కమిటీలపై కేసులు నమోదు చేస్తా మని తాడేపల్లిగూడెం డీఎస్పీ డీఎస్ఆర్వీఎస్ఎన్ మూర్తి హెచ్చరించారు. తణుకు రూరల్ పోలీసు స్టేషన్లో విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం, తణుకు మండలం వేల్పూరు గ్రామంలో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తున్న నిర్వాహక కమిటీ సభ్యులతోపాటు మహిళలు, హిజ్రాలు మొత్తం 17 మందిపై కేసులు నమోదు చేశా మన్నారు. ఉత్సవాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పుడే నిర్వహణ, మైక్, లైటింగ్, మున్సిపల్, ఫైర్, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు తీసుకునేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశా మని చెప్పారు. దరఖాస్తు చేసుకున్నప్పుడు నిర్వహకుల వివరాలు



సేకరిస్తున్నామన్నారు. తాడేపల్లిగూడెం సబ్‌డివిజన్ పరిధిలో అక్కడక్కడా అశ్లీల నృత్యాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని,సంబంధిత నిర్వాహకులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నృత్యాలకు సహకరించే వాహనాల యజమానులు, డ్రైవర్లను, మైక్, లైటింగ్ వేసిన వారిని బాధ్యులు చేస్తామని అన్నారు. తణుకు రురల్ సీఐ జివి వి నాగేశ్వరరావు , ఎస్ ఐ. ఏ జి ఎస్ మూర్తి పాల్గొన్నారు.

# వరద బాధితులను ఆదుకుందాం
### -తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి

**తణుకు రూరల్ (ప్రభాతవార్త) :**
మంచి మనసుతో చేసే విరాళాల ద్వారా వరద బాధితులను ఆదుకుందామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు.తణుకు నుంచి కొందరు దాతలు విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదివారం ఎమ్మెల్యే ఆరిమిల్లిని కలిసి మూడు లక్షల ఎనభై ఐదు వేల రూపాయలు విరాళాలను సీఎం రిలీఫ్ ఫండ్ పేరున అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి మాట్లాడుతూ వర్షాలు, వరదలు మిగిల్చిన విషాదాన్ని త్వరలోనే ప్రభుత్వం అధిగమించి ప్రజలకు అన్నివిధాల న్యాయం జరిగేలా చూస్తుందన్నారు. అయితే రాష్ట్రమంతా బాధితులకు ఆర్థిక రూపంలోనూ పలు రకాలుగా సహకారం అందిస్తుందని, తమ నియోజకవర్గం నుంచి కూడా వందల్లో తన అభిమానులు బాధ్యత గల పౌరులు ముందుకు వచ్చి ఆంధ్రప్రదేశ్ సీఎం రిలీఫ్ ఫండ్ కు విరివిగా విరాళాలు అందించాలని కోరారు. ప్రజలు ఇటువంటి దురదృష్టకర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలవడం చాలా అవసరం ఉందని తెలియజేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు పది రోజులుగా నిద్రాహారాలు మాని రాత్రి పగలు వారికి అండగా నిలబడి వరద వచ్చిన పరిస్థితి నుంచి సాధారణ పరిస్థితుల్లోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ కు ముళ్ళపూడి మృత్యుంజయ ప్రసాద్ రెండు లక్షల రూపాయలు, డాక్టర్ కోసూరు సత్యనారాయణ రాజు 50 వేల రూపాయలు, దాసం బాబ్జి 10 వేల రూపాయలు, అత్తిలి



లైన్స్ క్లబ్ నుంచి 25 వేల రూపాయలు, వై నారాయణరావు లక్ష రూపాయలు అందజేయగా ఎమ్మెల్యే వీరందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం ఏనుగువానిలంక గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన నరసాపురం నియోజకవర్గ శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ మరియు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు .ఈ కార్యక్రమంలో పాలకొల్లు,నర్సాపురం నియోజవర్గ జనసేన టిడిపి బిజెపి నాయకులు కార్యకర్తలు జనసైనికులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు ప్రభాత వార్త నర్సాపురం:

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ రద్దు..

ఏలూరు,సెప్టెంబర్ 8: ప్రభాతవార్త జిల్లాలో నమోదవుతున్న అధిక వర్షపాతం కారణముగా జిల్లా లోని అధికారులు వరద ముంపు ప్రాంతములలో సహాయక చర్యలలో నిమగ్నమైన దృష్ట్యా ది. 09-09-2024 (సోమవారము) కలెక్టర్ వారి కార్యాలయము నందు మరియు జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయములు, మండల కార్యాలయములు మరియు మున్సిపల్ కార్యాలయములలో జరుగు ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమము రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి తెలిపారు.



భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సన్మాన సభలో నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ను ఘనంగా సత్కరించారు. ప్రభాతవార్త నరసాపురం

## మానవతా సభ్యత్వం స్వీకరించిన తహసీల్దార్

. అత్తిలి – సెప్టెంబర్ 8 ( ప్రభాత వార్త ): అత్తిలి మండల తహసీల్దార్ దశిక వంశి మానవతా సభ్యత్వం స్వీకరించారు. కొత్తగా వంద మందిని సభ్యులు గా చేర్పించగలనని అయన సభ్యులకు తెలిపారు. అత్తిలి ఎస్ ఐ పి. ప్రేమ రాజు కూడా మానవతా సభ్యత్వం స్వీకరించారు. ఇరువురిని సంఘం తరపున సత్కరించునట్లు మానవతా సభ్యులు బోడపాటి సూర్య చంద్రరావు , ఆనాల ఆదినారాయణరావు తెలిపారు.

## వాడ వాడలా వినాయక చవితి

చాట్రాయి, సెప్టెంబర్ 8,ప్రభాతవార్త : చాట్రాయి మండలంలో అన్ని గ్రామాలలో వాడ వాడలా వినాయక చవితి పండుగను వైభవంగా నిర్వహించారు. ప్రతి గ్రామంలో వినాయకుడి మండపాలను విద్యుత్ అలంకరణతో పాటు వివిధ రకాల పూలమాలలతోమండపాలను తీర్చిదిద్దారు. మండలంలో ప్రతి గ్రామంలో మూడు నుండి ఆరు వరకు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు గావించారు. బూరుగుగూడెం గ్రామంలో మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశ రెడ్డి రాఘవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుగొలను పేటలో లక్ష్మమ్మ అంకమ్మ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడికి నందు మాజీ సర్పంచ్ ఇజ్జి గాని వెంకటేశ్వరరావు దంపతులు మరికొందరు కలిసి పూజలో నిర్వహించారు. మండల కేంద్రమైన చాట్రాయి లో రామాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడు విగ్రహం వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజలు నిర్వహించారు.మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను చాట్రాయి ఎస్.ఐ రామకృష్ణ ప్రతి గ్రామం తిరిగి పరిశీలన చేసి అనుమతుల గురించి అడిగి



తెలుసుకున్నారు. మండపాల వద్ద ఎలాంటి గలాటా లేకుండా భక్తి భావంతో పూజలు నిర్వహించాలని నిర్వాహకులకు ఆయన తెలియ చెప్పారు.

## అధిక ధరలకు తెలంగాణా మద్యం విక్రయాలు?
### విచ్చలవిడిగా బెల్ట్ షాపులు!



కుక్కునూరు–ప్రభాత వార్త: రాష్ట్రంలో బ్రాండెడ్ కంపెనీల మద్యం దొరకక పోవడంతో మందు బాబులు తెలంగాణలో దొరికే బ్రాండెడ్ కంపెనీల మద్యాన్ని మండలంలోకి తెచ్చి ఎక్కడపడితే అక్కడ వి చ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నట్లు సమాచారం. దీన్ని ఆసరాగా చేసుకొని కుక్కునూరు మండలంలోని ప్రతి గ్రామంలో ఐదు నుంచి పది బెల్టు షాపులు యదేచ్చగా యదేచ్చగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని సీతారామనగరం, వేలేరు, పెదరాయిగూడెం, అల్లిగూడెం, బోనగిరి, ఇబ్రాహీం పేట, బంజర గూడెం, ఉప్పేరు, దామరచర్ల, చీరవల్లిజ్ కుక్కునూరు గ్రామాల్లో పెద్దఎత్తున తెలంగాణా మద్యం అమ్మకాలు. సాగుతున్నట్లు సమాచారం కుక్కునూరు మండలంకు పక్కనే ఉన్న . తెలంగాణ రాష్ట్రం బూర్గంపాడు, అశ్వారావుపేట, ములకలపల్లి, మండలాల్లోని వైన్ షాపుల నుంచి మద్యాన్ని తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్క గ్రామంలో సుమారు రూ.300/–నుంచి రూ.500/– వరకు ఒక్కో క్వార్టర్ బాటిల్ అమ్ముతున్నట్లు సమాచారం. అసలు దరకంటే అదనంగా రూ.150/– వసూలు చేసి మందు ప్రియుల నుండి దోచే స్తున్నట్లు సమాచారం. కొందరు వ్యక్తులు బెల్టు షాపు యజమానులతో మాట్లాడుకొని వారికీ తెలంగాణ మద్యాన్ని సరఫరా చేస్తు ఈ దందా సాగిస్తున్నట్లు సమాచారం. మండలంలో ఇంత పెద్ద ఎత్తున తెలంగాణా మద్యం అమ్మకాలు సాగుతున్న సంబధిత అదికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఏంటని? ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికైనా సంబంధిత అదికారులు తెలంగాణా మద్యం అమ్మకాలను అరికట్టాలని మండలప్రజలు కోరుచున్నాను.

## ముఖ్యమంత్రి సహాయ నిధికి మంచిలి గ్రామస్తుల విరాళం.

అత్తిలి – సెప్టెంబర్ 8 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం మంచిలి గ్రామస్తులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం లక్ష 8 వేలరూపాయలు విరాళాలు సేకరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛను దారులు సైతం 5 వందలు వంతున విరాళం అందచేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన భగవాన్ పూతరేకులు నిర్వాహకుడు సిరగాని నాగేశ్వరరావు వరద బాధితుల సహాయార్థం లక్ష రూపాయలు విలువ చేసే పూత రేకులు పంపినట్లు తెలిపారు. 10 వేల రూపాయలు నగదు సహాయాన్ని కూడా పంపుతున్నట్లు తెలిపారు. సేకరించిన విరాళాలను తణుకు శాసన సభ్యుడు ఆరిమిల్లి రాధా కృష్ణ



ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

# వరద ప్రమాదం ముగిసే వరకు అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలి
## పునవారస కేంద్రాలలో ఆహారం పూర్తి నాణ్యతతో ఉండాలి

ఏలూరు, సెప్టెంబర్, 8 : ప్రభాతవార్త: జిల్లాలో వరద ప్రమాదం తగ్గే వరకు ఎటువంటి నష్టాలు కలగకుండా అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో వరద పరిస్థితిపై జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆదివారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టిందని, జిల్లాలో తమ్మిలేరు, కొల్లేరు లలో కొంతమేర వరద ఉధృతి ఉన్నదని అయినప్పటికీ అధికారులందరూ వరద ప్రమాదం తగ్గేవరకూ అప్రమత్తం ఉండాలన్నారు. కొల్లేరు నుండి ఉప్పుటేరు లోనికి వరద నీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ని కలెక్టర్ ఆదేశించారు. కొల్లేరు ప్రాంతాలంలోని వరద నీటి ఉధృతి కారణంగా కాజ్ వే, కల్వర్టుల వద్ద ప్రజలను వాహనాల రవాణాను నియంత్రించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వరదలు తగ్గేవరకూ వారికి కేటాయించిన మండలాల్లోనే ఉంది, పరిస్థితిని పరిశీలించాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని, ముఖ్యంగా పెదపాడు, మండవల్లి, కొల్లేరు ప్రాంతాలలోని వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించని, భోజన, వసతి సదుపాయాలు బాధితులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, బాధితులకు అందించే భోజనం పూర్తి నాణ్యతతో ఉండాలన్నారు. వరద ముంపునకు గురైన గ్రామాలలో ఇంటినుండి బయటకు వచ్చేందుకు వీలులేని కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

## కొల్లేరు వరద ముంపు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు...

ఏలూరు, సెప్టెంబరు, 8.. ప్రభాతవార్త : జిల్లాలోని వరుసగా కురుస్తున్న వర్షాలకు, బుడమేరు నుండి వస్తున్న వరద నీరు కొల్లేరు లో కలుస్తున్న నేపథ్యంలో కొల్లేరుకు ఆనుకున్న గ్రామాలన్నీ ముంపునకు గురైన కారణం చేత ఏలూరు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు సహాయక చర్యలలో భాగంగా పశుసంవర్ధక శాఖకు సంబంధించిన సిబ్బంది ఆదివారం నాడు ముంపుకు గురైన వివిధ గ్రామాల నందు హెల్త్ క్యాంపులు నిర్వహించడం జరిగిందని పశుసంవర్ధక శాఖ జెడి జి. నెహ్రూబాబు తెలిపారు. అందులో భాగంగా ఏలూరు జిల్లా నందు ముంపుకు గురైన గ్రామాలలో సుమారు 30 హెల్త్ క్యాంపులు నిర్వహించి, ఆ క్యాంపుల ద్వారా 1485 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసి, 697 పశువులకు వైద్య సేవలు అందించడం జరిగినది. దానితోపాటు ఇన్పుట్స్ సరఫరా కింద 90 కేజీల మినరల్ మిక్సర్ ప్యాకెట్లు మరియు 34 లీటర్ల లివర్ టానిక్ లు



అందజేయడం జరిగింది. ముంపుకు గురైన గ్రామాలలో పశువుల సంఖ్యను బట్టి వాటికి రాబోయే ఐదు రోజులకు గానూ అవసరమయ్యే సమీకృత దాణా సుమారు 200 టన్నుల సరఫరా నిమిత్తం ప్రతిపాదన పంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు ఏలూరు డివిజన్ డాక్టర్ టి. గోవింద రాజు, ఉప సంచాలకులు నూజివీడు డివిజన్ డాక్టర్ కే. చంద్ర శేఖర్ రావు తదితరులు పాల్గొన్నరు.



## ఈ వాహనాలకు మరమ్మతులు చేయించరా

ప్రభాతవార్త చాట్రాయి : గ్రామాల్లో చెత్తను తీసుకువెళ్లేందుకు లక్షల ఖర్చు చేసి వాహనాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి పాడైపోతే పట్టించుకునే నాథుడే కరువైన వైనమిది. గ్రామాల్లోని చెత్తను తీసుకెళ్లి సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు కొన్ని గ్రామాలకు ఆటోలను ప్రభుత్వం సరఫరా చేసింది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆటోలను కొనుగోలు చేశారు కానీ అవి మరమ్మతులకు గురైతే పట్టించుకునే నాథుడే కరువు అవటంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఆటోలను పంచాయతీలకు అప్పగించారు కానీ దాని నిర్వహణకు కేటాయించకపోవడంతో వాహనాలు తుప్పు పట్టి పోతున్నాయి. లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనం ఈ విధంగా వృధాగా పోతున్నా అధికారులు గానీ పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఈ విధంగా ఆటోలు శిధిలమై గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద దర్శనమిస్తున్నాయి. కొత్తగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వాహనం జగనన్న సురక్ష కార్యక్రమానికి వచ్చిన అధికారులు అందరికీ



కనపడుతున్నప్పటికీ చూసి చూడకుండా వెళ్ళిపోవటంపై ప్రజలు విమర్శలు చేశారు.దీనిపై ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి పాడైపోయిన వాహనాలను మరమ్మతులకు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## ఘనం గా వినాయక చవితి ఉత్సవాలు

అత్తిలి – సెప్టెంబర్ 8 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం లో వినాయక చవితి ఉత్సవాలు ఘనం గా ప్రారంభమయ్యాయి. అత్తిలి పెద్ద వంతెన వద్ద , గణేష్ చౌక్ వద్ద , తెనుకుల వారి కళ్ళం వద్ద , మార్కెట్ వద్ద , సీతానగరం ,గౌడ విధి వద్ద గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాలలో గణేష్ మంటపాలు ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేశారు. గణేష్ చౌక్ వద్ద బల్లంకి వెంకట నాగ శ్రీను దంపతులు పూజలు చేసారు. పెద్ద వంతెన వద్ద నల్లూరి సురేష్ దంపతులు పూజలు జరిపారు.



## ఘనంగావినాయక చవితి వేడుకలు



కాళ్ల సెప్టెంబర్ 8, (ప్రభాతవార్త) : వినాయక చవితి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి విగ్రహాలను ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఐదు అడుగుల నుండి 15 అడుగుల ఎత్తుకు పైబడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఒక గ్రామంలోనూ ఒక్కొక్క గ్రామంలోని ఆయా దేవాలయాల వద్ద, పలు ప్రాంతాలలో పందిరిలువేసి విగ్రహాలను ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన కాళ్ల పల్లపువీధిలో రంగానగర్లో శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయకుని విగ్రహాన్ని ప్రతిష్ట చేసి విశేష పూజ నిర్వహించి అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. దాతలు భక్తుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు



పెనుమంట్ర, సెప్టెంబర్–08, ప్రభాతవార్త: పెనుమంట్ర గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ గణపతి విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు శ్రీమతి రాధాదేవి దంపతులు శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వీరితో పాటు ముఖం శ్రీనివాస్ నాగమణి దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్న వారికి తీర్థప్రసాదాలు అందించడం జరిగింది. మధ్యాహ్నం నుండి లక్ష్మీ గణపతి స్వామివారి పల్లకి ఊరేగింపు గ్రామోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ సభ్యులు, నల్లిమిల్లి గోపిరెడ్డి, తుంపూడి విజయ్ కుమార్, జంపాల శ్రీనివాసరాజు, తాడి వీర వెంకటరెడ్డి, అరటి కట్ల సత్యనారాయణ, ఐటిఐ రాంబాబు, రాగు రాము, కర్రీ నాగిరెడ్డి, ఇసుకపల్లి రంగరాజు, తుంపూడి చంటి పాల్గొన్నారు.

## భీమవరం హాస్పిటల్స్ దత్రుత్వం



భీమవరం సెప్టెంబర్ 8 ప్రభతవార్త :విజయవాడ వరద బాధితులకు పశ్చిమగోదావరి జిల్లా నుండి వరద సహాయం కొనసాగుతూనే ఉంది. దీనిలో భాగంగా భీమవరం హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ బి.గోపాల్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.వి. కృష్ణంరాజు శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిసి ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. వరదలలో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా నిలుస్తున్న దాతలకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.



వినాయక పూజలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు వినాయక చవితి ఉత్సవాలు సంధర్భంగా భీమవరం లో మావుళ్ళమ్మ ఆలయంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, ఆయన కుమారుడు కొయ్యే సుందర్ రాజు అమ్మవారిని దర్శించుకుని వినాయక చవితి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.

## దాతల దత్రుత్వం వెల కట్టలేనిది
### ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు



భీమవరం సెప్టెంబర్ 8 ప్రభతవార్త :రాష్ట్రంలో అధిక వర్షాలు, విజయవాడలో వరదలు లో చిక్కుకున్న ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారని, ఆపదలో ఉన్న వారికి సహాయపడేందుకు దాతలు భారీ విరాళాలు అందించడం అభినందనీయమన్నారు భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు. ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ 2 లక్షల 50 వేలు జనసేన నాయకులు వేగేశ్న శివరామరాజు, చింతలపాటి బంగార్రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కి అందించారు. నిరంతరం కురుస్తున్న వర్షాలతో విజయవాడలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి సహాయం అందించేందుకు ప్రభుత్వానికి విరాళం ఇచ్చిన నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో అల్లూరి సత్యనారాయణ రాజు (ఉనికిలి), నడింపల్లి లక్ష్మీపతిరాజు, ఎస్ ఎస్ రావు, కందుల అరవింద్ పాల్గొన్నారు

**ప్రభాతవార్తకు విలేకరులు కావలెను**

తెలుగు జాతీయ దినపత్రిక వార్తలో విలేకరులుగా పని చేయుటకు ఈదిగువ సెంటర్లలో అనుభవం ఆసక్తి ఉన్నవారు ప్రభాతవార్త విలేకరిగా పనిచేయుటకు కావలెను. ఏలూరు, తాడేపల్లిగూడెం, ఆచంట , పెనుగొండ, పెదవేగి, భీమడోలు, గణపవరం , ఆకివీడు,పోలవరం, చింతలపూడి, లింగపాలెం, మొగల్తూరు, బుట్టాయిగూడెం , దెందులూరు, పెంటపాడు, కామవరపు కోట మండలాలుకు పట్టణాలకు. ఖాళీగా ఉన్న సెంటర్లలో పనిచేయుటకు కావలెను. అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

కాంటాక్ట్ నెంబర్: 9440374577

తెర

# యుఎస్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న 'దేవర' ప్రి బుకింగ్స్



**మ్యాన్ ఆఫ్ మాసెస్** ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈచిత్రం అనేక సంచనాలను క్రియేట్ చేస్తోంది. అభిమానులు సహా అందరూ ఎంతో ఆతృతగా ఈ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. ఈ మధ్య విడుదలైన ఫియర్ సాంగ్, చుట్టమల్లే.. దావుడి సాంగ్స్‌కు, టీజర్‌కు వచ్చిన రెస్పాన్స్ సినిమాపై ఉన్న అంచనాలు నెక్స్ట్ లెవల్‌కు చేరుకున్నాయి. ఓవర్‌సీస్‌లో 'దేవర' అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని ప్రత్యాంగిర సినిమాస్ అమెరికాలోనే ఎప్పుడు ఎవరూ చేయలేనంత గొప్పగా రిలీజ్‌చేయడానికి సన్నాహాలు చేస్తోంది. రీసెంట్‌గా ప్రీబుకింగ్స్‌ను యుఎస్‌లో ఓపెన్ చేయగా అక్కడ సెన్సేషన్ క్రియేట్ అవుతుంది. ఇప్పటికే ప్రీ సేల్స్ ఐదులక్షల డాలర్స్‌ను దాటేయటం విశేషం. సినిమాపై ఉన్న బజ్, ఊపు చూస్తుంటే ఇంకా ఈ లెక్కరోజురోజుకీ పెరుగుతోందే కానీ తగ్గడం లేదు. ఆడియెన్స్ ఎప్పుడెప్పుడు ఈ సినిమాకి ఫిల్‌ను తెరపై ఎంజాయ్ చేయద్దామా అని ఎదురు చూస్తున్నారు. అభిమానులు టికెట్స్ కోసం ఎగబడుతున్న తీరు చూస్తుంటే దేవర బాక్సాఫీస్ దగ్గర జోరు చూపిస్తారని అందరూ ఎదురు చూస్తున్నారు.

ఈ స్పీడు చూస్తుంటే యు.ఎస్‌లో దేవర రికార్డ్ బ్రేకింగ్ ఓపెనింగ్ కలెక్షన్స్ సాధిస్తుందని పిస్తోంది. త్వరలోనే రాబోతున్న ఈ మూవీ థియేట్రికల్ ట్రైలర్‌తో ఈ అంచనాలు నెక్ట్‌లెవల్‌కు రీచ్ అవుతాయనటంలో సందేహం లేదు. 2024లో విడుదలకు సిద్ధమైన ఈ యాక్షన్ చిత్రంలో భైరా అనే పాత్రలో సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటించారు. ఈ అమేజింగ్ సినిమాటిక్ ఎక్స్‌హై యాక్షన్ థ్రిల్లర్‌ను రెండు భాగాలుగా తెరకెక్కిస్తు న్నారు. మొదటి భాగం 'దేవర' పార్ట్ 1ను తెలుగు, తమిళం, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో సెప్టెంబర్ 27న విడుదల చేస్తున్నారు. 'దేవర'గా టైటిల్ పాత్రలో మ్యాన్ ఆఫ్‌ది మాసెస్ ఎన్టీఆర్ నటిస్తోన్న ఈ చిత్రంలో ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలను పోషించారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధా కర్, హరికృష్ణ, కె ఈ నీ నివాసం నిర్మిస్తున్నారు. ఆర్. రత్న వేలు సినిమాటో గ్రఫీ, సాబు శిరిల్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలను నిర్వ హిస్తు న్నారు.

## 'రామ్ నగర్ బన్నీ' ఫస్ట్‌లుక్ రిలీజ్



**ఆటిట్యూడ్ స్టార్** చంద్రహాస్ హీరోగా నటిస్తున్న సినిమా 'రామ్‌నగర్ బన్నీ. విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రితూ మంత్ర హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని దివిజ ప్రభాకర్ సమర్పణలో మలయజ ప్రభాకర్, పొడకండ నిర్మిస్తున్నారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్‌లో 'రామ్ నగర్ బన్నీ' సినిమాగ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ఫస్ట్‌లుక్, గ్లింప్స్ రిలీజ్ గ్రాండ్ ఈవెంట్ హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వరదబాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి తన వంతు సహాయాన్ని గడ్డం ప్రసాద్ కుమార్‌కి అందజేశారు హీరో చంద్రహాస్.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభాకర్ నాకు సుపరిచితులు. ఆయన రామ్‌నగర్ బన్నీసినిమా గురించి చెప్పి నన్ను ఇన్వైట్ చేశారు. ఈ కార్యక్రమానికి రావడం సంతోషంగా వుంది. చంద్రహాస్ మా అమ్మాయి క్లాస్‌మెట్. తెలంగాణలో వరదబాధితులను ఆదుకునేందుకు చంద్రహాస్ తనవంతు సహాయాన్ని అందించడం సంతోషంగా వుంది. మొదటి సినిమాకు హీరోలు అంతగా ఆకట్టుకోరు. కానీ చంద్రహాస్ బాగున్నాడు. ఫస్ట్‌లుక్, గ్లింప్స్‌తో ఆకట్టుకున్నాడు. అతన్ని రెండు రాష్ట్రాల ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నా. అలాగే కుటుంబ సభ్యులు ఆయన ఎలా ఎదగాలని కోరుకుంటున్నారో ఆ స్థాయికి చంద్రహాస్ చేరుకోవాలని బెస్ట్ విషెస్ అందిస్తున్నానని అన్నారు.

ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ మాట్లాడుతూ, 'మా రామ్‌నగర్ బన్నీ' ఫస్ట్‌లుక్, గ్లింప్స్ రిలీజ్ కార్యక్రమానికి అతిథిగావచ్చిన తెలంగాణ అసెంబ్లీస్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి థాంక్స్ చెబుతున్నా. రెండేళ్లక్రితం ఈ సినిమా అనౌన్స్ చేసినప్పుడు ఆటిట్యూడ్ చూపిస్తున్నాడు అనికామెంట్స్ చేశారు. నేను సినిమాల్లో ఒకలా, బయట మరొకలా బిహేవ్ చేయను. నా మనసులో ఏముందో అదే మాట్లాడుతుంటా. అది కొందరికినచ్చలేదు. ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయాలనే కోరికతో హీరోగా మారాను. అందుకు మా అమ్మానాన్నలు ఎంతో సపోర్ట్ చేశారు. మా నాన్న ప్రభాకర్ పేరు నిలబెట్టేలా కష్టపడతాను. నా ప్రతిభను నా సిని మాల రిజల్ట్ ద్వారానే తెలియజేయాలని భావిస్తున్నా. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నా. వాటిలో ఫస్ట్ మూవీగా రామ్‌నగర్ బన్నీ మీ ముందుకు రాబోతోంది. నెక్స్ట్ మంత్ అక్టోబర్‌లోనే మా సినిమాను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఇక నుంచి రెగ్యులర్‌గా మా మూవీ అప్డేట్స్ ఇస్తాం. అందరికీ కనెక్ట్ అయ్యే మూవీ ఇది. ఒక ఫ్లోలో వెళ్తుంటుంది. యూత్, ఫ్యామిలీ ఆడి యెన్స్ అందరికీ నచ్చుతుంది. రామ్‌నగర్ బన్నీ అనేది ఏ భాషలో సినిమా రిలీజ్ చేసేనా కనెక్ట్ అయ్యే టైటిల్. ప్రజల్ని ఎంటర్‌టైన్ ఎలా అనిపించిందో వాళ్లు బాధలో ఉన్నప్పుడు నావంతు సాయంగా వాళ్లకు సంతోషాన్ని పంచాలనిపించి నా కొద్ది పాటి సంపాదనలో వీలైనంత తెలంగాణ, ఏపీ సీఎం రిలీఫ్‌ఫండ్‌కు ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. మా కలెక్షన్‌లో10శాతం సహాయం అందిస్తాం. మీ అందరి సపోర్ట్ కావాలని కోరుకుంటున్నానని అన్నారు.

## 'మోగ్లీ' పోస్టర్ రిలీజ్



**పీపుల్ మీడియా** ఫ్యాక్టరీ విజనరీ ప్రొడ్యూసర్ టిజి విశ్వప్రసాద్ వినాయక చతుర్థి శుభ సందర్భంగా ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశారు. తనతొలి చిత్రం కలర్ ఫొటోతో జాతీయ మీడియా అవార్డును గెలుచుకున్న దర్శకుడు సందీప్‌రాజ్, ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్‌లో లవ్‌స్టోరీ కోసం యంగ్ ట్యాలెంటెడ్ రోషన్‌కానకాలతో కలిసి పనిచేయబోతున్నారు. యంగ్ నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సందీప్‌రాజ్, ఈ సినిమా కోసం మరొక అద్భుతమైన కథను రెడీ చేశారు. రోషన్ కనకాల, తన పెర్ఫార్మెన్స్, డ్యాన్స్‌లతో ప్రశంసలు అందుకున్నారు. మోగ్లీ పేరుతో రాబోతున్న ఈ చిత్రంలో యూనిక్ రోల్‌లో కనిపించనున్నారు.

రోషన్ కనకాల వెస్ట్ ధరించి, సాలిడ్ ఫిజిక్, దట్టమైన అడవిలో గుర్రంతో పాటు చిరునవ్వుతో కనిపించిన ఫస్ట్‌లుక్ పోస్టర్ అదిరిపోయింది. విజువల్‌గా పోస్టర్ కట్టిపడేసింది. ఈ చిత్రానికి ప్రముఖ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు, కలర్‌ఫొటోకు సక్సెస్‌ఫుల్ ఆల్బమ్ అందించిన కాలభైరవ సంగీతం సంది స్తున్నారు. బాహుబలి 1 అండ్ 2 ఆర్ ఆర్‌ఆర్ వంటి బ్లాక్ బస్టర్ ప్రాజెక్ట్‌లకు చీఫ్ అసోసి యేట్ సినిమాటోగ్రాఫర్ రామ మారుతి ఎమ్, సినిమాటోగ్రఫీ నిర్వహి స్తారు. కలర్ ఫొటో, మేజర్, ఆఫ్ కమింగ్ గూఢచారి 2 హిట్ చిత్రాకు ఎడిటర్ అయిన పవన్‌కళ్యాణ్ ఈ చిత్రానికి ఎడిట్ చేయనున్నారు. 'మోగ్లీ'ని 2025 సమ్మర్‌లో విడుదల చేస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు.

## శరవేగంగా 'జాక్ - కొంచెం క్రాక్'



**సిద్ధు జొన్నలగడ్డ..** రీసెంట్‌గా డీజే టిల్లు చిత్రానికి సీక్వెల్ టిల్లు స్క్వేర్‌తో బ్లాక్‌బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈయన కథానాయకుడిగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ : బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతోన్న తాజా చిత్రం 'జాక్'- కొంచెం క్రాక్' ట్యాగ్ లైన్. విలక్షణమైన సినిమాలు చేయడానికి ఇష్టపడే సిద్ధు జొన్నలగడ్డ, బొమ్మరిల్లు భాస్కర్ కాంబోలో మరో కొత్త జోనర్ మూవీగా జాక్ తెరకెక్కుతుంది. ఆడియెన్స్‌కు ఓ సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ను అందించే చిత్రంగా ఇది రూపొందుతోంది. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై సీనియర్ ప్రొడ్యూసర్ బివిఎస్‌ఎన్. ప్రసాద్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్‌లో జరుగుతోన్న షెడ్యూల్‌లో ప్రకాష్‌రాజ్, నరేష్, బ్రహ్మాజీ తదితరులతో హిలేరియస్ కామెడీ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. వీరితోపాటు సిద్ధు తిరుగులేని కామెడీ ట్రైమింగ్ ప్రేక్షకులకు తిరుగలేని ఎంటర్‌టైన్మెంట్‌ను అందించనుంది.

ఇప్పటి వరకు 80శాతం చిత్రీకరణ పూర్తయింది. నేపాల్‌లో తదుపరి షెడ్యూల్‌ను చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ షెడ్యూల్‌ను సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభించనున్నారు. అచ్చు రాజమణి ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. సరికొత్త జోనర్, ఫ్రెష్ కామెడీ, వావ్ అనిపించే సౌండ్ ట్రాక్‌ను అచ్చు రాజమణి సిద్ధం చేస్తున్నారు. సినిమాపై మంచి అంచనాలున్నాయి.

జాక్ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ టైటిల్‌ను పోషిస్తున్నారు. తనే క్రాక్ గాడు ఎందుకుంటాడనేదే తెలియాలంటే మాత్రం సినిమా చూడాల్సిందేనంటున్నారు మేకర్స్.




## 'శ్వాగ్' నుంచి 'గువ్వగూటిలో' సాంగ్

**కింగ్ ఆఫ్ కంటెంట్** శ్రీ విష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి కాంబో 'శ్వాగ్' హిలేరియస్ టీజర్‌తో అందరినీ మెస్మరైజ్ చేశారు. టీజర్‌లో శ్రీ విష్ణు క్యారెక్టర్స్‌లో, డిఫరెంట్ టైమ్‌లైన్‌లలో అద్భుతంగా అలరించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వివేక్‌సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. ఫస్ట్ సింగిల్ సింగరో సింగ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రం నుండి సెకండ్ సింగిల్ - గువ్వ గూటిలో విడుదల చేశారు. యయాతి డాన్స్‌ట్రూప్ హెడ్‌గా శ్రీ విష్ణు అదరగొట్టారు. ఈ పాట 80,90ల స్టయిల్ విజువల్ ఎసెన్స్, రెట్రో బీట్‌లు, స్టైలిష్ కొరియోగ్రఫీతో వింటేజ్ నాస్టాల్జిక్ డ్రైవ్ ప్రజెంట్ చేస్తోంది.



వివేక్‌సాగర్ రెట్రో - కంపోజింగ్, భువనచంద్ర ఆకట్టుకునే లిరిక్స్ కంప్లీట్ చేశాయి. మనో, గీతామాధురి, స్నిగ్ధాశర్మల డైనమిక్ వోకల్స్‌తో ఎనర్జిటిక్‌గా పాడారు, ట్రాక్ కన్నుల విందుగా ఉంది. రెట్రో -స్టైల్‌డ్యాన్స్ మూవ్‌లకు శిరీష్‌కుమార్ కొరియోగ్రఫీ చేశారు.

కలర్‌ఫుల్ జాతర నేపథ్యంలో సెట్ చేయబడిన గువ్వగూటిలో సాంగ్ ప్రత్యేకించి గణేష్ చతుర్థి పండక్కి ట్రీట్ కాబోతోంది. ఈ చిత్రంలో రీతూవర్మ హీరోఇన్‌గా నటిస్తుండగా, మీరా జాస్మిన్, సునీల్, దక్షనాగార్కర్, శరణ్యప్రదీప్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. వేద రామన్ శంకరన్ సినిమాటోగ్రాఫర్ కాగా, వివేక్‌సాగర్ సంగీతం అందిస్తున్నారు. జిఎం ఆర్ట్ డైరెక్టర్ కాగా, నందు మాస్టర్‌స్టంట్స్ నిర్వహిస్తు న్నారు. శ్వాగ్ అక్టోబర్ 4న థియే టర్లో విడుదల కానుంది.

## '6 జర్నీ' టీజర్ లాంచ్

**పాల్యం శేషమ్మ,** బసిరెడ్డి సమర్పణలో అరుణ కుమారి ఫిలింస్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం'6 జర్నీ'. రవి ప్రకాష్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యారెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. బసీర్ అలూరి దర్శకత్వంలో పాల్యం రవి ప్రకాష్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలకు సిద్ధమైన ఈ సినిమాను త్వరలోనే విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ మూవీ టీజర్‌ను పటేల్ రమేష్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో..

పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ, 'సినిమా టీజర్‌ను లాంచ్ చేయడం ఆనందంగా వుంది. నిర్మాత రవిప్రకాష్ రెడ్డి, దర్శకుడు బషీర్, సినిమా టీంకు ఆల్‌ది బెస్ట్. టీజర్ చాలా బాగుంది. విజువల్స్, ఆర్‌ఆర్ బాగున్నాయి. సినిమా టీంకు ది బెస్ట్' అని అన్నారు.

దర్శకుడు బసీర్ మాట్లాడుతూ, మా అందరినీ ఆశీర్వదించేందుకు వచ్చిన రమేష్ రెడ్డి అన్నకి వెంకట్ రెడ్డి అన్నకి, ప్రతాప్ రెడ్డి అన్నకి థాంక్స్. మా కోసం వచ్చిన మీడియా వారికి థాంక్స్. మా హీరో సమీర్ ఎంతో కష్టపడి నటించారు. రవిప్రకాష్ రెడ్డి ఈ మూవీని ముందుండి నడిపించారు. మా హీరోయిన్లు అద్భుతంగా నటించారు. టేస్టీ తేజ ఎనర్జీతో నటించారు. నాకు ఇంతమంచి ఛాన్స్ ఇచ్చిన మా నిర్మాతకు థాంక్స్ అన్నారు.

నిర్మాత రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, ఈ సినిమా నిర్మించడం, ఇందులో నటించడం ఆనందంగా ఉంది. అందరూ ఎంతగానో సపోర్ట్ చేశారు. సినిమా అద్భుతంగా వచ్చింది. టీజ్ అందరికీ నచ్చేలా ఉంది. చిత్రం కూడా అందరికీ నచ్చుతుంది అని అన్నారు.

సమీర్ దత్తా మాట్లా డుతూ, మా సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన వారందరికీ థాంక్స్. ఈ చిత్రంలో నాకు ఇంత మంచి రోల్‌ను ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. మా నిర్మాత రవి డబ్బులు పెట్టడమే కాదు. ఈ చిత్రంలో మంచి పాత్రను కూడా పోషించారు. బసీర్ సినిమాను అద్భుతంగా తీశారు. టీజర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను అని అన్నారు.

హీరోయిన్ పల్లవి మాట్లాడుతూ,'ఇంత మంచి పాత్రను నాకు ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. మా నిర్మాత రవి మాతో పాటు నటించారు. మా కెమెరామెన్ వల్లే నాకు ఈ అవకాశం వచ్చింది అని అన్నారు.

హీరోయిన్ రమ్యారెడ్డి మాట్లాడుతూ, మా కోసం వచ్చిన రమేష్ రెడ్డికి థాంక్స్. నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. ఇంత మంచి టీంతో పని చేయడం ఆనందంగా ఉంది. మా నిర్మాత రవి వల్ల ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. మాతో మున్ముందు సినిమాలుతీస్తూ, నటిస్తూఉండాలని కోరుకుంటున్నానన్నారు.



అవంతిక మాట్లాడుతూ, మా నిర్మాత రవి ఈ చిత్రం అద్భుతంగా నటించారు. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శకుడికి థాంక్స్. సినిమా చాలా బాగా వచ్చింది. అందరూ చూడండి' అని అన్నారు.

టేస్టీ తేజ మాట్లాడుతూ, నన్నునమ్మి ఇంత మంచిపాత్ర ఇచ్చినందుకు థాంక్స్. బిగ్ బాస్‌షోకి వెళ్లక ముందే ఈ ఆఫర్ వచ్చింది. బిగ్‌బాస్ నుంచి వచ్చాకకూడా మళ్లీషూట్‌లో పాల్గొన్నాను. కొత్త వాళ్లతో చేస్తున్న ఈ సినిమా కోసం మా రవి అన్న బడ్జెట్ గురించి ఎక్కడా ఆలోచించ లేదు అని అన్నారు.

## 'ది మిస్టరీ ఆఫ్ మోక్ష ఐలాండ్' ట్రైలర్ రిలీజ్

**ఆశుతోష్ రానా,** ప్రియా ఆనంద్, నందు, సోనియా అగర్వాల్, తేజస్విని మడివాడ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న వెబ్ సిరీస్ 'ది మిస్టర్ ఆఫ్ మోక్ష ఐల్యాండ్'. హాట్ స్టార్ స్పెషల్స్‌గా ఈ సిరీస్ ఈ నెల 20 వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. ఈ వెబ్ సిరీస్‌కు అనిష్ యొహాన్ కురువిల్లా దర్శకత్వం వహించారు. సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ది మిస్టర్ ఆఫ్ మోక్ష ఐలాండ్' సిరీస్ ట్రైలర్‌ను ఈ రోజు రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తోంది.

'ది మిస్టర్ ఆఫ్ మోక్ష ఐలాండ్' ట్రైలర్ ఎలా ఉందో చూస్తే- నికోబార్ ఐలాండ్స్‌లో ఉన్న ప్రైవేట్ ఐలాండ్ మోక్షను విజిట్ చేసేందుకు వెళ్తారు. మోక్ష ఐలాండ్ లోని ప్రతి జీవాన్ని, ప్రతి మార్గాన్ని డాక్టర్ విశ్వక్ సేన్ సృష్టిస్తాడు. అతనికి ప్రతిబింబం లాంటిదే ఈ ఐలాండ్ . అలాంటి దీవిలోకి అడుగుపెట్టిన వారసులకు అనూహ్యమైన ఘటనలు ఎదురవుతుంటాయి. ఒక్కొక్కరుగా చనిపోతుంటారు. వీరి హత్యలకు కారణం ఏంటి? అందమైన మోక్ష దీవిలో ఇలాంటి భయంకరమైన పరిస్థితులు ఎవరు సృష్టిస్తున్నారు. వారసులనే ఎందుకు టార్గెట్ చేశారు? అనే అంశాలతో ట్రైలర్ ఆసక్తిగా సాగింది. 'ది మిస్టర్ ఆఫ్ మోక్ష ఐలాండ్' సిరిస్‌పైకావాల్సినంత క్యూరియాసిటీని ట్రైలర్ క్రియేట్ చేస్తోంది.



# అమ్మాయిల మౌనానికి కారణం



**కొంత మంది అమ్మాయలు ఆకస్మాత్తుగా మాట్లాడటం తగ్గిస్తారు. పలకరించినా కూడా సరైన సమాధానమివ్వకుండా నిత్యం ఏదో కోల్పోయినట్లు ఉండటం చూసి తల్లిగా ఏం చేయాలో తెలియడం లేదు. ఇటువంటప్పుడు పిల్లలను సాధారణ స్థితికెలా తీసుకురావాలో చెబుతున్నారు నిపుణులు.**

పిల్లలు ఎదుగుతున్నప్పుడు పలురకాల భావోద్వేగాలకు గురవుతుంటారు. చదువులో అనుకున్న ర్యాంకు సాధించలేకపోవడం, ఇంట్లోవాళ్లు అడిగింది ఇవ్వకపోవడం వంటివి ఏవైనా కావొచ్చు. ఇటువంటి సందర్భాల్లో మౌనాన్ని వారెక్కువగా ఆశ్రయిసానతరు. అలాగే ఏదో కోల్పోయిన భావన వాళ్లలో కనిపిస్తుంది. ఈ మార్పును అమ్మానాన్నలే గుర్తించగలగాలి. ఆపై ముందు వాళ్ల మనసు తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ప్రేమగా దగ్గరకు తీసుకుని ఏది ఏమైనా మేమున్నామనే బరోసానివ్వాలి. వాళ్ల మనసులోని మాటను బయటకు చెప్పే ధైర్యాన్నివవ్వగలగాలి.

**నిందించకూడదు..** ఏదైనా పొరపాటు జరిగినా, మార్కులు తగ్గినా, అనుకున్న సీటు సంపాదించలేకపోయినా.. పిల్లలను వెంటనే నిందించకూడదు. నిన్ను చదివించడానికి మేమెంత కష్టపడుతున్నాము.. నీకు చదువు వృథా వంటి మాటలతో గాయపరచకూడదు. అప్పటికే వారెంతో ఆందోళన చెందుతుంటారు. అటువంటి సమయంలో వారికి వేదన కలిగిస్తే కుంగుబాటుకు దారితీసే ప్రమాదం లేకపోలేదు. అలా కాకుండా మరోసారి ప్రయత్నిస్తే అనుకున్నది సాధించగలమనే ధైర్యాన్నిస్తే మంచిది. ప్రతి చిన్న విషయాన్ని ప్రతికూలతగా ఆలోచించకుండా సానుకూల ధోరణి అలవడేలా చేయాలి. అప్పుడే వారిలో తిరిగి మరోసారి కృషి చేద్దామనే ఆలోచన మొదలవుతుంది.

**స్ఫూర్తి నింపాలి...** ఏ విషయాన్నైతే తమ సమస్యగా భావిస్తున్నారో దాన్ని పరిష్కరించుకునే పలు మార్గాలను వారెదుట ఉంచాలి. తీరని సమస్య అంటూ లేదని అవగాహన కలిగించాలి. ఇవన్నీ వారిలోని ఆత్మన్యూనతను దూరం చేసి, ప్రేరణ పొందేలా చేస్తాయి. అంతేకాదు, దేన్నైనా సాధించగలిగే సామర్థ్యం నీలో ఉందంటూ ఉత్సాహపరచాలి. గతంలో తను చేసిన సాధనలను గుర్తు చేసి ప్రశంసించాలి. ప్రతిభను మెచ్చుకుంటూ.. ముందడుగు వేసేలా ప్రోత్సహిస్తే చాలు. చదువులోనే కాదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకూ ఎదురు నిలిచి పోరాడే తత్వాన్ని నేర్చుకుంటారు. అనుకున్నవన్నీ సాధించి విజేతలుగా నిలుస్తారు.

# కాళ్లు లేకపోయినా ప్రపంచ రికార్డు

**వైకల్యంతో పుట్టిందని.. ముళ్ల పొదల్లోకి విసిరేస్తే.. విధి ఆమెను అమెరికా దంపతులకు దత్త పుత్రికను చేసింది. వైకల్యాన్ని ఓడించి ఆమె ట్రాక్‌పై నిలిచింది. రెండు చేతులపై శరీరాన్ని బ్యాలెన్స్ చేస్తూ స్కేటింగ్ చేసి తాజాగా ప్రపంచ రికార్డుకెక్కింది. కాళ్లు లేకపోయినా తన వేగానికి పరిమితి లేదంటున్నా 'కాన్యా సేసర్' గూర్చి తెలుసుకుందాం..**

1992, సెప్టెంబరు థాయ్‌లాండ్‌లో మధ్యాహ్న సమయం. పాక్‌చోంగ్‌కు సమీపంలో ఒకామెకు పసిబిడ్డ ఏడుపు వినిపించి వెతికింది. రోడ్డు పక్క ముళ్లతుప్పల్లో ఓ గులాబీరంగు మూట కనిపిస్తే పరుగున వెళ్లి తీసింది. అందులో కాళ్లు లేకుండా, చేతివేళ్లన్నీ అతుక్కొని, ముఖమంతా మురికితో ఒళ్లంతా గాయాలతో కనిపించిన పసిపిల్లను చూసి ఉలిక్కిపడిందామె. ఆ ప్రాంతంలో గ్యాంగ్‌స్టర్స్ పసివాళ్లను కిడ్నాప్ చేసి కాళ్లూ, చేతులూ తొలగించి బిక్షాటనకు పంపుతుంటారు. ఆ శిశువును కూడా అలా చేశారేమోననే అనుమానం వచ్చిందామెకు. వెంటనే ఆ పసిపాపతో పోలీసు స్టేషన్‌కు పరిగెత్తిందామె. పరిశీలనలో పుట్టుకతోనేకాళ్లు లేవని తెలిసింది. ప్రాథమిక చికిత్స నిమిత్తం పోలీసులు ఆసుపత్రికి తరలిస్తే అక్కడి సిబ్బంది ఒకామె ఆ బిడ్డను అయిదేళ్ల సాకింది. ముళ్ల పొదల మధ్య నా జీవితం మొదలైంది. మూటగా కట్టి పడి ఉన్న నేను ఏడవకపోయి ఉంటే ఈ జీవితం దొరకేది కాదేమో. నా అసలు తల్లిదండ్రులను కనిపెట్టడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఆ తర్వాత అమెరికాకు చెందిన జానె, డేవిడ్ సేసర్ దంపతులు నన్ను దత్తత తీసుకున్నారు. వాళ్ల ఇద్దరి పిల్లలతో కలిపి నన్నూ ఎంతో ప్రేమగా పెంచారు. బాల్యమంతా పోర్ట్‌ల్యాండ్‌లో గడిచింది. అతుక్కుని ఉండే నా చేతివేళ్లకు సర్జరీలు చేయించారు. నా ఎడమ చేతికిప్పుడు మూడు వేళ్లే మిగిలాయి. నిత్య ఉత్సాహంగా ఉండే నన్ను క్రీడల్లో చేర్చాలనుకుంది అమ్మ' అంటుంది కాన్యా.



స్కేట్‌బోర్డుపై.... కాన్యాను మొదట చీర్లీడింగ్ స్క్వాడ్‌లో చేర్చారు. పదోతరగతిలోకి వచ్చేసరికే వీల్‌చైర్ రేసింగ్, రగ్బీతోపాటు ఈత, సర్ఫింగ్, స్నోబోర్డింగ్, స్లెడ్జ్ హాకీల్లో కాన్యా సాధనలెన్నో చేసింది. ఆ తర్వాత పారాలింపిక్ ట్రాక్ రేసింగ్ అథ్లెట్‌గా జాతీయస్థాయి ఛాంపియన్‌సిప్ పోటీల్లో పాల్గొని పతకాలు దక్కించుకుంది. ప్రపంచంలో మూడవ వేగవంతమైన మహిళగా నిలిచింది. 2012లో స్విట్జర్లాండ్‌లో జరిగిన ట్రాక్‌రేసింగ్ ప్రపంచకప్‌లో అర్హతనూ సాధించింది. క్రీడలన్నింటిలోనూ ప్రతిభ ప్రదర్శించి ఆల్‌స్టార్ అవార్డు అందుకుంది. హాలీవుడ్ సినిమాలు బేబీలాన్, ద కీపర్‌ల్లో నటించింది. పలు టివి షొల్లో పాల్గొంది. అడిడాస్, సెఫోరా వంటి పలు ప్రముఖ సంస్థలకు



మోడల్‌గా పనిచేసింది. న్యూయార్క్ ఫ్యాషన్‌వీక్‌లో ర్యాంప్ వాక్ చేసింది. ఓసారి స్నేహితుడు స్కేట్ బోర్డ్‌పై సాధన చేయడం చూసి ఆ నరకీడపై కాన్యా మనసు పారేసుకుంది. పట్టుదలగా సాధన చేసి అందులోనూ నైపుణ్యాలను సంపాదించింది. ఈ క్రీడలో 2019 నుంచి జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీలకెళ్లి పతకాలనూ అందుకుంది. కాలిఫోర్నియాలో తాజాగా 19.65 సెకన్లు స్కేట్‌బోర్డుపైన రెండు చేతులపై శరీరాన్ని బ్యాలెన్స్ చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. ఆకాశమే హద్దుగా స్కేట్‌బోర్డ్‌పై విన్యాసాలతో, పలురకాల క్రీడల్లో ప్రతిభను ప్రదర్శిస్తూ నాలాంటివారందరినీ గర్వపడేలా చేయగలుగుతున్నా. అంతా నాకు వైకల్యం అంటే, నేను మాత్రం ఇది నా ప్రత్యేకతనే చెబుతాను. మనసుకు నచ్చింది. చేస్తే ఏదైనా సాధించొచ్చు. దొరికిన ఈ చిన్న జీవితాన్ని సంతోషంగా గడపాలని చెప్పే 31 ఏళ్ల కాన్యా తనలాంటి వారందరికీ స్ఫూర్తిదాయకం కదూ.

---

వంటచేసేటప్పుడు కొన్నిసార్లు పాత్రలు మాడిపోవడం సహజం. ఇవి ఒ పట్టాన వదలవు కూడా. ఈ

## గిన్నె మాడిందా..

చిట్కాలతో వాటిని మెరిసేలా చేసేయొచ్చిలా..

నిమ్మలోని ఆమ్లాలకు మరకల్ని తొలగించే గుణం ఉంది.

నిమ్మచెక్కను ఉప్పులో అది.. నానబెట్టిన పాత్రలను రుద్దాలి. మూడు మరకలు సులభంగా వదిలిపోతాయి.

బ్రేకింగ్ సోడాను నీటిలో కలిపి పేస్టులా చేసుకోవాలి. దాన్ని మాడిన గిన్నెలకు పట్టించి పది నిమిషాల తరవాత శుభ్రం చేస్తే మరకలు వదులుతాయి.

మాడిన గిన్నెను స్టౌవ్ మీద పెట్టి అందులో నీళ్ల, కొద్దిగా ఉప్పు వేసి అది కరిగే వరకూ మరిగించాలి. తరువాత స్క్రబ్బర్‌తో రుద్దితే మాడిన మరకలు కనిపించవు.

## వానల్లో పెద్దవాళ్ల కోసం !

**ఇంట్లో అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల** ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మారుతున్న సీజన్ తగ్గట్లుగా జాగ్రత్తలు తీసుకొంటూ పరిరక్షించాలి. వర్షాకాలంలో వారినెలా సంరక్షించాలో చూద్దాం.

కాచి చల్లార్చిన లేదా గోరువెచ్చని నీటిని తరచూ తీసుకోవడం అలవాటు చేయాలి. సాధారణ వర్షా కాలంలో నీటి ద్వారా కలరా, టైఫాయిడ్, డయేరియా వంటి అనారోగ్యాలు దరి చేరే ప్రమాదం ఉంది. దీని నిరోధించాంటే వేడి నీటిని మాత్రమే తాగాలి. స్నానానికి కూడా గోరు వెచ్చని నీటిని ఏర్పాటు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు ఉండాలి. రయిన్‌కోటు వంటి ఏర్పాట్లు ఉండేలా జాగ్రత్త పడాలి.

వ్యాధులెక్కువగా ప్రబలే సీజన్ కావడవంతో వ్యాధినిరోధక శక్తిని పెంచేలా ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు, అతి చల్లదనం. తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలి. వాతావరణంలో మార్పులు అతి చల్లదనం, తరచూ చినుకుల్లో తడవడంవల్ల జలుబు, జ్వరం, దగ్గు బాధిస్తాయి. వీటికి దూరంగా ఉంచాలంటే గింజధాన్యాలు, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఇవ్వాలి. తీపి, నూనె పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి. ఇంటి భోజనానికి పెద్దపీట వేసేలా చూడాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు సహా పీచు ఎక్కువగా ఉండే ఆహారానికి ప్రాధాన్యతనివ్వాలి. దీంతో జీర్ణశక్తి మెరుగుపడుతుంది. త్వరగా అనారోగ్యాలు దరిచేరవు.



వీరు విశ్రాంతి తీసుకునే గది, దాని చుట్టు పక్కల పరిశుభ్రంగా ఉండాలి. గదికి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తపడాలి. లేదంటే వాటిపై దోమలు పెరిగే ప్రాదం ఉంది. గదిలో వెలుతు ఉండేలా చూడాలి. ఇండోర్ ప్లాంట్స్ పెంపకం మంచిది. వీరు నిద్రపోయే గది వెచ్చగా ఉంటే రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. దోమ లెక్కువగా ఉండే ప్రాంతమైతే ఈ సీజన్ లో కిటికీలకు నెట్ వేయడం మంచిది. లేదంటే దోమకాటు కూడా తీవ్ర అనారోగ్యాలకు దారి తీస్తుంది.

## చాపింగ్ బోర్డుతో..

ఫొటోలో చూపినట్లుగా బాక్స్ మాదిరిగా ఉంటుంది బోర్డు. పైన

కాయగూరలు కట్ చేసుకోవడానికి వీలుగా చాపింగ్ బోర్డులా, బాక్స్ ఓపెన్ చేస్తే.. అందులో చాకులు, వివిధ రకాల స్లైసర్స్ అమర్చునేందుకు ప్రత్యేక అరలుంటాయి. ఇక ఈ బోర్డుకు మధ్య భాగంలో ఉన్న అటాచ్‌మెంట్‌ని తొలగించి..దాని స్థానంలో వివిధ రకాల స్లైసర్స్‌ని అమర్చుకొని.. ఉపయోగించుకోవచ్చు. ఇక బాక్స్ అడుగుబాగంలో జాలీ తరహా ఫోల్డబుల్ బాక్స్ ఒకటి చాపర్‌కు అనుసంధానమై ఉంటుంది. కట్ చేసిన కాయగూరల్ని ఇందులో వేసుకొని శుభ్రం చేసుకోవచ్చు. ఇలా ఒక చాపింగ్ బోర్డుతో ఎన్నో రకాల పనులు చేసుకోవచ్చు.

## పండ్లే చిత్రాలైతే..






చేతులు అద్భుతాలు చేస్తే..
ఇలా పండ్లూ, కూరగాయలే చిత్రాలవుతాయి. మనసుకు రెక్కలొచ్చి ఎక్కడికో వెళ్లిపోతుంది. కళ్లు ఆశ్చర్యానందాలతో రెట్టింపు అవుతాయి. ఇలాంటి రకరకాల భావాలు ఒకేసారి కలగడానికి కారణం. జపనీస్ కళాకారిణి టొమోకో సాటో చేతి నుంచి జాలువారిని చిత్రాలే. ఫ్రూట్ కార్వింగ్ కనువిందు చేస్తుందని తెలుసుగానీ.. మరీ ఇంత అందంగా, అపురూపంగా ఉంటుందంటే ఇంకా నమ్మబుద్ధ కావడం లేదు కదా..









---

ఆధ్యాత్మికం

## విఘ్నేశ్వరుడు



**విఘ్నేశ్వరుడు విఘ్నాలను** తొలగించే విఘ్నేశ్వరుడి జన్మదినమే వినాయకచవితి. ఏటా భాద్రపద మాసంలో శుక్లపక్ష చవితి రోజున దేశవ్యాప్తంగా ఈ పర్వదినానినన కన్నుల పండుగగా జరుపుకొంటారు. భారతీయ సమాజంలో వినాయకచవితికి విశిష్టమైన ప్రాముఖ్యం ఉంది. అది దంపతుల ప్రథమ కుమారుడైన వినాయకుడిని పూజించనిదే ఏ పనీ ప్రరాంభించరు. గణనాథుని కృప ఉంటే అన్నీ విజయాలే లభిస్తాయనేది ప్రజల విశ్వాసం. జోత్యతిషశాస్త్రం ప్రకారం విఘ్నేశ్వరుడి ఆరాధనలోకుజుడు, బుధుడు, కేతు గ్రహాల అనుగ్రహ సిద్ధి ఉంటుంది. విఘ్నేశ్వరుడు ధూమకేతు గణాధ్యక్షుడు, మోక్ష కారకత్వానికి అధినాయకుడు కావడంతో కేతు గ్రహానికి అధిపతి అయ్యాడని, బుధుడి అనుగ్రహంతో విద్య, జ్ఞానప్రాప్తి, వ్యాపారాభివృద్ధి కలుగుతుందని, అలాగే, కుజ గ్రహం అనుగ్రహం వివాహ, అన్యోన్య దాంపత్యానికి చిహ్నం. ఒక్క పార్వతీ తనయుడిని ఆరాధించడం వల్ల ఈ మూడు గ్రహాల అనుగ్రహం పొందవచ్చని జ్యోతిషశాస్త్రం పేర్కొంటోంది. విఘ్నాలు తొలగాలన్నీ, దృష్టి దోషములు పోవాలన్నా, ఆటంకాల నుంచి రక్షణ పొందాలన్నా, విద్య, బుద్ధి, సిద్ధి ప్రాప్తి కలగాలన్నా, బుద్ధి వికాసానికి వ్యాపారాభివృద్ధికి, మోక్ష ప్రాప్తికి విఘ్నేశ్వరుడి ఆరాధన కచ్చితంగా చేయాలని పురాణాలు చెబుతున్నాయి.

## గుండె ఆరోగ్యానికి..

**ప్రత్యేకించి మహిళలు గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే నెలసరి సమస్యల్ని తగ్గించుకోవడం,** పిసిఒఎస్‌ను అదుపు చేసుకోవడంతో పాటు మరికొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలంటున్నారు నిపుణులు.

వ్యాయామం ఎలాంటి సమస్యకైనా విరుగుడుగా పనిచేస్తుంది. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. తద్వారా గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం తగ్గయి అని కొన్ని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకే క్రమం తప్పకుండా వర్కవుట్‌ను రొటీన్‌లోన భాగం చేసుకోవడం మంచిది. రోజూ కనీసం పది వేల అడుగులు వేయడం, మెట్లెక్కడం, భోజనం తర్వాత కాసేపు నడవడం.. ఇలా శరీరానికి కాస్త శ్రమ కలిగించినా చక్కటి ఫలితం ఉంటుంది.



గుండె ఆరోగ్యంగా ఉండాలంటే బరువును అదుపులో ఉంచుకోవడం కూడా కీలకమే. ఈ క్రమంలో ఎత్తును బట్టి ఎంత బరువు (బిఎంఐ) ఉండాలో నిర్ధారించుకోవాలి. మీ బిఎంఐ ఎంతో తెలుసుకొని.. మీరు బరువు పెరగాలా, తగ్గాలా, దానికోసం ఎలాంటి ఆహార నియమాలు పాటించాలి. ఎలాంటి వ్యాయామాలు చేయాలి? వంటి విషయాలనీనన నిపుణులను అడిగి తెలుసుకుంటే మంచిది. ఇలా బిఎంఐని లఅదుపులో ఉంచుకోవడం వల్ల గుండె సమస్యలు వచ్చే అవకాశం 32 శాతం తగ్గుతుందట. రక్తంలో చక్కెర స్థాయులు బిపి ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవడం వల్ల ఏమైనా హెచ్చుతగ్గులుంటే డాక్టర్ సలహా మేరకు వాటిని అదుపు చేసుకోవచ్చు. చిరుతిండ్లు నూనె సంబంధిత పదార్థాలంటే ఎవరికైనా ఇష్టమే! కానీ వాటిని అమితంగా తీసుకుంటే మాత్రం బరువు పెరిగిపోయి తద్వారా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి ఇలాంటి ఆహార పదార్థాలను మితంగా తీసుకోవడం లేదా వీటిని పూర్తిగా పక్కన పెట్టేయడం మంచిదంటున్నారు నిపుణులు. శరీరానికి తగిన పని చెప్పకుండా గంటల తరబడి ఒకేచోట కూర్చుండిపోయే వారిలో గుండె జబ్బులు, మధుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువని చెబుతున్నాయి అధ్యయనాలు, కాబట్టి శరీరానికి తగినంత వ్యాయామం అందేలా జాగ్రత్తపడాలి.

## రుచికరమైన బిస్కెట్లు ..

బిస్కెట్లలో బోలెడన్ని రకాలుంటాయి కదూ! తమ తమ ఇష్టాలను బట్టి నచ్చేవి కొనుక్కుంటారు. అంతే తప్ప బిస్కెట్లు మన తయారు చేసుకోవడం కొంచెం తక్కువ. కానేఈ గోధుమపిండితో చేసే డైజెస్టివ్ బిస్కెట్లు చాలా సులువుగా ఇంట్లోనే చేసుకోవచ్చు. దీని కోసం స్వచ్ఛమైన గోధుమపిండి అరకిలో, పలు, పంచదార, రవ్వ, ఎండు కొబ్బరి ఒక్కోటీ కప్పు చొప్పున, సోంపు ఒకటిన్నర స్పూన్, నెయ్యి 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి.

ఒక పాత్రలో ఈ పదార్థాలు అన్నిటినీ వేసి బాగా కలపాలి. మెత్తటి ఈ పిండితో కొంచెం మందమైన రొట్టెలు చేయాలి. దాని



ఈద గ్లాసు లేదా మూతతో నొక్కి గుండ్రటి ఆకృతులు వచ్చేలా కట్ చేయాలి. వాటి మీద ఫోర్క్‌తో గుచ్చి, రంధ్రాలు చేయాలి అన్నీ పూర్తయ్యాక. కాగుతున్న నూనెలో వేయించుకంఉటే సరి. కరకరలాడే బిస్కెట్లు తయారైపోతాయి. ఇవెంతో రుచీ, ఆరోగ్యం కూడా. నిచ్చతే మీరూ చేసి చూడండి. పిల్లలూ పెద్దలూ అందరూ ఇష్టంగా తింటారు. ఇవి చాయ్‌లోకి మరింత బాగుంటాయి.



## ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో.. బోణీ కొట్టిన భారత్ హాకీ టీమ్

**ఢిల్లీ:** పారిస్‌ఒలింపిక్స్‌లో కాంస్యంతో చరిత్ర సృష్టించిన భారత్ పురుషుల హాకీ జట్టు మరో టైటిల్ వేటను విజయంతో మొదలెట్టింది. విశ్వ క్రీడల తర్వాత ఆడుతున్న తొలి టోర్నీలో పంజా విసిరింది. ఆదివారం ప్రారంభమైన ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ-2024లో టీమిండియా బోణీ కొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ అద్భుతంగా ఆడి 3-0తో చైనాను చిత్తుగా ఓడించింది. ఆట ఆరంభంలోనే చైనా ఆటగాళ్లు కౌంటర్ అటాక్‌తో భయపెట్టారు. కానీ భారత్ డిఫెన్స్ వాళ్లను సమర్థవంతంగా అడ్డుకుంది. అభిషేక్ సింగ్5వ నిముషంలోనే గోల్ కొట్టి భారత్ ఆధిక్యాన్ని 1-0కు పెంచాడు. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచలేకపోయాడు. అయితేనేమి ఆ వెంటనే సుఖ్‌జీత్, ఉత్తమ్‌లు తలా ఒక గోల్‌కొట్టడంతో భారత్ 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆఖర్లో చైనా ఆటగాళ్లు గోల్ కొట్టేందుకు ఎంతో ప్రయత్నించి పెనాల్టీ కార్నర్‌లతో పరువు కాపాడుకోవాలని చూశారు. కానీ భారత్ డిఫెన్స్ వాళ్ల ఎత్తులను చిత్తు చేసింది. తర్వాతి మ్యాచ్‌లో భారత్ జట్టు ఈ నెల 9వ తేదీన జపాన్‌తో తలపడనుంది.



## టి20 సిరీస్ ఆసీస్ క్లీన్ స్వీప్
### స్కాట్లాండ్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం

**ఢిల్లీ:** టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా కైవసం చేసుకుంది. ఎడిన్‌బర్గ్ వేదికగా స్కాట్లాండ్‌తో జరిగిన మూడో టీ20లో 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆసిస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈమ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన స్కాటీష్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. స్కాట్లాండ్ బ్యాటర్లల్లో బ్రాండెన్ మెక్‌కల్లమ్ 56 పరుగులతో అర్ధ సెంచరీ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో కామెరూన్ గ్రీన్ 3 వికెట్లతో సత్తా చాటగా, హార్డీ, అబాట్ తలా రెండు వికెట్లు సాధించారు. అనంతరం 150 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 16.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయిఛేదించింది. బౌలింగ్‌లో అదరగొట్టిన గ్రీన్, బ్యాటింగ్‌లోనూ దుమ్మురేపాడు. 23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సుల సాయంతో 62 పరుగులతో అర్ధ చెంచరీ చేసి అజేయంగా నిలిచాడు. అతడితో పాటు, మార్ష్ 31పరుగులు చేశాడు. స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్లీ క్యూరీ2 వికెట్లుపడగొట్టగా, సోలే, జర్వీన్ తలా వికెట్ సాధించారు. ఇక ఈ సిరీస్‌లో విజయం సాధించిన కంగారులు ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మూడు టీ 20, మూడు వన్డేల సిరీస్‌తో ఇంగ్లడ్‌తో ఆస్ట్రేలియా తలపడనుంది.

# పారాలింపిక్స్‌లో ముగిసిన భారత్ పతకాల వేట




### 29 పతకాలతో 18వ స్థానంలో భారత్
### అత్యధికంగా 219 పతకాలతో అగ్రస్థానంలో చైనా
### రెండు, మూడు స్థానాల్లో బ్రిటన్, అమెరికా

**ఢిల్లీ:** పారాలింపిక్స్ గేమ్స్-2024లో భారత్ పతకాల వేట ముగిసింది. ఇందులో భాగంగా ఆదివారం చివరి రోజు పూజా ఓజా చివరి అథ్లెట్‌గా నిలిచింది. ఓజా మహిళల కయాక్ 200 మీటర్ల ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలం కావడంతో పతకాల పోటీ నుండి నిష్క్రమించింది. దీంతో ఈ పారాలింపిక్స్‌లో భారత్ ఖాతాలో పతకాల సంఖ్య 29 వద్ద ముగిసింది. ఇక ఈ పారిలింపిక్స్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా భారత్ పతకాల మోత మోగించింది. స్విట్జర్లాండ్, బెల్జియం, దక్షిణ కొరియా, టర్కీ, అర్జెంటీనా అగ్రశ్రేణి దేశాలను ఓడించి పారిస్ పారా గేమ్స్‌ను ప్రపంచంలోని టాప్ 20 దేశాల జాబితాలో భారత్ చేరింది.

ఈ పారాలింపిక్స్‌లో భారత్‌కు మొత్తం 29 పతకాలు లభించగా, ఇందులో 7 స్వర్ణం, 9 రజతం, 13 కాంస్య పతకాలు ఉన్నాయి. పారాలింపిక్స్ పతకాల పట్టికలో భారత్ 18వ స్థానానికి చేరింది. ఈ పాలింపిక్స్‌లో 219 పతకాలతో (స్వర్ణం 94, రజతం 75, కాంస్యం 50) చైనా అగ్ర స్థానంలో ఉండగా, 124 పతకాలు (49 స్వర్ణం, 44 రజతం, 31 కాంస్యం)తో బ్రిటన్ రెండో స్థానం, 104 పతకాలతో (36 స్వర్ణం, 41 రజతం, 27 కాంస్యం) అమెరికా మూడో స్థానంలో నిలిచింది. ఈ ఈవెంట్‌లో విజయం సాధించడానికి పోటీ పడిన పాకిస్తాన్ పతకాల పట్టికలో 79వ స్థానంతో ముగించింది. ఇక పారాలింపిక్స్‌లో భాగంగా భారత్‌కు మరో స్వర్ణ పతకం, కాంస్య పతకం లభించింది. దీంతో భారత్ ఖాతాలో పతకాల సంఖ్య 29కి చేరింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్-41 విభాగంలో నవదీప్ సింగ్ ఈ గోల్డ్ మెడల్‌ను దక్కించుకున్నాడు. అయిత అనూహ్య పరిణామాల నేపథ్యంలో నవదీప్‌కు ఈ స్వర్ణ పతకం చేరింది. భారత్ కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారు ఝామున జరిగిన ఫైనల్లో 47.32 మీటర్ల త్రో విసిరిన నవదీప్, తొలుత రెండో స్థానంలో నిలిచి రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇదే విభాగంలో ఇరాన్‌కు చెందిన అథ్లెట్ సదేగ్ బీత్ సయా 47.64 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. అయితే అంతర్జాతీయ పారాలింపిక్స్ కమిటీ నిబంధనలు ఉల్లంఘించినందుకు సదేగ్‌పై అనర్హత వేటు పడింది. ఈ ఈవెంట్‌లో రెండు సార్లు అతడు ఎల్లో కార్డ్ అందుకున్నాడు. ఫలితంగా ఆఖరి రెండో కార్డ్‌తో పతకానికి అనర్హుడయ్యాడు. అనూహ్యంగా అతనిపై వేటు పడటంతో తదుపరి రెండో స్థానంలో నిలిచిన నవదీప్‌కు రజత పతకం కాస్తా స్వర్ణంగా మారింది. కాగా పారాలింపిక్ కమిటీ 8.1 నియమం ప్రకారం క్రీడల్లో అథ్లెట్ దురుసు ప్రవర్తన, రాజకీయ పార్టీలకు సంబంధించిన గుర్తులు ప్రదర్శించడం నిషేధం. ఒకవేళ ఈ నిబంధనలను అథ్లెట్లు ఉల్లంఘిస్తే రెండు పసుపు కార్డులు అందుకుంటారు. ఫలితంగా రెడ్ కార్డు (అనర్హత) ఎదుర్కోవాల్సిన ఉంటుంది. ఈ విధంగానే సదేగ్‌పై అనర్హత వేటు పడటంతో భారత్‌కు కలిసొచ్చింది. అలాగే మహిళల టీ13 విభాగంలో సిమ్రాన్ శర్మ కంచు మోత మోగించింది. సిమ్రాన్ 200 మీటర్ల టీ 12 ఫైనల్ రేసులో 24.75 సెకన్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం గెలిచింది. 100 మీటర్ల పరుగు పందెంలో పతకాన్ని చేజార్చుకున్న సిమ్రాన్ 200 మీటర్ల రేసులో సత్తా చాటింది.

**భారత్‌కు స్వర్ణం సాధించింది వీరే**

కాగా పారాలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన భారత్ అథ్లెట్లలో భారత్ అథ్లెట్లలో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో అవనీ లేఖరా, పారా బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో నితేశ్ కుమార్, పురుషుల జావెలిన్ త్రోలో సుమిత్ అంటిల్, పారా ఆర్చరీ పురుషుల వ్యక్తిగత రికర్వ్ ఓపెన్‌లో హర్విందర్ సింగ్, పారా అథ్లెటిక్స్ పురుషుల క్లబ్ త్రోలో ధరంబీర్, పురుషుల హై జంప్ టీ 64 విభాగంలో పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, పురుషుల జావెలిన్ త్రో ఎఫ్-41 విభాగంలో నవదీప్ సింగ్ ఉన్నారు.

# దులీప్ ట్రోఫీలో ఇండియా బి విజయం



### భారీ శతకంతో విజృంభించిన ముషీర్ ఖాన్

**ఢిల్లీ:** దులీప్ ట్రోఫీ తొలి మ్యాచ్ నాలుగు రోజుల్లోనే ముగిసింది. బెంగుళూరు వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఏపై ఇండియా-బి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా-బి బ్యాటర్ ముషీర్ ఖాన్ భారీ శతకంతో 181 పరుగు చేసి విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 321 పరుగులు చేసింది. 94 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన జట్టును 56 పరుగులు చేసిని నవదీప్ సైనీ సహకారంతో ముషీర్ ఆదుకున్నాడు. ఇండియా-ఏ బౌలర్లలో ఆకాశ్‌దీప్ 4 వికెట్లు, ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు, ఆవేశ్ ఖాన్ 2 వికెట్లు, కుల్దీప్ యాదవ్ ఒక వికెట్టు పడగొట్టారు. ఇండియా-బి బౌలర్లు కలిసికట్టుగా రాణించడంతో ఇండియా-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 231 పరుగులకు ఆలౌట్ అయింది. ముఖేశ్ కుమార్ 3 వికెట్లు, నవ్‌దీప్ సైనీ 3 వికెట్లు, సాయికిషోర్ 2 వికెట్లు, యశ్‌దయాల్, సుందర్ చెరో వికెట్ పడగొట్టారు. ఇండియా-ఏ ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ 37 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అలాగే ఇండియా-ఏ బౌలర్లలో ఆకాశ్‌దీప్ 5 వికెట్లతో రాణించడంతో ఇండియా-బి రెండో ఇన్నింగ్స్‌లో 184 పరుగులకు ఆలౌట్ అయింది. ఖలీల్ అహ్మద్ 3 వికెట్లు, ఆవేశ్ ఖాన్, తనుశ్ కోటియన్ తలో వికెట్ తీసుకున్నారు. ఇండియా-బి ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్ 61 పరుగులు, సర్ఫరాజ్ ఖాన్ 46 పరుగలతో రాణించారు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ ఏడు క్యాచ్‌లు పట్టుకున్నాడు. ఇక 275 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దగిన ఇండియా-ఏ ఆది నుండి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఓటమి పాలైంది. ఆ జట్టు 198 పరుగులకు ఆలౌట్ అయి, 76 పరుగుల తేడాతో పరాజయాన్ని ఎదుర్కొంది. కెఎల్ రాహుల్ 57 పరుగులతో ఇండియా-ఏను ఆదుకునేందుకు విఫలయత్నం చేశాడు. ఆఖర్లో ఆకాశ్‌దీప్ వేగంగా 43 పరుగులు సాధించినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇండియా-బి బౌలర్లలో యశ్ దయాల్ 3 వికెట్లు, ముకేశ్ కుమార్, నవ్‌దీప్ సైనపీ తలో 2 వికెట్టు, నితీశ్‌రెడ్డి, సుందర్ చెరో వికెట్ పడగొట్టారు.



## యుఎస్ ఓపెన్ విజేతగా సబలెంక

**ఢిల్లీ:** యుఎస్ ఓపెన్-2024 మహిళల ఛాంపియన్‌గా అరీనా సబలెంక నిలిచింది. ఫైనల్స్‌లో అమెరికాకు చెందిన జెస్సికా పెగులాపై 7-5, 7-5 తేడాతో సబలెంక గెలుపు సాధించింది. దీంతో తన కెరీర్‌లో తొలిసారి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ట్రోఫిని అందుకున్న వెంటనే కోర్టంతా తిరుగుతూ ఆమె ఉద్వేగానికి గురయింది. ప్రపంచ నంబర్ 2 ర్యాంకర్ అయిన సబలెంక గత యూఎస్ ఓపెన్ ఫైనల్స్‌కు చేరినప్పటకీ ఆమె టైటిల్‌ను సాధించ లేకపోయింది.

కోకో గాఫ్ చేతిలో ఓటమి చవిచూసింది. అయితే ఇప్పుడు ఈ యూఎస్ ఓపెన్‌ను గెలిచిన 26 ఏండ్ల బెలారస్ క్రీడాకారిణి సబలెంక తన గ్రాండ్ స్లామ్‌ల సంఖ్యను మూడుకు చేర్చింది. 2023, 2024లో సబలెంక ఆస్ట్రేలియన్ ఓపెన్ ఛాంపియన్‌షిప్ నెగ్గింది.

# వాణిజ్యం

## నేడే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8:** హెల్త్ అండ్ లైఫ్ ప్రీమియంలపై 18శాతం జిఎస్‌టిని తగ్గించడంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని జిఎస్‌టి కౌన్సిల్ అనేక ముఖ్యమైన సమస్యలను పరిష్కరించడానికి సోమవారం సమావేశం కానుంది. ఇన్సూరెన్స్ ప్రీమియంలపై పన్ను భారాన్ని తగ్గించడానికి దేశవ్యాప్తంగా మద్దతు పెరుగుతున్నప్పటికీ, ప్రయోజనాలు వాస్తవానికి పాలసీదారులకు చేరుతాయా లేదా బీమా కంపెనీల వద్దనే ఉంటాయా అనే దానిపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. జిఎస్‌టిని తగ్గించినప్పటికీ బీమా సంస్థలు ఆర్థిక ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయకుండా ఉంచవచ్చు. దేశంలోని ఇన్సూరెన్స్ కంపెనీలు కరోనా తర్వాత పాలసీ క్లెయిమ్స్ పెరిగిన వేళ తమ పాలసీ ప్రీమియంలను పెంచాయి.జిఎస్‌టి తగ్గించబడినా కూడా ఈ పద్ధతి కొనసాగు తుందని చాలా మంది మంత్రులు భయపడుతున్నారు. లాభదాయక నిరోధక చట్టాలు ఇకపై సక్రమంగా లేనందున, పన్ను తగ్గింపు పాలసీదారులకు తక్కువ ప్రీమియంలకు దారితీస్తుందనే



హామీ చాలా తక్కువగా ఉంది. రూ.50 వేల నుంచి రూ.60 వేల మధ్య వార్షిక ప్రీమియంలతో బీమా పాలసీలకు పన్ను మినహాయింపు అందించడం అనేది చర్చలో ఉన్న ఒక ప్రతిపాదన. ఇది చాలా మధ్యతరగతి కుటుంబాలకు పెద్దగా సహాయం చేయకపోవచ్చు. నలుగురితో కూడిన సాధారణ కుటుంబం తరచుగా రూ.15 లక్షల కవర్‌తో ఆరోగ్య ఈబీమా పాలసీ కోసం దాదాపు రూ.50వేలు చెల్లిస్తుంది. తీవ్రమైన అనారోగ్యం సంభవించిన ప్పుడు ఇది సరిపోదు. సీనియర్ సిటిజన్‌లకు, వయస్సు ఆరోగ్య ప్రమాదాల కారణంగా ప్రీమియంలు మరింత ఎక్కువగా ఉంటాయి. పన్ను ప్రయోజనాల కోసం అటువంటి పరిమితులను సెట్ చేయడం జిఎస్‌టి వ్యవస్థను క్లిష్టతరం చేస్తుంది. ఇది వాస్తవానికి పన్నును సరళీకృతం చేయడానికి ఉద్దేశించబడింది. ప్రస్తుత తరుణంలో ఆరోగ్య బీమాపై జిఎస్‌టి తగ్గింపుతో వచ్చే ఆదాయ నష్టం గురించి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జాగ్రత్తపడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం కేవలం హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంల నుంచి రూ.8,200 కోట్లకుపైగా వసూలు చేయబడింది.

## టాటా సన్స్ చైర్మన్ యేడాది వేతనం రూ.135 కోట్లు



**ముంబై, సెప్టెంబర్ 8:** టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వేతనం యేడాదికి రూ.135 కోట్లు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ ఆయన ఈ మొత్తం అందుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 20శాతం అధికం. దేశంలోని ఏ ఇతర కంపెనీ బాస్ కూడా ఇంత మొత్తంలో వేతనం అందుకోకపోవడం విశేషం. టాటా సన్స్ సిఎఫ్ఒ సౌరభ్ అగర్వాల్ కూడా యేడాదికి రూ.30 కోట్లు వేతనం అందుకున్నారు. టాటా గ్రూపులో రెండో అతిపెద్ద వేతనం ఆయనదే. టిసిఎస్, టాటా స్టీల్, తాజ్ హోటల్స్ చీఫ్‌ల కంటే ఆయన వేతనమే ఎక్కువ. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కంపెనీ వార్షిక నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2016లో టాటా బోర్డులో చేరిన చంద్రశేఖరన్ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.113 కోట్లు ఆర్జించారు. ఈ యేడాది రూ.135.32 కోట్లు పొందారు. ఇందులో రూ.121.5 కోట్లు కమీషన్ కాగా, మిగిలిన మొత్తం ఆయన వేతనం. ఇక టిసిఎస్ సిఇఒ కృతి వాసన్ వార్షిక వేతనం రూ.25 కోట్లు కాగా, ఐహెచ్‌సిఎల్ హెడ్ పునీత్ చత్వాల్ వేతనం రూ.19కోట్లుగా ఉంది. టాటా స్టీల్ చీఫ్ టివి నరేంద్రన్ యేడాదికి రూ.17 కోట్లు అందుకుంటున్నారు. ఇక టాటా గ్రూపులో అత్యధిక వేతనం అందుకుంటున్న వారిలో టాటా పవర్ సిఇఒ ప్రవీర్ సిన్హా, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సునీల్ డిసౌజా యేడాదికి రూ.10 కోట్లు చొప్పున అందుకుంటున్నారు. టాటా కెమికల్స్ సిఇఒ ఆర్ ముకుందన్ రూ.8కోట్లు ఆర్జిస్తున్నారు. టాటా గ్రూపు సిఇఒలకు వేతనంతో పాటు కంపెనీలో వాటాలూ ఉంటాయి. అయితే విప్రో సిఇఒగా వ్యవహరించిన థియరీ డెలాపోర్టే గత ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.167కోట్లు కంపెనీ నుంచి అందుకున్నారు. ఈ మొత్తంలో పరిహార ప్యాకేజీతో పాటు ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ చెల్లింపులు ఉన్నాయి. దీంతో వేతనం పరంగా చంద్రశేఖరన్ అత్యధిక వేతనం అందుకుంటున్న వ్యక్తిగా నిలిచారు.


## అప్పుల కోసం స్పైస్‌జెట్ తిప్పలు!

**ముంబై, సెప్టెంబర్ 8:** గ్రౌండ్ అయిన విమానాలను తిరిగి సర్వీసులోకి తెచ్చేందుకు స్పైస్‌జెట్ సంస్థ ప్రమోటర్ల పెట్టుబడుల ద్వారా, క్వాలిఫైడ్ ఇన్స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్, వారెంట్స్ రూపంలో రూ.3,200 కోట్లు సేకరించాలని ప్రణాళికలు చేస్తోంది. అయితే అప్పులను తీర్చడానికి గానూ, ఇప్పటికే గ్రౌండ్ అయిన విమానాలను కూడా తిరిగి సర్వీసులోకి తెచ్చేందుకు ఈ ఫండ్స్‌ను సేకరించి, వాటికోసం వాడనున్నట్లు సంస్థ తెలిపింది. అయితే



స్పైస్‌జెట్ ఇన్వెస్టర్ల ప్రజెంటేషన్‌లో రూ.736 కోట్లను ప్రమోటర్ల పెట్టుబడుల ద్వారా, వారెంట్స్‌ను ఇష్యూ చేయడం ద్వారా, వారెంట్స్‌ను ఇష్యూ చేయడం ద్వారా సేకరించాలని, మరో రూ.2500 కోట్లను క్యూఐపి ద్వారా సేకరించాలని ప్రణాళికలు చేస్తున్నట్లు సంస్థ తెలిపింది. అయితే గతేడాదే డిసెంబర్ నెలలో రూ.2,250 కోట్లు సేకరిస్తామని కంపెనీ తెలిపినా, కేవలం రూ.1,060 కోట్లను మాత్రమే ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా సేకరించగలిగింది. ప్రస్తుత రూ.3,200 కోట్ల ఫండ్స్ సేకరణ మాత్రం షేర్‌హోల్డర్ల అనుమతులపై ఆధారపడి ఉంది. కాగా తమ సంస్థలో విమానాలు తగ్గడం, వర్కింగ్ కేపిటల్ ఖర్చులు పెరగడం, ఎయిర్‌పోర్టుల వద్ద ఫిక్స్‌డ రెంటల్స్ ఉండడం, బకాయిలు లాంటినలు సమస్యలను సంస్థ ఎదుర్కొంటోంది.

## ఈ వారం మార్కెట్ తీరుతెన్నులు



**ముంబై, సెప్టెంబర్ 8:** గడచిన వారం దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండు వారాల పాటు బుల్ జోరును కొనసాగించిన తర్వాత అనూహ్యంగా నష్టాలను చవిచూశాయి. దీనికి ప్రధానంగా అమెరికా మార్కెట్లలో కల్లోలం ప్రధాన కారణంగా నిలిచింది. అయితే ఈక్రమంలో చాలా మంది పెట్టుబడిదారులు రానున్న వారం ఎలా ఉంటాయనే గందరగోళం ఉంది. ఈ క్రమంలో మార్కెట్లను ప్రభావితం చేయనున్న అంశాలను ఇప్పుడు పరిశీలిద్దాం. వాస్తవానికి మార్కెట్లు ఓవర్ బాట్ జోన్‌లో ఉన్నందున ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడంతో షార్ప్ కరెక్షన్ కనిపించింది. ఎఫ్ఎంసిజి, ఫార్మా వంటి డిఫెన్సివ్ స్టాక్‌లు కరెక్షన్ సమయంలో స్థితిస్థాపకతను చూపుతాయని భావిస్తున్నారు. నిపుణులు ఈ అనిశ్చిత దశలో వ్యాపారులు నష్టాన్ని కలిగించే ట్రేడ్‌లను సగటున తగ్గించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో పెట్టుబడిదారుల చూపు దేశీయంగా పెట్టుబడిదారులు సెప్టెంబర్ 12న భారత దేశ పారిశ్రామికోత్పత్తి సూచిక, వినియోగదారుల ధరల సూచిక విడుదలతో కీలక ఆర్థిక సూచికల డేటా కోసం ఎదురుచూస్తున్నాయి. ఈ క్రమంలో రానున్న వారంలో దేశీయ స్టాక్‌మార్కెట్లో ఇప్పటికీ ఐపిఒల రద్దీ కొనసాగుతూనే ఉంది. కొత్తగా 13 ఐపిఒలు మార్కెట్లోకి వస్తుండగా, 8 లిస్టింగ్‌లు కూడా జరగనున్నాయి. గడచిన వారం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.2,430.48 కోట్లను ఇన్ ఫ్యూజ్ చేశారు. ఇదే క్రమంలో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు కూడా కొనుగోళ్ల జోరును కొనసాగించి రూ.7,442.19 కోట్లను మార్కెట్లో పెట్టుబడులుగా పెట్టారు. అలాగే ఎఫ్‌పిఐలు రూ.10,978 కోట్ల విలువైన భారతీయ ఈక్విటీలలో పెట్టుబడిపెట్టాయి. భారతీయ పెట్టుబడిదారులు యుఎస్‌పై దృష్టిసారించి గ్లోబల్ మార్కెట్ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తారు. వాస్తవానికి ట్రేడర్లు, ఇన్వెస్టర్లు ప్రారంభంలో ఊహించిన దాని కంటే బలహీనమైన యుఎస్ ఉద్యోగ డేటాకు ప్రతిస్పందిస్తారు. సెప్టెంబర్ 11న అమెరికా ద్రవ్యోల్బణం నివేదిక, సెప్టెంబర్ 14న ప్రొడ్యూసర్ ప్రైస్ ఇండెక్స్‌తో సహా అదనపు కీలకమైన డేటా, ఫెడ్ సంభావ్య ద్రవ్య విధాన కదలికలపై మరింత అంతర్దృష్టిని అందిస్తుంది.

## ఐపిఒకు ట్రాఫిక్‌సోల్ ఐటిఎస్ టెక్నాలజీస్

**ముంబై, సెప్టెంబర్ 8:** ట్రాఫిక్ సోల్ ఐటిఎస్ టెక్నాలజీస్ రిటైల్ ఇన్వెస్టర్ల సబ్‌స్క్రిప్షన్ కోసం కంపెనీ ఐపిఒ సెప్టెంబర్ 10 నుంచి 13 వరకు అందుబాటులో ఉండనుంది. ఈ క్రమంలో కంపెనీ తన ఐపిఒ ప్రైస్ బ్యాండ్ ధరను ఒక్కో షేరుకు రూ.70గా నిర్ణయించింది. ట్రాఫిక్‌సోల్ ఐటిఎస్ టెక్నాలజీస్ ఐపిఒ రూ.44.87 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం ఐపిఒ పూర్తిగా తాజా ఇష్యూగా కంపెనీ వెల్లడించింది. కంపెనీ ప్రమోటర్లుగా జితేంద్ర నారాయణ్ దాస్, పూనమ్ దాస్ ఉన్నారు. ఐపిఒ




ప్రారంభానికి ముందే ఇన్వెస్టర్ల నుంచి కంపెనీ షేర్లపై భారీ స్పందన కనిపిస్తోంది. దీంతో ఐపిఒకు గ్రే మార్కెట్లలో బలమైన స్పందన నమోదైంది. ప్రస్తుతం గ్రేమార్కెట్లో ఒక్కో షేరుపై రూ.80 ప్రీమియం ధర పలుకుతోంది. ఇదే ధర లిస్టింగ్ రోజు వరకు కొనసాగితే ఒక్కో షేరు మార్కెట్లో రూ.150 ధరకు బలమైన జాబితాను నమోదు చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే కంపెనీ షేర్లపై బెట్టింగ్ వేసి షేర్లు పొందే దరఖాస్తుదారులు 115 శాతం రాబడిని అందుకుంటారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం కంపెనీ షేర్ల లిస్టింగ్ సెప్టెంబర్ 17న ఉంటుందని తెలుస్తోంది.

## వడ్డీరేట్లు సవరించిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు

**ముంబై, సెప్టెంబర్ 8:** ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు తన వినియోగదారులకు షాక్ఇచ్చింది. తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటును 5 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. అయితే 3 నెలల కాల వ్యవధి మినహా ఎలాంటి రుణ రేట్లను బ్యాంకు సవరించ లేదు. మూడు నెలల కాలానికి రుణ రేటు 9.25 శాతం నుంచి ఇప్పుడు 9.30 శాతానికి పెరిగింది. ఈ పెంపు సెప్టెంబర్ 7 నుంచి అమల్లోకి వచ్చినట్లు బ్యాంకు తన వెబ్‌సైట్‌లో చూపిస్తుంది. వడ్డీరేట్లు ప్రస్తుతం 9.10శాతం నుంచి 9.45శాతం మధ్య ఉన్నాయి. ఓవర్‌నైట్ వడ్డీరేటు 9.10శాతం, ఒక నెలకు 9.15 శాతం, మూడు నెలల వ్యవధి కాలానికి మాత్రం ఇంతకు ముందు 9.25శాతం ఉండగా, ఇప్పుడు 5బిపిఎస్ పాయింట్ల పెంపుతో 9.30శాతానికి పెరిగింది. ఆరు నెలలకు 9.40శాతం, ఒక సంవత్సరం కాలానికి 9.45శాతం వద్ద ఉంది. ఈ పెంపుదలతో బ్యాంకు నుంచి మూడు నెలల కాలానికి తీసుకునే హోమ్ లోన్, వ్యాపార, వ్యక్తిగత రుణంపై వడ్డీ పెరగనుంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.